RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 10.03.2025 | సంపుటి : 11 సంచిక : 238 | పేజీలు : 12 వెల: రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి 98483 28698






## రైతన్నతోపాటు నేతన్నకూ ప్రాధాన్యత

### ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు

### తెలంగాణ ఉద్యమం కోసం ఆయన త్యాగాలు మరువలేనివి: సీఎం రేవంత్

- కులగణనతో బీసీలకు న్యాయం చేయాలన్నదే రాహుల్ ఆశయం
- మండల్ కమిషన్ వేసి వారికి రిజర్వేషన్లు పెంచింది కాంగ్రెస్సే..
- కులగణన నచ్చనివారే సర్వేపై దుష్ప్రచారం చేస్తున్నారు
- మహిళా సంఘాల్లోని సభ్యులకు ఒక్కొక్కరికి రెండు చీరలు
- హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన అఖిల భారత పద్మశాలి మహాసభలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ఉద్యమం కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ ఎన్నో త్యాగాలు చేశారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆయన చనిపోతే మాజీ సీఎం కనీసం చూసేందుకు కూడా వెళ్లలేదని విమర్శించారు. టెక్స్‌టైల్ వర్సిటీ ఏర్పాటు చేసి దానికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టామని గుర్తుచేశారు. ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీకి కూడా ఆయన పేరు పెట్టనున్నట్లు వెల్లడించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన అఖిల భారత పద్మశాలి మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు.రైతన్నలకు ఇస్తున్న ప్రాధాన్యతను నేతన్నలకు కూడా ఇస్తున్నాం. నన్ను ఆశీర్వదించిన కుటుంబాలకు ఏదైనా చేయాలనే తపనతో ఉన్నా. నన్ను గుండెల్లో పెట్టుకున్న మీ రుణం తీర్చుకుంటాను. నేతన్నలకు ప్రభుత్వ ఆర్డర్లను రద్దు చేసిన అప్రతిష్ట ఉండొద్దని భావించాను. అందుకే, మహిళా సంఘాల్లోని వారికి రెండు చీరలు ఇవ్వాలని

మిగతా 2లో..

## చేనేత కార్మికులకు రుణమాఫీ

**పథకానికి నిధులకు విడుదలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్**

**రూ.33 కోట్ల రుణమాఫీకి ప్రాథమిక అనుమతులు మంజూరు**

**పథకం ద్వారా రూ.లక్ష వరకు ఉన్న రుణాలను మాఫీచేయనున్న ప్రభుత్వం**

**2017 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు ఉన్న బకాయిలకు వర్తింపు**

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో చేనేత కార్మికులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ తెలిపింది. చేనేత కార్మికుల రుణమాఫీ పథకానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. చేనేత కార్మికులకు రూ.33 కోట్ల రుణమాఫీకి ప్రాథమిక అనుమతులు మంజూరు అయ్యాయి. ఈ పథకం ద్వారా చేనేత కార్మికులకు రూ.లక్ష వరకు ఉన్న

మిగతా 2లో..



### యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు

## రూ.11,600 కోట్లు

### కేటాయించినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటన






**హైదరాబాద్(జనంసాక్షి):** 55 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు రూ.11,600 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన, సామన్య, మధ్యతరగతి పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించడానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మాణం చేస్తున్నామని అన్నారు.కాగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల నిర్మాణానికి రూ.11 వేల కోట్లను విద్యాశాఖ మంజూరు చేసింది. 55 అసెంబ్లీ నియోజకవర్గాల్లో గురుకుల పాఠశాలల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఒక్కో స్కూల్?కు రూ.200 కోట్లు చొప్పు పరిపాలన అనుమతులను మంజూరు చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ పాఠశాలలను ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

మిగతా 2లో..

## టీమిండియాదే ఛాంపియన్స్ ట్రోఫీ




టీమ్‌ఇండియా అదరగొట్టింది. న్యూజిలాండ్‌తో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 251 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని భారత్ ఆరు బంతులు మిగిలుండగానే 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. రోహిత్ శర్మ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు. విరాట్ కోహ్లి తీవ్ర నిరాశపర్చాడు. శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ (34నాటౌట్), గిల్ (31), అక్షర్ పటేల్ (29), హార్దిక్‌పాండ్య (18), రవీంద్ర జడేజా (9నాటౌట్) పరుగులు చేశారు. భారత్ ఛాంపియన్స్ ట్రోఫీ గెలవడం ఇది మూడోసారి

## ఎల్ఎల్‌బీసీ ప్రమాదంలో ఒకరి మృతదేహం వెలికితీత

**మృతుడు టీబీఎం ఆపరేటర్‌గా గురుప్రీత్‌సింగ్‌గా గుర్తింపు • మిగిలిన ఏడుగురి కోసం గాలింపు**



**నాగర్‌కర్నూల్ బ్యూరో(జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లాలో కూలిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యల్లో ఆదివారం కొంత పురోగతి లభించింది. ప్రమాదం జరిగిన 100 మీటర్ల దూరంలో డి-2 పాయింట్‌లో మనుషుల ఆనవాళ్లను కేరళ జాగిలాలు గుర్తించాయి. దీంతో ఆ ప్రాంతంలో సిబ్బంది

మిగతా 2లో..

### ప్రభుత్వపాఠశాల విద్యార్థులకు ఏఐ తో

## నైపుణ్యాభివృద్ధి శిక్షణ




- పీపీపీ విధానంలో ఏర్పాట్లు
- అన్ని రంగాల్లో ఎమర్జింగ్ టెక్నాలజీస్‌ను సమర్ధవంతంగా వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్(జనంసాక్షి) :** కృత్రిమ మేధస్సు (ఏఐ) సాయంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు "స్కిల్ డెవలప్‌మెంట్" లో శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా తమ బోధనా సామర్థ్యాలను మరింత పెంపొందించుకునేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తామన్నారు. శనివారం అంబేద్కర్

మిగతా 2లో..







## కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు వీరే..

**అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, విజయశాంతిల పేర్లు ఖరారు**

- ప్రకటించిన పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్
- నాలుగింటిలో ఒక స్థానం సీపీఐకి కేటాయింపు
- ఆ పార్టీ తరపున ఆశావహుల్లో నెల్లికంటి సత్యం యాదవ్, చాడ వెంకటరెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులను ఆ పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. నాలుగు స్థానాల్లో ఒక స్థానాన్ని సీపీఐకి కేటాయిం చింది .మిగిలిన మూడు స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులుగా అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, విజయశాంతి పేర్లను ఖరారు చేసినట్టు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యేల కోటా నుంచి ఐదు ఎమ్మెల్సీల ఎన్నికకు ఈ నెల 10వ తేదీలోగా నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంది. ఎమ్మెల్యేల సంఖ్యాబలం ఆధారంగా మూడు కాంగ్రెస్‌కు, ఒకటి భారాసకు వస్తాయి. ఐదో స్థానం కోసం ఎంఐఎంతోపాటు మరికొన్ని ఓట్లు అవసరమవుతాయి. భారాస నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారు ఓట్లు వేస్తే కాంగ్రెస్‌కు నాలుగో సీటు లభించే అవకాశమున్నా, సుప్రీం కోర్టులో కేసు నేపథ్యంలో ఈ ఎమ్మెల్యేలు ఎలాంటి వైఖరి తీసుకుంటారన్నది చూడాల్సి ఉంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తమకు ఎమ్మెల్సీ

మిగతా 2లో..

### భారాస ఎమ్మెల్సీ అభ్యర్థిగా దాసోజు శ్రవణ్



2లో

### న్యూయార్క్ సమీపంలో కార్చిచ్చు

**నగరాన్ని కమ్మేస్తున్న పొగ**



2లో



## ముంబైలో విషాదం



**నీటి ట్యాంకు శుభ్రం చేస్తూ ఊపిరాడక నలుగురు కార్మికులు మృతి**

**ముంబై(జనంసాక్షి):** దక్షిణ ముంబైలో నిర్మాణంలో ఉన్న భవనం నీటి ట్యాంకును శుభ్రం చేస్తూ ఆదివారం నలుగురు కార్మికులు మృతి చెందారని అధికారులు తెలిపారు. 'నాగ్‌పాడ ప్రాంతంలోని దిమ్టికర్ రోడ్డులో ఉన్న బిస్మిల్లా స్పేస్ బిల్డింగ్‌లో మధ్యాహ్నం ఈ దుర్ఘటన జరి గింది. ట్యాంకులోకి దిగిన ఐదుగురు కార్మికులు స్పృహ తప్పి పడిపోయారు. వారిని అగ్నిమాపక్ సిబ్బంది కాపాడి జెజె ఆసుపత్రికి తరలించారు. కాగా ఆసుపత్రికి చేరిన వారిలో నలుగురు చనిపోయారని డాక్టర్లు తెలిపారు' అని ఓ పౌర అధికారి తెలిపారు. ఆసుపత్రిలో హసిపాల్ షేఖ్(19), రజా షే ఖ్(20), జియావుల్లా షేఖ్(36), ఇమాందు షేఖ్(38) చనిపోగా, పుర్హాన్ షేఖ్(31) కోలుకుంటున్నాడని ఆ అధికారి వివరించారు. ప్రమాద మరణ నివేదికను నమోదు చేసుకుని దర్యాప్తును మొదలెట్టినట్లు పోలీస్ స్టేషన్ అధికారి తెలిపారు. దర్యాప్తు తర్వాత చర్యలు తీసుకుంటామని కూడా ఆయన స్పష్టం చేశారు.

## ట్రంప్ వాఖ్యల్లో ఆధిపత్యం కనబడుతోంది

**అవి సమస్యల పరిష్కార లక్ష్యంగా లేవు**

**ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ**



**టెహ్రాన్(జనంసాక్షి):** అణు ఒప్పందంపై ఇరాన్‌తో చర్చలు జరిపేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్న సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ స్పందించారు. వారి చర్చలు సమస్యల పరిష్కార లక్ష్యంగా లేవని విమర్శించారు.'కొన్ని ప్రభుత్వాలు, విదేశీ నాయకులు చర్చలకు సిద్ధమేనని చెబుతున్నా.. అవి బెదిరింపుల్లా ఉన్నాయి. వారి చర్చలు సమస్యల పరిష్కారం కంటే

మిగతా 2లో..

## నాటో నుంచి అమెరికా బయటికి రావాలి

**ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కీలక వ్యాఖ్యలు**



**న్యూయార్క్(జనంసాక్షి):** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ కూటమిపై కీలక వ్యాఖ్యలు చేశారు. నాటో కూటమి నుంచి నిష్క్రమించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సీనియర్ సలహాదారు మైక్ లీ సోషల్ మీడియా వేదికగా చేసిన పోస్ట్‌కు మస్క్ మద్దతుపలికారు. వెంటనే అగ్రరాజ్యం నాటో, ఐక్యరాజ్య సమితి నుంచి నిష్క్రమించాలని కోరారు. ఐరోపా దేశాల రక్షణ కోసం యూఎస్ డబ్బులు చెల్లించడం ఏమాత్రం సమంజసమైన విషయం కాదని పేర్కొన్నారు.ఇప్పటికే నాటో భవిష్యత్తుపై ఆ దేశాల్లో సందిగ్ధత కొనసాగుతున్న నేపథ్యంలో మస్క్ వ్యాఖ్యలు పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. గతంలో నాటో దేశాల్లో నిధుల కేటాయింపుపై ట్రంప్ మాట్లాడుతూ..కూటమిలో నిర్ణయించిన విధంగా అన్ని దేశాలు రక్షణ వ్యవస్థ బలోపేతానికి తమ జీడీపీ నుంచి తగిన మొత్తంలో నిధులు కేటాయించాల న్నారు. నాటోలోని ఇతర దేశాలు నిధులను కేటాయించకపోతే తమ రక్షణ దళాలను వెనక్కి తీసుకుం టామని

మిగతా 2లో..

## జగదీప్ ధన్‌ఖడ్‌కు అస్వస్థత

**ఏయిమ్స్‌లో ఉపరాష్ట్రపతిని పరామర్శించిన ప్రధాని మోదీ**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఎయిమ్స్‌లో చేరారు. ఆదివారం ఆయన ఛాతి నొప్పితో బాధపడినట్లు తెలుస్తోంది. దీంతో ఆయన్ను తెల్లవారుజామున 2 గంటలకు ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు తీసుకెళ్లారు.కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజీవ్ నారంగ్ ఆధ్వర్యంలో ఆయనకు చికిత్సను అందిస్తున్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.ప్రధాని నరేంద్ర మోదీ దిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రికి వెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

మిగతా 2లో..

### డోనాల్డ్ ట్రంప్ బెదిరింపులతో

## తగ్గించలేదు

### వాణిజ్య సంబంధాల బలోపేతానికే చర్యలు: భారత్



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత్ అత్యధికంగా సుంకాలు వసూలు చేస్తుందన్న అంశాన్ని తాను బహిరంగంగా లేవనెత్తడం వల్లే.. ఆ దేశం ఆందోళన చెంది సుంకాలను తగ్గించడానికి అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పేర్కొన్నారు. ఈ విషయంపై భారత అధికారిక వర్గాలు మాత్రం ఆ వ్యాఖ్యలను తోసిపుచ్చుతునట్లు సమాచారం. సుంకాల తగ్గింపునకు చర్యలు నిజమే అయినప్పటికీ.. ఆయన ఆరోపణలతో తాము ఈ నిర్ణయం తీసుకోలేదని చెబుతున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలతో వాణిజ్య సంబంధాలను పెంపొందించుకోవడానికి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించాయి. గతంలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల నేపథ్యంలో భారత్ వరుసగా ఆస్ట్రేలియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, స్విట్జర్లాండ్, నార్వే వంటి దేశాలపై సుంకాలను తగ్గించింది. ప్రస్తుతం ఐరోపా సమాఖ్య, యూకేతోనూ పలు ఒప్పందాల కోసం చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే అగ్రరాజ్యంతో వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి వీటిని తగ్గించాలని న్యూదిల్లీ నిర్ణయం తీసుకుంది. అంతే కానీ, అమెరికా భారత్‌పై విధించనున్న సుంకాల అమలుకు సమయం దగ్గరపడుతున్నందుకు కాదు" అని భారత అధికారులు చెబుతున్నట్లు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. నివేదికల ప్రకారం.. వ్యవసాయ ఉత్పత్తులు మినహా దాదాపు అన్ని వస్తువులపై సుంకాలను తొలగించాలని అమెరికా భారత్‌ను కోరింది. న్యూదిల్లీకి వాషింగ్టన్

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
10.03.2025




# పెళ్లి వేడుకలో భారీ చోరీ

## రూ.7.5లక్షల ఆభరణాలు అపహరణ

**హైదరాబాద్(జనంసాక్షి):**పెళ్లి వేడుకలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 22లో ఉంటున్న వ్యాపారవేత్త నివాసంలో దాదాపు రూ. 7.5లక్షల విలువైన బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఇంటి యజమానులు పెళ్లి వేడకలో బిజీగా ఉన్న సమయంలో డ్రెస్సింగ్ రూమ్ తాళం మాయం చేసిన దొంగలు.. నగదు, బంగారం అపహరించినట్టు బాధితుడు పోలీసులకు పిర్యాదు చేశారు. ఇంటి పనిమనుషులపై అనుమానం వ్యక్తం చేయడంతో.. జూబ్లీ హిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# భారాస ఎమ్మెల్సీ అభ్యర్థిగా దాసోజు శ్రవణ్



**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణలో ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు భారాస తన అభ్యర్థిని ఖరారు చేసింది. భారాస ఎమ్మెల్సీ అభ్యర్థిగా దాసోజు శ్రవణ్ పేరును ప్రకటించింది. మొత్తం ఐదు స్థానాలకు ఎన్నికలు జరగనుండగా.. మూడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్.. ఒక స్థానాన్ని తన మిత్రపక్షం సీపీఐకి కేటాయించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ అభ్యర్థులుగా అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, విజయశాంతి పేర్లు ఖరారు కాగా.. భారాస నుంచి దాసోసు శ్రవణ్ పేరును కేసీఆర్ ఖరారు చేశారు.

# ఉక్రెయిన్ సేనలను ఉక్కిరిబిక్కిరి చేసిన రష్యా ప్రత్యేకబలగాలు



**జనంసాక్షి:**గతేడాది ఉక్రెయిన్ సైనికులు రష్యా సరిహద్దులు దాటి అక్కడి కర్స్క్ ప్రాంతాన్ని అనూహ్య రీతిలో స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో ఆ ప్రాంతంలో ఇరుపక్షాల నడుమ పోరాటం కొనసాగుతోంది. ఈ క్రమంలోనే కీవ్ సైన్యాన్ని కట్టడి చేసేందుకు రష్యన్ ప్రత్యేక బలగాలు వినూత్న మార్గాన్ని అనుసరించినట్లు తెలుస్తోంది. ఓ గ్యాస్ పైప్‌లైన్‌లో దాక్కుని కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వెళ్లి మరీ ప్రత్యర్థులపై విరుచుకుపడినట్లు వెల్లడైంది. ఉక్రెయిన్ సైన్యంతోపాటు రష్యన్ యుద్ధ బ్లాగర్లను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియాలో ఈ మేరకు కథనాలు వెలువడ్డాయి. గతేడాది ఆగస్టులో ఉక్రెయిన్ సైన్యాలు రష్యాలోని కర్స్క్‌లో ప్రవేశించాయి. వ్యూహాత్మక సరిహద్దు పట్టణం సుడ్జా సహా దాదాపు 1000 చదరపు కిలోమీటర్ల మేర భూభాగాన్ని స్వాధీనం చేసుకున్నాయి. వందలాదిమంది స్థానికులను యుద్ధఖైదీలుగా బంధించాయి. దీంతో రెండో ప్రపంచ యుద్ధం తర్వాత రష్యాలో కొంత భూభాగాన్ని ఆక్రమించిన మొట్టమొదటి దేశంగా ఉక్రెయిన్ నిలిచింది. అయితే.. నెలల వ్యవధిలోనే మాస్కో బలగాల ధాటికి వెనుకంజ వేసింది. దాదాపు 50 వేల మంది రష్యన్, ఉత్తర కొరియా సైనికులు విరుచుకుపడటంతో.. ఇప్పటికే అనేక మంది కీవ్ సైనికులు ప్రాణభయంతో పలాయనం చిత్తగించారు. ముఖ్యంగా సుడ్జా పట్టణంలో ఉక్రెయిన్ ఊహించని రీతిలో ఎదురుదాడులు చవిచూసినట్లు క్రెమ్లిన్ అనుకూల బ్లాగర్ యూరి పొడోలియాకా తన పోస్టుల్లో వెల్లడించారు. "కొంత కాలం క్రితం వరకు ఐరోపాకు గ్యాస్ సరఫరా చేసేందుకు ఉపయోగించిన భారీ పైప్‌లైన్‌ను మాస్కో దళాలు ఉపయోగించాయి. పైప్‌లైన్ లోపల దాదాపు 15 కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వెళ్లి.. సుడ్జా పట్టణం సమీపంలో ప్రత్యర్థులపై దాడులు చేశాయి. కొంతమంది సైనికులు పైప్‌లైన్‌లో చాలా రోజులు గడిపారు" అని తెలిపారు. ఉక్రెయిన్‌పై పుతిన్ దండయాత్రకు ముందు సుడ్జా పట్టణ జనాభా దాదాపు 5,000. పైప్‌లైన్ వెంబడి అనేక స్టేషన్లు ఉన్నాయి. సుడ్జాను మళ్లీ చేజిక్కించుకునేందుకు రష్యన్ దళాలు గ్యాస్ పైప్‌లైన్ ద్వారా ఆ పట్టణంలోకి ప్రవేశించాయని టూ మేజర్స్ అనే మరో యుద్ధ బ్లాగర్ చెప్పారు. రష్యన్ సేనలు గ్యాస్ మాస్కులు ధరించి పైపుగుండా వెళ్తున్నట్లు కనిపిస్తున్న ఫొటోలు స్థానికంగా చక్కర్లు కొడుతున్నాయి. సుడ్జా శివార్లలో పట్టు సాధించేందుకు పుతిన్ బలగాలు పైప్‌లైన్‌ను ఉపయోగించాయని ఉక్రెయిన్ జనరల్ స్టాఫ్ సైతం ధ్రువీకరించింది. అయితే, వారిని సకాలంలో గుర్తించి, దాడి చేసినట్లు వెల్లడించింది. స్థానికంగా మాస్కో సేనలకు భారీ నష్టాలు వాటిల్లుతున్నట్లు తెలిపింది.

# మాజీ మంత్రి రాజా భయ్యాపై గృహ హింస కేసు



**ఢిల్లీ:** ఉత్తరప్రదేశ్‌లోని కుందా ఎమ్మెల్యే, మాజీ మంత్రి రఘురాజ్ ప్రతాప్ సింగ్ అలియాస్ రాజా భయ్యాపై గృహహింస కేసు నమోదైంది. ఆయన సతీమణి భన్వి సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఎన్‌క్లేవ్ పోలీస్ స్టేషన్‌లో ఆయనపై మార్చి 7న ఎఫ్ఐఆర్ నమోదైనట్లు తెలిపారు. రాజా భయ్యా కొన్నేళ్లుగా శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నట్లు ఆమె ఫిర్యాదులో ఆరోపించినట్లు పోలీసులు వెల్లడించారు. కుందా నియోజకవర్గం నుంచి ఏడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రాజాభయ్యా.. గతంలో భాజపా, సమాజ్‌వాదీ పార్టీల నుంచి మంత్రిగానూ పనిచేశారు. 2018లో జనసత్తా దళ్(లోక్‌తంత్రిక్) పార్టీని స్థాపించారు. అయితే, గత కొన్నేళ్లుగా భార్యాభర్తలు విడిగా ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. తన అత్తతో పాటు మిగతా వారు వేధింపులకు పాల్పడినట్లు ఆమె పేర్కొన్నారు. తన వివాహ బంధాన్ని కాపాడుకొనేందుకు తొలుత ఆమె చట్టపరమైన చర్యకు దూరంగా ఉన్నారని.. వేధింపులు ఆగకపోవడంతో ఫిర్యాదు చేసేందుకు ముందుకొచ్చారన్నారు. ఆమె ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు.





# రైతన్నతో పాటు నేతన్నకూ ప్రాధాన్యత

నిర్ణయించాం. 1.30 కోట్ల చీరలు నేసే ఆర్డర్లను రాష్ట్ర నేతన్నలకు ఇస్తున్నాం. 1939 తర్వాత కులగణన ఇప్పటివరకు మళ్లీ జరగలేదు. మండల్ కమిషన్ వేసి బీసీలకు రిజర్వేషన్లు పెంచింది కాంగ్రెస్ ప్రభుత్వం. భారత్ జోడో యాత్రలో బలహీనవర్గాల కష్టాలను రాహుల్ గాంధీ చూశారు. కులగణన చేసి జనాభా దామాషాలో బీసీలకు న్యాయం చేయాలన్నది ఆయన ఆశయం. ఈ క్రమంలోనే లక్షమంది ఎన్యుమరేటర్లను నియమించి రాష్ట్రంలో పకడ్బందీగా కులగణన నిర్వహించాం. కులగణన నచ్చనివారు సర్వేపై దుష్ప్రచారం చేస్తున్నారు. తప్పు ఎక్కడ జరిగిందో నిరూపించమంటే ఎవరూ ముందుకు రావట్లేదు. బీసీ రిజర్వేషన్ల పెంపు కత్తి మోదీ మెడకు చుట్టుకుంటుందని భాజపా నేతల భయం"అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

# ప్రభుత్వపాఠశాల విద్యార్థులకు 'ఏఐ'తో నైపుణ్యాభివృద్ధి శిక్షణ

**- పీపీపీ విధానంలో ఏర్పాట్లు**

**- అన్ని రంగాల్లో ఎమర్జింగ్ టెక్నాలజీస్‌ను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు**

**- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు**

సచివాల యంలో తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ దిల్ రాజు ఆధ్వర్యంలో కోణం ఫౌండేషన్ నిర్వాహ కులు సందీప్ కుమార్ మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... అన్ని రంగాల్లో ఎమర్జింగ్ టెక్నాలజీస్ ను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వా మ్య(పీపీపీ) విధానంలో అత్యంత ప్రతిష్టా త్మకంగా "ఏఐ సిటీ"ను ఏర్పాటు చేయ నున్నట్లు వెల్లడించారు. ఇక్కడే అంతర్జాతీయ ప్రమాణాలతో ఏఐ యూనివర్సిటీని కూడా ప్రారంభించబోతున్నామన్నారు. నల్గొండ జిల్లా లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యా ర్థులకు ఏఐ సాయంతో ఉచితంగా స్కిల్ డెవలప్‌మెంట్ లో శిక్షణ ఇస్తున్న ఫౌండేషన్ సేవలను అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశా లలకు ఈ ఫౌండేషన్ సేవలను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విదేశాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడిన సందీప్ కుమా ర్.. పుట్టిన ఊరిని మర్చిపోకుండా ఫౌం డేషన్ తరఫున అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు వీరే..

స్థానం ఇవ్వాలని సీపీఐ కోరింది. సీపీఐ అగ్ర నాయకత్వం కూడా కాంగ్రెస్ ముఖ్య నాయకులతో మాట్లాడారు. దీంతో ఆ పార్టీకి ఒక స్థానం కేటాయించారు. అభ్యర్థి ఎంపికపై ఇప్పటికే సీపీఐ రాష్ట్ర కార్యవర్గం చర్చిస్తోంది. ఆ పార్టీ తరఫున ఎమ్మెల్సీ ఆశావహుల్లో నెల్లికంటి సత్యం యాదవ్, చాడ వెంకటరెడ్డి ఉన్నారు. ఇవాళ రాత్రిలోపు సీపీఐ అభ్యర్థిని ప్రకటించే అవకాశముంది.

# ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు కొత్త పర్యాటక శోభ

**హైదరాబాద్(జనంసాక్షి):**ఓఆర్ఆర్( ఔటర్ రింగ్‌రోడ్డు) వరకు ఉన్న పర్యాటక ఆకర్షణలను ఒకే కేటగిరిగా చేర్చి అభివృద్ధి చేయనున్నారు. ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్‌రోడ్డుమధ్య కొత్త పర్యాటక ఆకర్షణలను ఏర్పాటు చేయడంతో పాటు రింగ్ రోడ్డు చుట్టూ ప్రత్యేకంగా షాపింగ్ ఫెస్టివల్స్‌ని నిర్వహించనున్నారు. రీజినల్ రింగ్‌రోడ్డు వెలుపల ఆకర్షణీయమైన గ్రామీణ ప్రాంతాలతో టూరిజంను అభివృద్ధి చేయనున్నారు. హెలీ, గోల్ఫ్ పర్యాటకానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధిపై దృష్టి సారించింది. సర్కారు ఆమోద ముద్ర వేసిన కొత్త పర్యాటక విధానంతో హైదరాబాద్ నగరంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో పర్యాటక రంగ అభివృద్ధికి బాటలు పడనుంది. పలు చోట్ల 27 పర్యాటక క్లస్టర్లు రానున్నాయి. వీటిలో రెండు సర్క్యూట్‌లు ఉన్నాయి.

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు రూ.11,600 కోట్లు

ఆ నాటి ప్రభుత్వం కోళ్లు, పశువుల రేకుల షెడ్?లలో పాఠశాలలు ఏర్పాటు చేసిందన్నారు. గత ప్రభుత్వ రూ. 7.19 లక్షల కోట్లను అప్పు చేసిందని చెప్పారు. సీఎం రేవంత్? రెడ్డి ఆలోచన ఒకటే పేద బడుగు బలహీన వర్గాలకు మేలు చేయాలి, ఆ దిశగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. మంచి కార్యక్రమాలు చేస్తుంటే ప్రతిపక్షం ఓర్చుకోలేక రాజకీయాలు చేస్తోందని మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# చేనేత కార్మికుల రుణమాఫీ

రుణాలను ప్రభుత్వం మాఫీ చేయనుంది. 2017 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు ఉన్న రుణ బకాయిలను మాఫీ చేయనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# ఎల్ఎల్‌బీసీ ప్రమాదంలో ఒకరి మృతదేహం వెలికితీత

మట్టిని తొలగించి ఒక మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు టీబీఎం ఆపరేటర్ గురుప్రీత్‌సింగ్‌గా గుర్తించారు. మిగిలిన ఏడుగురి కోసం గాలింపు కొనసాగుతోంది. ఎస్ఎల్‌బీసీ సొరంగం తవ్వకాల్లో ప్రమాదం చోటుచేసుకుని ఎనిమిది మంది కూరుకుపోయిన విషయం తెలిసిందే. సొరంగంలో కూరుకుపోయిన వారి ఆచూకీ కోసం 15 రోజులుగా వివిధ ఏజెన్సీలకు చెందిన కార్మికులు పనిచేస్తున్నారు.

# ట్రంప్ వాఖ్యల్లో ఆధిపత్యం కనబడుతోంది

ఆధిపత్యమే లక్ష్యంగా ఉంటాయి. టెహ్రాన్‌ను ఎదిరించలేమని తెలియడంతో చర్చలు అనే కొత్త వ్యూహాలు నెలకొల్పుతున్నారు' అని ఖమేనీ మండిపడ్డారు. ఇదిలా ఉండగా అమెరికా నుంచి తమకు ఎలాంటి లేఖ అందలేదని ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘి ఓ వార్తా సంస్థతో తెలిపారు. ఇరాన్‌పై గరిష్ఠ ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని.. ట్రంప్ పేరును ప్రస్తావించకుండా విమర్శించారు. ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేసుకోవడాన్ని నిలువరించేందుకు అమెరికా ప్రయత్నాలు చేస్తోంది. ఇదే అంశంపై ఇటీవల మాట్లాడిన ట్రంప్.. టెహ్రాన్‌తో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈమేరకు ఖమేనీకి లేఖ రాసినట్లు ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. "ఇరాన్ ముందు రెండు మార్గాలున్నాయి. సైన్యం, లేదా ఒప్పందం చేసుకోవడం. ఒప్పందానికే నేను ప్రాధాన్యం ఇస్తా. ఎందుకంటే ఇరాన్‌ను దెబ్బతీయాలనుకోవడం లేదు. చర్చలు జరుపుతారని ఆశిస్తున్నా' అని ఆయన పేర్కొన్నారు. ఇక, ఇరాన్‌తో గతంలో అణు ఒప్పందం చేసుకున్న అమెరికా.. 2018లో ట్రంప్ హయాంలోనే దాన్నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే.



# న్యూయార్క్ సమీపంలో కార్చిచ్చు..

అధికారులు మూసివేశారు హోంప్టన్స్‌లో నాలుగు చోట్ల ఈ మంటలు పుట్టుకొచ్చాయి. మధ్యాహ్నం 1 గంటకల్లా మోరిచెస్, ఈస్ట్‌పోర్టు, వెస్ట్ హోంప్టన్స్‌తో సహా పలు ప్రాంతాలకు ఇవి వ్యాపించాయి. దీంతో ఆ ప్రదేశాలు దట్టమైన పొగతో నిండిపోయాయి. మూడు చోట్ల మంటలు అదుపులోకి తీసుకురాగా.. హోంప్టన్స్‌లో 50 శాతం అగ్నికీలలను ఆర్పేశారు. ఈ కార్చిచ్చు కారణంగా రెండు వాణిజ్య భవనాలు కాలిపోయాయి. అయితే, స్థానికంగా ఉన్న గృహాలకు మాత్రం ఎలాంటి ప్రమాదం జరగలేదని అధికారులు చెబుతున్నారు. పెద్ద ఎత్తున గాలులు వీయడంతో దట్టమైన పొగ నగరమంతా వ్యాపించింది. ఇక న్యూయార్క్ గవర్నర్ హోచుల్ అక్కడ అత్యవసరస్థితిని ప్రకటించారు. స్థానికులను ఆ ప్రాంతం నుంచి తరలిస్తున్నట్లు తెలిపారు. మంటలను అదుపుచేసేందుకు హెలికాప్టర్లతో నీటిని చల్లుతున్నట్లు వెల్లడించారు. పొగ కారణంగా గాలి నాణ్యత క్షీణిస్తోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

**14వ అంతస్తు నుంచి పడి..**

# గురుగ్రామ్‌లో జపాన్ మహిళ మృతి

**జనంసాక్షి:**గురుగ్రామ్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. జపాన్‌కు చెందిన ఓ మహిళ.. 14వ అంతస్తు బాల్కనీ నుంచి పడి ప్రాణాలు కోల్పోయింది. గతేడాది భారత్‌కు వచ్చిన ఈమె..భర్తతో సహ దిల్లీ శివారులో నివాసముంటున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. జపాన్‌కు చెందిన మడోకో థమానో (34) అనే మహిళ భర్తతో కలిసి గతేడాది సెప్టెంబర్‌లో భారత్‌కు వచ్చింది. భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి గురుగ్రామ్‌లోని ఓ అపార్టుమెంటులో ఉంటున్నారు. అయితే, మార్చి 8న ఉదయం అపార్టుమెంటు ఆవరణలో రక్తపు మడుగులో ఓ మహిళ మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం పూర్తైన తర్వాత మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించి జపాన్ రాయబార కార్యాలయానికి కూడా సమాచారం ఇచ్చినట్లు స్థానిక పోలీసులు వెల్లడించారు.

# నాటో నుంచి అమెరికా బయటికి రావాలి

హెచ్చరించారు. కాగా రక్షణ వ్యయాన్ని భారీగా పెంచే ఉద్దేశంతో ఈయూ దేశాలు గత వారం బ్రస్సె ల్స్‌లో అత్యవసర శిఖరాగ్ర సమావేశం నిర్వహించాయి. తమ రక్షణ వ్యవస్థల ను బలోపేతం చేసుకునేందుకు 800 బిలియన్ యూరోల (841 బిలియన్ డాలర్ల)తో ప్రణాళిక ప్రతిపాదించాయి. రక్షణ కోసం సభ్య దేశాలకు 162.5 బిలియన్ డాలర్ల రుణాలను అందించే యూరోపియన్ కమిషన్ ప్రతిపాదనపై చర్చించాయి. తాజాగా ఉక్రెయిన్ పట్ల అమెరికా తీరు ఐరోపా దేశాల్లో ఆందోళనను రేకెత్తిస్తోంది. అసలు యూఎస్ వ్యూహం ఏమిటో ఇప్పటికీ స్పష్టంగా తెలియట్లేదని ఈయూ రక్షణ కమిషనర్ ఆండ్రియస్ కుబిలియస్ అన్నారు. రష్యాతో యుద్ధం శాశ్వతంగా కొనసాగేలా చేస్తున్నారంటూ ఇటీవల ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీపై ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మండిపడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా తమ 'స్టార్‌లింక్' ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తే.. యుద్ధక్షేత్రంలో కీవ్ సేనలు కుప్పకూలుతాయని హెచ్చరించారు. యుద్ధం విషయంలో పుతిన్‌ను పక్కనపెట్టి.. కేవలం ఉక్రెయిన్‌నే ఎందుకు లక్ష్యంగా చేసుకుంటున్నారనే ట్వీట్‌పై మస్క్ ఈమేరకు స్పందించారు."ఉక్రెయిన్ విషయంలో ముఖాముఖికి రావాలంటూ గతంలో పుతిన్‌కు సవాలు విసిరాను. మరోవైపు.. కీవ్ సైన్యానికి మా స్టార్‌లింక్ వ్యవస్థ వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఒకవేళ ఈ ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తే.. రణరంగంలో కీవ్ సేనలు కుప్పకూలుతాయి. ఏదేమైనా ఉక్రెయిన్‌కు ఓటమి అనివార్యం. అయినప్పటికీ.. ఏళ్ల తరబడి సాగుతున్న ఊచకోత విసుగు పుట్టిస్తోంది. వాస్తవికతతో ఆలోచించేవారు, అర్థం చేసుకునేవారు ఎవరైనా ఈ యుద్ధాన్ని ఆపాలని కోరుకుంటారు" అని మస్క్ పేర్కొన్నారు. మరోవైపు.. వైట్‌హౌస్ సమీపంలో భారీ ఉక్రెయిన్ జెండా ఆవిష్కరణకు నిధులు ఎవరు కేటాయించారు? అంటూ 'ఎక్స్' వేదికగా ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు మస్క్ స్పందించారు "టాప్ 10 ఉక్రెయిన్ సంపన్నులపై.. ముఖ్యంగా మొనాకోలో విలాస భవనాలు కలిగి ఉన్నవారిపై ఆంక్షలు విధించాలి. తద్వారా ఇటువంటి కార్యకలాపాలకు అడ్డుకట్ట పడుతుంది" అని తెలిపారు. ఇదిలా ఉండగా.. రష్యా దాడుల్లో ఉక్రెయిన్ కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతినడంతో ప్రస్తుతం స్టార్‌లింక్ సేవలందిస్తోంది. సైన్యానికి ఇది ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోంది.

# వాణిజ్య సంబంధాల బలోపేతానికే సుంకాల తగ్గింపు

అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. గత ఆర్థిక సంవత్సరంలో ద్వైపాక్షిక వాణిజ్యం రికార్డు స్థాయిలో 118.2 బిలియన్ డాలర్లకు చేరుకుంది. కాగా 2030 నాటికి దీనిని 500 బిలియన్ డాలర్లకు చేర్చాలనే లక్ష్యంతో భారత్ ముందుకు వెళ్తోంది. గత నెల ప్రధాని మోదీ అమెరికా పర్యటనకు వెళ్లిన సమయంలో 2025 చివరి నాటికి.. ఇరుదేశాల మధ్య పరస్పరం ప్రయోజనకరమైన బహుళ రంగాల ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తొలిదశపై చర్చలు జరపడానికి ట్రంప్ అంగీకరించారు. ఇందులో భాగంగానే మరిన్ని వస్తువులకు మార్కెట్‌ను తెరవడం, సుంకాల అడ్డంకులను తొలగించడానికి ఇరుదేశాల నేతలు ఒప్పందం చేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. భారత్, చైనా సహా పలు దేశాలపై భారీ సుంకాలు విధిస్తామని ట్రంప్ పలుమార్లు పేర్కొన్న విషయం తెలిసిందే. న్యూదిల్లీని టారిఫ్ కింగ్‌గా అభివర్ణిస్తూ.. తమ వస్తువులపై భారీగా సుంకాలు విధిస్తోందని ఆయన ఆరోపించారు. ఏప్రిల్ 2న భారత్, చైనాలపై విధించే సుంకాలు.. అమెరికా దశను మార్చనున్నాయని అన్నారు. అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. సుంకాలు, సుంకాలేతర అడ్డంకులను అధిగమించడానికి బీటీఏ కింద అమెరికాతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటామని పేర్కొంది.

# జగదీప్ ధన్‌ఖడ్‌కు అస్వస్థత

ఈ విషయాన్ని ప్రధాని మోదీ స్వయంగా 'ఎక్స్'లో పోస్టు చేశారు. జగదీప్ ధన్‌ఖడ్ ఆరోగ్యంగా ఉండాలని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆదివారం తెల్లవారు జామున 2గంటల సమయంలో ఛాతిలో నొప్పి రావడంతో జగదీప్ ధన్‌ఖడ్‌ను ఆస్పత్రిలో చేర్పించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన్ను ఎయిమ్స్‌లోని క్రిటికల్ కేర్ యూనిట్ (సీసీయూ)లో ఉంచి కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజీవ్ నారంగ్ ఆధ్వర్యంలో చికిత్స అందిస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న ప్రధాని మోదీ ఆస్పత్రికి వెళ్లి ఆరోగ్యంపై ఆరా తీశారు. మరోవైపు, ఈ ఉదయాన్నే కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా ఆస్పత్రికి వెళ్లి ఉపరాష్ట్రపతి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు.

# నేడే కెనడా కొత్త ప్రధాని ఎంపిక

**ఒట్టావా(జనంసాక్షి):**కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడ్ తన పదవి నుంచి వైదొలగనున్నట్లు ఈ జనవరిలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నూతన సారథిని ఎన్నుకునేందుకు అధికార లిబరల్ పార్టీ సిద్ధమైంది. ఇందుకోసం నేడు (మార్చి 9) పార్టీలో ఓటింగ్ నిర్వహించనుంది. ఈ రేసులో నలుగురు కొనసాగుతున్నారు. అమెరికా నుంచి కెనడా సుంకాల సవాలు ఎదుర్కొంటున్న వేళ.. కెనడా పాలనా పగ్గాలు ఎవరు చేపట్టనున్నారనే విషయం ఆసక్తిగా మారింది. లిబరల్ పార్టీ సారథి రేసులో మార్క్ కార్నీ, క్రిస్టియా ఫ్రీలాండ్, కరినా గౌల్డ్, ఫ్రాంక్ బేలిస్‌లు ఉన్నారు. వీరిలో కార్నీ, ఫ్రీలాండ్‌ల మధ్య తీవ్ర పోటీ ఉన్నప్పటికీ.. మాజీ బ్యాంకర్ మార్క్ కార్నీ నూతన ప్రధానిగా ఎన్నికయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. బ్యాంక్ ఆఫ్ కెనడాకు మాజీ గవర్నర్‌గా పనిచేసిన మార్క్ కార్నీ.. అంతకుముందు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ గవర్నర్‌గానూ చేశారు. ఇక ట్రూడో ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పనిచేసిన క్రిస్టియా ఫ్రీలాండ్.. గత డిసెంబర్‌లో తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆమె రాసిన సుదీర్ఘ లేఖ..




ట్రూడో రాజీనామాకు దారితీసిందనే వాదన కూడా ఉంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి సుంకాల సవాళ్లు ఎదురవుతున్న వేళ కెనడా నూతన ప్రధాని ఎంపిక మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. వీటిని ఎదుర్కొనేందుకు తమ వద్ద ఉన్న ప్రణాళికలు ఉన్నాయని ప్రధాని రేసులో ఉన్న లిబరల్ పార్టీ నేతలు ధీమాగా చెబుతున్నారు. సీక్రెట్ ఓటింగ్ ద్వారా పార్టీ అధినేతను ఎన్నుకోనుండగా.. ఇందులో సుమారు 1.40లక్షల మంది ఓటర్లు పాల్గొననున్నారు. విజేతగా నిలిచిన వారిచే గవర్నర్ జనరల్ నూతన ప్రధానిగా ప్రమాణం చేయిస్తారు.

# సీఎం రేవంత్‌వి అబద్ధపు ప్రచారాలు: హరీశ్‌రావు



**హైదరాబాద్(జనంసాక్షి):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిన్న జరిగిన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడారని భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "గతంలో మా ప్రభుత్వం బడి పిల్లల యూనిఫాం కుట్టేందుకు మహిళా సంఘాలకు రూ. 50 చొప్పున ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా రూ. 50 చొప్పున ఇచ్చారని మహిళలు చెబుతున్నారు. కానీ, రేవంత్‌రెడ్డి మాత్రం ఒక్కో యూనిఫామ్‌కు రూ. 75 చొప్పున ఇచ్చామని పచ్చి అబద్ధం చెప్పారు. భారాస ప్రభుత్వ హయాంలో రూ. 25 మాత్రమే ఇచ్చారని అసత్యాలు చెప్పారు. మహిళా సంఘాలకు రూ. 21వేల కోట్ల వడ్డీలేని రుణం అనేది అవాస్తవం. నిన్న సీఎం మాటలు వినలేక సభ నుంచి మహిళలు వెళ్లిపోతుంటే పోలీసులు ఆపారు" అని హరీశ్‌రావు ఆరోపించారు.

# ఏడాది గడిచింది.. ఎన్నికలెప్పుడు?

- గుదిబండగా రిజర్వేషన్లు
- బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేనా...?
- బిఆర్ఎస్ జాడలు లేకుండా పంచాయితీ ఎన్నికలు..?
- సర్పంచ్, కార్యదర్శికి మళ్లీ జాయింట్ చెక్ పవర్
- రిజర్వేషన్లు మార్చే అవకాశం.. ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేసే చాన్స్




**నారాయణపేట జిల్లా బ్యూరో (జనంసాక్షి) :** స్థానిక సంస్థల పాలన గడువు ముగిసి ఏడాది గడిచినా నేటి వరకు అప్పుడు ఇప్పుడు ఎన్నికలు అంటూ రాష్ట్ర ప్రభుత్వం ఆశావాహులలో ఆశలు రేకిస్తున్నది కానీ నిర్దిష్ట నిర్ణయం తీసుకోలేక పోతున్నది.దాంతో ఇంతకీ స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో జరుగుతాయా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.అందుకు కారణం లేకపోలేదు.రాష్ట్రంలో నిర్వహించిన కుల గణన దేశానికే ఆదర్శం అంటు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి కుల గణన చేస్తున్నామని ప్రకటించడం అనుమానాలకు తావిస్తున్నది.అంతేకాకుండా 42 శాతం బిసిలకు రిజర్వేషన్ కల్పించాలని కేబినెట్ తీర్మానించి అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించి అమలు కోసం కేంద్రానికి పంపించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నది.అయితే కుల గణన సక్రమంగా లేదని విపక్షాలు విమర్శల నేపథ్యంలో ప్రభుత్వం మళ్ళీ సర్వేకు ఆదేశాలు ఇచ్చింది.దాంతో అనుమానాలు అధికం అవుతున్నాయి. రీ సర్వే రిపోర్టు ఎలా ఉంటుంది,రాష్ట్రం పంపిన 42 శాతం బిసి రిజర్వేషన్లు అమలు ఎప్పుడు అవుతాయి స్థానిక సంస్థలు గ్రామ పంచాయితీలు,మండల,జిల్లా పరిషత్ లు,మున్సిపాలిటీల ఎన్నికలు ఎప్పుడు జరుగునో అని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

### స్థానిక ఎన్నికల్లో ప్రభుత్వం ప్రత్యేక ఆలోచన

స్థానిక సంస్థల ఎన్నికల్లో గత ప్రభుత్వ జాడలు ఎక్కడా లేకుండా నిర్వహించేందుకు సి ఎం.రేవంత్ రెడ్డి సార్థ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా ప్రణాళిక రూపొందించేందుకు సిద్ధం అయినట్లు తెలుస్తోంది. ఉప సర్పంచ్ చెక్ పవర్ తొలగించే యోచన తోపాటు,గత సర్కారు వరుసగా రెండు టర్ముల రిజర్వేషన్ ను రద్దుచేసే ఆలోచన లో ఉంది.అలాగే అభ్యర్థులకు ఇద్దరు పిల్లలకు మించి ఉండరాదనే నిబంధన కూడా ఎత్తివేసేందుకు నిర్ణయించిందని చెబుతున్నారు.పంచాయతీ రాజ్ చట్టంలో సవరణలకు ప్రభుత్వం గ్రామ పంచాయతీల ఎన్నికలకు క్షేత్రస్థాయిలో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నది.అందులో పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్టు చర్చ జరుగుతోంది. పలు సవరణలు చేయనున్నట్టు తెలుస్తోంది. 2018లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పంచా యతీ రాజ్ చట్టంలో మార్పులు చేసి సెక్రటరీ స్థానంలో ఉప సర్పంచ్ కు జాయింట్ చెక్ పవర్ ఇచ్చింది.దీంతో చాలా పంచాయతీల్లో సర్పంచ్, ఉప సర్పంచ్ కు మధ్య విభేదాలు తలెత్తి ఆ ఎఫెక్ట్ అభివృద్ధి పనులపై పడిందన్న వాదనలు ఉన్నాయి. ఈ గొడవలు చినికిచినికి గాలివానలా మారి వందలాది గ్రామాల్లో సర్పంచులు, ఉప సర్పంచులు ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకునే వరకు వెళ్లిన ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం సర్పంచ్, ఉప సర్పంచ్ చెక్ పవర్ విషయంలో కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్టు తెలిసింది. మళ్లీ సర్పంచ్, కార్యదర్శికి జాయింట్ చెక్ పవర్ కల్పించే అవకాశం ఉందని అధికారవర్గాలు చెప్తున్నాయి.అయితే, సర్పంచ్, ఉప సర్పంచులకు చెక్ పవర్ కంటిన్యూ చేయాలని కొందరు గతంలో మాదిరిగా సర్పంచ్, సెక్రటరీకే జాయింట్ చెక్పవర్ ఉండాలని మరికొందరు ఇలా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై గ్రామాల్లో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

### మళ్లీ సింగిల్ టర్మ్ రిజర్వేషన్ కే ఒకే

ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల్లో రెండు టర్ములు రిజర్వేషన్ విధానం కొనసాగు తున్నది. గతంలో సింగిల్ టర్మ్ రిజర్వేషన్ ఉండేది. రొటే షన్ పద్ధతిలో రిజర్వే షన్లు కొనసాగుతూ వచ్చాయి. కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వ 2018లో పంచాయతీ రాజ్ చట్టాన్ని సవరించి రెండు టర్మ్ లకు రిజర్వేషన్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. దీం తో పదేండ్ల వరకు పంచా యతీలలో అదే రిజర్వేషన్ కొనసాగనున్నది. ఈ విధానా న్ని మార్చి మళ్లీ పాత పద్ధతి లో సింగిల్ టర్మ్ రిజర్వేషన్ అమలు చేసేలా అసెంబ్లీలో చట్టం చేయనున్నట్టు తెలిసింది. అంతేకాకుండా, ప్రస్తుతం ఉన్న పంచాయ తీరాజ్ చట్టంలో సర్పంచ్ పై వేటు వేస అధికారం కలెక్టర్లకు కల్పించింది. దీనిపై క్షేత్రస్థాయి లో అనేక విమర్శలు వచ్చాయి.ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకున్న సర్పంచు పై కలెక్టర్ వేటు వేయడమే మిటని, ఈ నిబంధన తొలగించాలని ప్రజాప్రతిని ధులు బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చినా పట్టిం చుకో లేదు. దీంతో, సర్పంచ్ పై కలెక్టర్లు వేటు వేసే అధికా రాన్ని తొలగించాలని కాంగ్రెస్ సర్కార్ భావిస్తున్నట్టు కూడా చర్చ జరుగుతోంది. అలాగే, సమగ్ర కుటుంబ, రాజకీయ, ఆర్థిక సర్వే పూర్తయిన వెంట నే బీసీ జనాభా లెక్కించి రిజర్వేషన్లు ఖరారు చేయ నున్నారు. అదే సమ యంలో పంచాయతీ రాజ్ చట్టంలో సవరణలు చేసేలా ప్రణాళిక రూపొందించినట్టు తెలిసింది. ఈ క్రమంలో ఈ నెలలో జరగనున్న అసెంబ్లీ సమావే శాల్లోనే పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

### ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేసే చాన్స్

ఇద్దరు కన్నా ఎక్కువ మంది పిల్లలు ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులని పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 213 చెబుతోంది. కానీ, మున్సిపా లిటీ చట్టం ప్రకారం కౌన్సిలర్, చైర్మన్, కార్పొరేటర్, మేయర్ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థు లకు ఎంతమంది పిల్లలున్నా పోటీకి అవకాశముంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల్లోనే పంచాయతీలకు ఒక రకంగా, మున్సిపాలిటీలకు మరో రకంగా చట్టాలుండడంపై విమర్శలు వస్తున్నాయి. మున్సిపాలిటీలకు లేని నిబంధన పంచాయతీలకు ఎందుకని పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు ప్రభుత్వంపైఒత్తిడితెస్తున్నారుదీంతో ఎంత మంది పిల్లలున్నా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలని, ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేయాలనే డిమాండ్ తెరపైకి తీసుకొ చ్చారు. దీంతో రేవంత్ రెడ్డి సర్కార్ ఇద్దరు పిల్లల నిబంధ న ఎత్తివేయాలని ఇప్పటికే నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది.

### ఎన్నికల ఆలస్యంతో పడకేసిన ప్రగతి

స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యం అవుతున్న కొద్దీ గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని విమర్శలు ఉన్నాయి.గ్రామ పంచాయితీలతో పాటు మండల,జిల్లా పరిషత్ లు,మున్సిపాలిటీల్లో ప్రజల సమసులనువోట్టించుకునే నాథుడు కరువయ్యారని సమసులను ఎవరు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.అంతేకాకుండా స్థానిక సంస్థల పాలక వర్గాలు లేక పోవడంతో నిధులు మంజూరు కాక అభివృద్ధి పనులు కుంటు పడ్డాయని అంటున్నారు.ఇకనైనా గ్రామాల అభివృద్ధికి సమద్యల్వపరిష్కారానికి వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

చదువుకోమని తల్లి మన్నించిందని..

## విద్యార్థి బలవన్మరణం



**సిద్దిపేట, మార్చి 9 (జనంసాక్షి) :** పరీక్షలు దగ్గరికొచ్చాయి.. చదువుకోమని తల్లి మందలించడంతో మన స్తాపం చెందిన ఓ విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్ మండలంలోని చాంద్ఖాన్ముక్త గ్రామానికి చెందిన మార్కంటి గోపాల్ రెడ్డి, కనకవ్వ దంపతుల కొడుకు విజయేందర్ రెడ్డి (16) చౌదరిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 6వ తేదీన కనకవ్వ పొలం వద్ద ఉండగా.. విజయేందర్ రెడ్డి అక్కడకు వెళ్లాడు. దీంతో అక్కడ కొడుకును చేసిన కనకవ్వ.. పరీక్షలు ఉండగా అటు, ఇటు ఖాళీగా ఎందుకు తిరుగుతున్నావని మందలించింది. ఇంటికెళ్లి చదువుకోమని సూచించింది. దీంతో మనస్తాపం చెందిన విజయేందర్ రెడ్డి.. పొలంలో ఉన్న పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కనకవ్వ స్థానికుల సాయంతో గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్లోని సన్షైన్ హాస్పిటల్కు తరలించారు. ఈ క్రమంలో అక్కడే చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి విజయేందర్ తుదిశ్వాస విడిచాడు.

## ఈహెచ్ఎస్, ఆరోగ్యశ్రీ సేవలు వినియోగించుకోవాలి

- ప్రముఖ పిల్లల వైద్యనిపుణులు ఎడ్ల రమేష్



**నర్సంపేట (జనంసాక్షి) :** నర్సంపేట పట్టణంలోని సంగీత పిల్లల హస్పటల్ లో మొట్టమొదటిసారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారి ఆరోగ్యశ్రీ, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్, హెల్త్ ఇన్సూరెన్స్ పథకాలు, సేవలు సోమవారం నుంచి అందుబాటులో ఉంటాయని ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎడ్ల రమేష్ తెలిపారు. నియోనాటల్ ఇన్సెంటివ్ కేర్, పస్కలకు ట్రీట్మెంట్, నెలలు నిండని, బరువు తక్కువగా పుట్టిన పిల్లలకు ట్రీట్మెంట్ వ్యాధులు పీడియాట్రిక్ ఇన్సెంటివ్ కేర్ ఆపరేషన్ థియేటర్స్ మొదలగు సదుపాయాలు ఆరోగ్య శ్రీ ద్వారా చూడబడునని ఆయన తెలిపారు. ఈ సేవలను ప్రభుత్వ ఉద్యోగులు, ఈఎస్ఐ కార్మికులు, తెల్ల రేషన్ కార్డు కలిగిన పేదలు ఉపయోగించుకోవాలని కోరారు.

## ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా

- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్రెడ్డి



**నిర్మల్ రూరల్, మార్చి09 (జనంసాక్షి) :** ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్రెడ్డి అన్నారు. నిర్మల్ మండలం చిట్యాల్ గ్రామం నుండి గాంధీనగర్ వరకు రూ. 25 కోట్లతో ఆర్ అండ్ బీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిట్యాల్ గ్రామ ప్రజలు ఎల్లప్పుడూ అండగా ఉన్నారని, ఈ గ్రామ అభివృద్ధికోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ రోడ్డు నిర్మాణం 2 నెలలో పూర్తి చేసేలా అధికారులను సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెంకట్ రెడ్డి,మార గంగారెడ్డి జిల్లా బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, జమాల్, భూపాల్ రెడ్డి, ముత్యం రెడ్డి, భూపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధ ప్రతిపాదికన ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక

- కలెక్టర్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలి
- రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- సమావేశంలో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్, మార్చి 9 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో మరింత వేగం పెంచాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా యుద్ధ ప్రతిపాదికన లబ్ధిదారులను ఎంపిక చేసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. రెండు, మూడు రోజుల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఆదివారం రాత్రి మంత్రి తన నివాసంలో రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లా పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ ఇందిరమ్మ పాలనలో పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్ల ను నిర్మించి ఇవ్వడమే ఈ ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు, ఆలోచనల ప్రకారం కలెక్టర్లు పనిచేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో కలెక్టర్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం పై కలెక్టర్లకు ఏమైనా సందేహాలు ఉంటే నేరుగా తనను సంప్రదించాలని, కాలయాపన చేయకూడదని, లబ్ధిదారుల ఎంపికలో స్థానిక శాసన సభ్యుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకొని కలెక్టర్ లే తుది నిర్ణయం తీసుకోవాలని, ఎంపికలో నిరుపేదలకు అత్యంత ప్రాధాన్యత నివ్వాలని అన్నారు. నిర్మాణం పూర్తి అయిన 2 బి హెచ్ కే ఇండ్ల కు లబ్ధిదారులను ఎంపిక చేయాలని, అసంపూర్తిగా ఉన్న వాటిని కాంట్రాక్టర్లు పూర్తి చేయని పక్షంలో లబ్ధిదారులే పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకొని సాగునీరు, త్రాగునీరుకు ఎలాంటి కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వరంగల్ జిల్లాలోని ఎయిర్ పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్డు, ఇన్నర్ రింగురోడ్డు కు భూసేకరణ ను వేగవతం చేయాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు.

## సఫా బైతుల్ మాల్ ఆధ్వర్యంలో పేదలకు వంట సామాగ్రి పంపిణీ




**పెద్దపల్లి మార్చి 9 (జనంసాక్షి) :** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో సఫా బైతుల్ మాల్ పెద్దపల్లి పట్టణ శాఖ ఆధ్వర్యంలో పేదలకు వంట సామాగ్రిని పంపిణీ చేశారు. సఫా బైతుల్ మాల్ పెద్దపల్లి అధ్యక్షుడు ముఫ్తి ఇంతియాజ్ అసాధి మాట్లాడుతూ రంజాన్ మాసంలో తమ సంస్థ ద్వారా వితంతువులకు పేదలకు బియ్యం నిత్యాసర వస్తువులను ఉచితంగా అందజేసినట్లు చెప్పారు దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు సఫాబతులు పెద్దపల్లి శాఖకు పెద్ద ఎత్తున విరాళాలు అందించి సంస్థ చేసే సామాజిక కార్యక్రమాలకు తోడ్పాటు అందించాలని ముఫ్తి ఇంతియాజ్ పిలుపునిచ్చారు. తమ సంస్థ ద్వారా ఇవే కాకుండా వితంతువులకు నెలవారి పెన్షన్లు, ఉచిత వైద్య శిబిరాలు, విద్యార్థుల్లో ధార్మిక భావాలు పెంపొందించేలా సీరతునబీ టాలెంట్ టెస్ట్, ఉచిత కంటి వైద్య శిబిరాలు, వివిధ ఇబ్బందుల్లో ఉన్న పేదలకు ఆర్థిక తోడ్పాటు అందించడం వంటి సేవా కార్యక్రమాలు దాతల సహకారంతో చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లియాఖత్ ఖాన్, మౌలానా లయీఖుల్లా ఖాస్మి, ముఫ్తి అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్లోకి ఆర్ఎస్ ప్రవీణ్ అనుచరులు



**హైదరాబాద్, మార్చి 9 (జనంసాక్షి) :** డా ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రధాన అనుచరుడు , బీస్పి మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందికంటి విజయ్ కుమార్ సారధ్యంలో కొత్త కిషన్ గౌడ్ అబ్దుల్లా పూర్ మెట్టు పార్టీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఇబ్రహీంపట్నం నియోజక వర్గం అబ్దుల్లాపూర్ మెట్ మండలం లోని బండరావిరాల గ్రామానికి కి చెందిన పలువురు నాయకులు కందికంటి లక్ష్మణ్, యాదగిరి, కొమ్ము సుబ్బారావు, ఒంగూరి రవి, కుర్రి శ్రీరామ్, బంగారి కుమార్, ఏర్పుల నరేష్, ఒంగూరి రమేష్, రాజు, పృథ్వీ, శివ శంకర్, భరత్, బస్వరాజ్, మల్లేష్, శివ ప్రసాద్ , ఇతర నాయకులు బీఆర్ఎస్ పార్టీ లోకి జాయిన్ అయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచి రెడ్డి ప్రశాంత్ రెడ్డి (బంటి) కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు మంచి రెడ్డి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో నూతన ఉత్సాహం తో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పూజారి చక్రవర్తి, గ్రామ అధ్యక్షులు గుండ్ల జంగయ్య మొలుగు దానేష్, కావడి దయాకర్ రెడ్డి, అర్జున్ మొదలగు నాయకులు పాల్గొన్నారు.

## రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా
# 13న ఇందిరాపార్క్ వద్ద ధర్నా

- మార్చి 12 వరకు జిల్లా కేంద్రాల్లో ధర్నాలు
- యస్ కె యం కన్వీనర్లు టి సాగర్, పశ్య పద్మ, జక్కుల వెంకటయ్య




**హైదరాబాద్, మార్చి 9 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మార్చి 13న హైదరాబాద్ ఇందిరా పార్క్ దగ్గర, మార్చి 12 వరకు జిల్లా కేంద్రాల్లో జరుగు ధర్నాలను జయప్రదం చేయాలని ఈరోజు (మార్చి 9న) హిమాయత్ నగర్ లోని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యాలయంలో జరిగిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్లు టీ సాగర్, పశ్య పద్మ, జక్కుల వెంకటయ్య పిలుపునిచ్చారు. పార్లమెంట్ లో ఒత్తిడి చేయాలని పార్లమెంటు సభ్యులకు, అసెంబ్లీలో తీర్మానం చేయాలని యం ఎల్ ఏ లకు వినతి పత్రాలు ఇస్తామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గతంలో రద్దు చేసిన మూడు చట్టాల స్థానంలో జాతీయ వ్యవసాయ మార్కెట్ ముసాయిదాను తీసుకొచ్చిందని దీనిని రద్దు చేసే వరకు ఐక్యంగా పోరాడుతామని అన్నారు. 2024, నవంబర్ 24న విడుదల చేసిన జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విదానం (ఎన్పీఎఫ్ఎం) ముసాయిదాపై వివిధ రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను కోరిందని, ఈ ముసాయిదా వల్ల గతంలో రద్దయిన చట్టాలలో మార్కెట్ విధానాల రూపంలో రైతులపై రుద్దే ప్రయత్నం చేస్తున్నదని, ఇది రైతుల కోసం కాకుండా, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించిన విధానమని తెలిపారు. దేశ రైతాంగం ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ వ్యవసాయ మార్కెటింగ్ విధానాల ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం ద్వారా కనీస మద్దతు ధరకు (ఎంఎస్) చట్టబద్ధ హామీ ఇవ్వడంలో స్పష్టత లేకపోవడం రైతుల భద్రతకు ప్రధాన అడ్డంకిగా మారిందని, రైతుల ఆదాయ భద్రతపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని, ఎంఎస్పి రక్షణ లేకుండా రైతులు మార్కెట్లో ఉన్న అనిశ్చిత పరిస్థితులను అధిగమించడం కష్టం తరమవుతుందని, ఇది చిన్న రైతులను ఇంకా అస్థిరతలోకి నెట్టివేస్తుందని, ఈ విధానం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను పక్కన పెట్టి, వ్యవసాయ మార్కెటింగును కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కనిపిస్తోందని తెలిపారు. ధరల అస్థిరతలో రైతులకు భద్రత ఇవ్వాల్సిన పద్ధతులు పూర్తిగా ప్రైవేట్ కంపెనీల నియంత్రణలోకి వెళ్లడం వల్ల, రైతులు తమ ఉత్పత్తులకు సరైన ధరలు పొందలేని పరిస్థితి ఏర్పడుతుంది. మార్కెట్ నియంత్రణలను తొలగించడం ద్వారా, పెద్ద సంస్థలు మార్కెట్ను పూర్తిగా అధీనంలోకి తీసుకోవడమే కాకుండా, రైతులపై ఆర్థిక ఒత్తిడి పెంచే పరిస్థితిని సృష్టిస్తోంది. వ్యాపారులు రైతుల ఉత్పత్తులను తక్కువ ధరకు కొనుగోలు చేయడం, తద్వారా అధిక లాభాలను పొందే అవకాశం ఉంది. చిన్న రైతులు వ్యవసాయం నుంచి వైదొలగాల్సిన పరిస్థితులు ఏర్పడుతాయి. పంటలకు సరైన ధర పొందడంలో ఇంకా ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. మార్కెటింగ్ వ్యవస్థలో కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం మరింత పెరగడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో అసమానతలు పెరుగుతాయి. రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్న వ్యవసాయ మార్కెట్ వ్యవస్థకి సంబంధించిన అంశాలపైన కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఇలాంటి విధానాలు తీసుకురావటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. దేశ రైతాంగం ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ వ్యవసాయ మార్కెటింగ్ విధానాల ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి. దీని స్థానంలో రైతులు, వినియోగదారుల ప్రయోజనాలను కాపాడే ఒక సమగ్రమైన మార్కెటింగ్ విధానాన్ని రైతు సంఘాలు, నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి తీసుకురావాలి. కనీస మద్దతు ధరకు చట్టబద్ధతని కల్పించటం, మద్దతు ధర లెక్కింపులో డా. ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సు చేసినట్టుగా సి2 పైన 50శాతం కలిపి మద్దతు ధరను ప్రకటించడం, ప్రస్తుతం ఉన్న ఎపిఎంసీలలో ఆధునిక నదుపాయాలు కల్పించి బలోపేతం చేయడం, గిడ్డంగులను అధునీకరించడం, వ్యవసాయ అధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం, సహకార వ్యవస్థను బలోపేతం చేయడం, మార్కెట్ రిస్క్ నుంచి రైతులను కాపాడడం లాంటి అంశాలను పరిగణన లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యస్ కె యం నాయకులు జ్వాలా వెంకటేశ్వర్లు,మూడ్ శోభన్ తదితరులు పాల్గొన్నారు.

## బావులతోనే.. భవిష్యత్తుకు
# దిశానిర్దేశం!



సింగరేణి కాలనీలో కొత్త బొగ్గుబావులతోనే సంస్థ మనుగడ ఆధారపడి ఉంది. ఈ విషయాన్ని సింగరేణి కాలరీస్ లోని కార్మిక సంఘాలన్నీ అర్థం చేసుకోవాల్సి ఉంది. కేంద్రంలో నూతన పాలసీ మూలకంగా కొత్త బొగ్గు బ్లాక్ ల కోసం ప్రైవేట్ సంస్థల మాదిరి డబ్బులు కట్టి వేలంలో పాల్గొంటే తప్ప గనులను కేటాయించడం లేదు. కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం గతంలో మాదిరి అడుగ గానే వెంటనే కొత్త బ్లాకులను కేటాయించే పద్ధతికి స్వస్తి పలకడం జరిగింది. అప్పటినుంచి ఇప్పటిదాకా కొత్తగా సింగరేణికి పై నిబంధనల ఫలితంగా వేలంలో పాల్గొనని, కారణంగా కొత్త గనులు రాలేదు.

**ఆందోళనలు ఫలించలేదు.**

దీనిపై గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో వేలంలో పాల్గొనకుండానే పాత పద్ధతిలో తమకు న్యాయంగా కేటాయించాల్సిన బొగ్గు బ్లాక్ లను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి యాజమాన్యం కోరడం జరిగింది. అసెంబ్లీలో తీర్మానం కూడా చేసి పంపడం జరిగింది. పీఎం ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం కార్మిక సంఘాలు సమ్మె కూడా చేయడం జరిగింది. అయినా కేంద్రం పట్టించుకోలేదు ఒకసారి చట్టం చేశాం కాబట్టి చట్ట ప్రకారమే బొగ్గు బ్లాకుల కేటాయింపు ఉంటుందని కేంద్రం పేర్కొంది. రాష్ట్రం నుంచి ఎంపీగా ఎంపికైన బిజెపి నేత జి కిషన్ రెడ్డి కేంద్ర బొగ్గు శాఖ మంత్రి గా ఉన్నప్పటికీ ఆయన కూడా వేలంలో పాల్గొనకుండా బొగ్గు బ్లాక్ లను ఇచ్చే పరిస్థితి లేదని, స్పష్టం చేయడం జరిగింది.

**ఐదేండ్లుగా కొత్త బొగ్గు బ్లాకులు లేవు.**

ఇప్పటికే బొగ్గు బ్లాకులు లేక ఐదు సంవత్సరాలు దాటింది కొత్తగా కొన్ని బ్లాకులు మనకు కేటాయించకున్నా వాటి ప్రారంభోత్సవం అంటూ అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న మన మాజీ సీఎం కేసీఆర్ హంగామా చేశారు. ఎక్కడ కూడా ఒక బాయి కూడా గ్రౌండ్ కాలేదు. ఉత్పత్తి, ఉత్పాదకత, అనుకున్న మేరకు జరుగుతున్నప్పటికీ ఇది ఇంకా ఎంతకాలం అనేది పెద్ద ప్రశ్న! ఇలాగే పరిస్థితి ఉంటే కొత్త బొగ్గు బావులు రావు ఉన్న కార్మికులకు ఉపాధి చూయించే అవకాశం ఉండదు. తప్పనిసరి పరిస్థితులలో విఆర్ఎస్ లాంటివి మరోసారి అమలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కార్మికుల సంఖ్య భారీగా తగ్గిపోతుంది. సగానిపైగా బొగ్గు గనులు 2030 నాటికి బొగ్గు ఉత్పత్తి అయిపోయి మూతపడే పరిస్థితి ఉన్నది. ఏదో కొన్ని అర్థాంతరంగా మూతపడ్డ భూగర్భ గనులను ఓపెన్ కాస్ట్ గనులుగా మార్చి బొగ్గు తీస్తున్న కారణంగా కొంత జీవితకాలం పెరుగుతున్నది. అయినా దీనివల్ల పెద్దగా ప్రయోజనం లేదు.

**నష్టాల్లో భూగర్భ గనులు.**

సింగరేణిలో ప్రస్తుతం ఉన్న భూగర్భ ఘనులు పూర్తిగా నష్టాల్లో ఉన్నాయి. వాటిని లాభాల్లోకి తీసుకుని రావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఉత్పత్తి వ్యయం భారీగా పెరిగింది అమ్మకం సగం ధర కూడా లేదు. దీనితో లాభం బదులు నష్టమే ఎక్కువ జరుగుతున్నది, కొన్ని ఓపెన్ కాస్ట్ గనులలో పరిస్థితి కూడా ఇదే విధంగా తయారైంది. లాభాలు బొటబొ టిన వస్తున్నాయి. కనీసం 10 నుంచి 20% ఓపెన్ కాస్ట్ గనుల నుంచి లాభాలు వస్తే భూగర్భంలో నష్టాలను కొంతలో కొంతైనా పూడ్చుడానికి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఆ దిశన ఉత్పత్తి ఉత్పాదకత పెరగడం వల్ల సంస్థకు లాభాలు వస్తున్నాయిగా తప్ప, నేరుగా గనుల లెక్కన లాభాలను కడితే సగానికి పైగా నష్టాలలోనే ఉంటాయి బొగ్గు ధర కూడా సింగరేణికి సంబంధించి నాణ్యత ఉంటుంది కాబట్టి ఓల్ ఇండియాలోని ఇతర అనుబంధ సంస్థలు పోలిస్తే సింగరేణి బొగ్గు ధర ఎక్కువగా ఉంది. అందుకోసం వినియోగదారులు సింగరేణి వదిలేసి ఇతర ప్రాంతాలకు మించి బొగ్గులు తీసుకుని రావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు కొన్ని చోట్ల నుంచి బొగ్గు తెచ్చుకుంటున్నారు.

**పవర్ ప్లాంట్లకు గనులు.**

గతంలో పవర్ ప్లాంట్లకు కేవలం బొగ్గు సంస్థలే బొగ్గును సరఫరా చేసేవి, మంచి డిమాండ్ ఉండేది. సింగరేణి లాంటి సంస్థలు ఒప్పందాలు చేసుకునేవి!కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఆయా విద్యుత్ ఉత్పత్తి సంస్థలు, ఎన్టిపీసీ, కూడా కొత్తగా వచ్చిన పాలసీ ప్రకారం వేలంలో పాల్గొని బొగ్గు బ్లాక్ లను తీసుకుని తవ్వడం జరుగుతుంది. ఇప్పుడు చాలా పోటీ పెరిగింది. ఈ పోటీ నుంచి అటు కోల్ ఇండియా ఇటు సింగరేణి ఆయిన ఎదురుకోవడం కొంత కష్టంగా ఉంది అయినప్పటికీ సమర్థవంతమైన నాయకత్వం అటు కోలిండియాలో, ఇటు సింగరేణిలో సంస్థలకు ఉన్న కారణంగా సంస్థలు గట్టెక్కుతున్నాయి. అయితే కొత్త బొగ్గు బ్లాక్ లేకుండా ఇది ఎంతకాలమో సాధ్యం కాదు. అందుకోసం కార్మిక సంఘాలు అటు ప్రజాప్రతినిధులు, ప్రతి ఒక్కరు కూడా రాష్ట్ర ప్రభుత్వం, కూడా ఈ విషయంలో సీరియస్ గా ఆలోచించాలి. సింగరేణికి బొగ్గు బ్లాగులు కేటాయించే విషయంలో ఎవరిది ఎలాంటి జోక్యం లేకుండా యాజమాన్యం స్వచ్ఛందంగా ఇలాంటి నిర్ణయం తీసుకున్న దానికి మద్దతు ఇవ్వాలి. అప్పుడే గానీ కొత్త బొగ్గు బ్లాక్లు వచ్చే పరిస్థితి లేదు. సింగరేణి భవిష్యత్తు కొత్త బ్లాకు లు రాకుంటే అగమ్య గోచరమైపోతుంది. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన అవసరం ఉంది సింగరేణి పై వేలాది కుటుంబాలు ప్రత్యక్షంగా లక్షలాది కుటుంబాలు పరోక్షంగా ఆధారపడి ఉన్నాయి ,కాబట్టి కొత్త బ్లాగుల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు గుర్తించాల్సిన అవసరం ఉంది. కొత్త బొగ్గు బ్లాక్లు వస్తే తప్ప సింగరేణికి దిశా నిర్దేశం ఉండదు. తప్పనిసరిగా కొత్త బొగ్గు బ్లాగులు రావాల్సిందే.

**30 వేల కోట్ల బకాయిలు వసూలు చేద్దాం.**

అలాగే సంస్థకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బొగ్గు సరఫరా విద్యుత్ సరఫరా కు చెందిన సుమారు 30 వేల కోట్ల రూపాయల బకాయిలను కూడా వసూలు చేయాల్సిన పరిస్థితి ఉంది తప్పనిసరిగా బకాయిలలో కుస్తీ రూపంలో నైనా సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించడానికి ముందుకు రావాలి పన్నులను డివిడెంట్‌లను వివిధ రకాలుగా ప్రతి ఏడాది 3000 కోట్లకు పైగా రెవెన్యూను రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి నుంచి పొందుతున్నది అటు కేంద్రం కూడా తన వాటా అయిన 49% రెవెన్యూ ను పొందుతున్నది కేంద్రం అయితే గత పాతిక సంవత్సరాలుగా సింగరేణిపై పెట్టుబడిగా బడ్జెట్లో నయా పైసా పెట్టలేదు రాష్ట్ర ప్రభుత్వం కూడా అంతే కనీసం బకాయి పడ్డ 30 వేల కోట్ల రూపాయల నుంచి కొంత కొంత అయినా సింగరేణి చెల్లిస్తే ఆర్థికంగా సంస్థ కాస్త బలపడుతుంది జీతాల కోసం కొత్తగా ప్రాజెక్టుల కోసం భారీగా అప్పులు చేసే పరిస్థితి సంస్థకు రాకుండా ఉంటుంది ఆ దిశను కూడా చిత్తశుద్ధి నిజాయితీతో ప్రయత్నాలు జరగాలి అందుకోసం కార్మిక సంఘాలు ఎంపీలు ఎమ్మెల్యేలు కృషి చేయాలి సంస్థను తన కాళ్ళపై తన నిలబడే విధంగా మద్దతునివ్వాలి సింగరేణి తెలంగాణ కు కొంగుబంగారంగా విలసిల్లుతున్నది దానిని బంగారు బాతు చందంలో ఒకేసారి కోసుకొని తినే పద్ధతికి స్వస్తి పలకాలి సింగరేణి కాపాడుకుందాం కొత్త బొగ్గు బావులను సాధిద్దాం అప్పులను వసూలు చేసుకుందాం ఆర్థిక పరిపుష్టి వైపుకు సంస్థను బలోపేతం చేద్దాం.



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

# దేశంలో భాషా వాదం




ఇటీవల దేశంలో మళ్ళీ భాష వాదం రాజుకుంటుంది. తమిళనాడు లో త్రిభాషా సూత్రాన్ని అమలు పరచడం లేదనే కారణంతో ఆ రాష్ట్రానికి సర్వ శిక్ష అభియాన్ కింద ఇవ్వవలసిన నిధులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేయడంతో మరోసారి భాషా సమస్య ముందుకు వచ్చింది. దేశంలోని వివిధ రాష్ట్రాలలో హిందీ బోధన అమలు జరుగుతుండగా దక్షిణాదిలో తమిళనాడులో రెండు భాషలే అధికారికంగా బోధిస్తున్నారు. 1991లో ప్రవేశపెట్టిన ఆర్థిక సరళీకృత విధానాలు, ప్రపంచీకరణ ప్రభావం తీవ్రమైన తరుణంలో విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాల పేర అనివార్యంగా ఆంగ్లం మోజు పెరుగుతున్నది. దేశంలోను రాష్ట్రంలోనూ ప్రైవేట్ విద్యారంగమంతా ఆంగ్లంలోనే కొనసాగుతుందంటే అతిశయోక్తి కాదు.

ఇటీవల యునెస్కోకు చెందిన గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ బృందం తెలిపిన ప్రకారంగా ప్రపంచ జనాభాలో 40 శాతం మందికి వారు మాట్లాడే భాషలో లేదా వారు అర్థం చేసుకునే భాషలో విద్యాబోధన జరగడంలేదని వెల్లడించింది. విద్యా రంగానికి సంబంధించి మన దేశంలో వేసిన వివిధ కమిటీలు కూడా మాతృ భాష అధ్యయనాన్ని సమర్థించాయి. ముఖ్యంగా విద్యా మనోవైజ్ఞానిక శాస్త్రవేత్తలు, మేధావులు అందరూ ప్రాథమికంగా మాతృభాషలో విద్యాబోధన జరిగితేనే పిల్లలలో సహజాతాలు వికసిస్తాయని చెబుతున్నారు. అయినా మనవాళ్లకు చెవికెక్కటం లేదు. నాగరిక దేశాలన్నీ తమ మాతృభాషలోనే విద్యాబోధన కొనసాగించి అభివృద్ధి చెందుతున్న విషయం మనందరికీ తెలిసిందే.

కానీ మనకు పొరుగింటి పుల్లకూర అంటే రుచి కదా! మన దగ్గర చదువు అనేది ప్రైవేట్ చదువు-ప్రభుత్వ చదువు, పల్లె చదువు-పట్టణ చదువు, పేదల చదువు- ధనికుల చదువు, మాతృభాషా విద్యాబోధన- ఆంగ్ల భాషా విద్యాబోధన అనే పేరుతో వేరైనాయి. అందుకే ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న విద్యారంగంలో తేవాల్సిన సంస్కరణలు తేకపోవడం వల్ల ఆశించిన ఫలితాలు రావడం లేదు.

ఈ నేపథ్యంలో పరిణామాల్ని గమనిస్తే 1968లో కేంద్ర ప్రభుత్వం త్రిభాషా సూత్రానికి మద్దతు పలికింది. ఆ ప్రకారంగా రాజ్యాంగం లో దాన్ని పొందుపరిచారు. రాష్ట్రాలలో అక్కడి ప్రధాన ప్రాంతీయ భాష ఇంగ్లీష్ తో పాటు హిందీని బోధిస్తున్నట్లే హిందీ రాష్ట్రాలలో కూడా హిందీ ఇంగ్లీష్‌తో పాటు మరో భారతీయ భాషను బోధించాలని అంగీకరించడం జరిగింది. దక్షిణాన తమిళనాడు మినహా తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక, కేరళ, రాష్ట్రాలన్నీ వీటిని తూచా తప్పకుండా పాటిస్తున్నాయి. కానీ ఉత్తరాది రాష్ట్రాలు మాత్రం ప్రాంతీయ భాషలకు కాదని, కొన్నిచోట్ల నామమాత్రంగా సంస్కృతాన్ని బోధిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే కేంద్రీయ విద్యాలయాల్లో ఇంగ్లీషు, హిందీ, సంస్కృతమును బోధిస్తుండగా 1986లో జాతీయ విద్యా విధానంలో భాగంగా దేశవ్యాప్తంగా స్థాపించిన నవోదయ విద్యాలయాలలో మాత్రమే త్రిభాషా సూత్రం అన్నది శాస్త్రీయంగా అమలవుతున్నది. గ్రామీణ ప్రాంతాలలోని ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం, జాతీయ సమైక్యత భావాన్ని పెంపొందించడం, త్రిభాషా సూత్రాన్ని పటిష్టంగా అమలుపరచడం, సంబంధిత జిల్లాలోని విద్యాసంస్థలకు నవోదయ మార్గదర్శకంగా నిలవడం అనేవి వీటి స్థాపన వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశాలు. అందులో భాగంగా తొమ్మిదవ తరగతిలో దక్షిణాదికి చెందిన రాష్ట్రాల నుండి 30% విద్యార్థులు ఉత్తరాది రాష్ట్రాలకు అలాగే ఉత్తరాది రాష్ట్రాల నుండి దక్షిణాది రాష్ట్రాలకు వలసవిధానంలో భాగంగా పంపించి తృతీయ భాషగా హిందీ రాష్ట్రాలలో భారతీయ భాషలను బోధిస్తు న్నారు. తమిళనాడు మినహా దేశంలోని మిగతా అన్ని రాష్ట్రాలలో నవోదయ విద్యాలయాలు కొనసాగుతున్నాయి. ఉదాహరణకు మన దగ్గర కరీంనగర్ నవోదయ విద్యార్థులు ఝార్ఖండ్‌లోని సాహెబ్ గంజ్ నవోదయకు అలాగే సాహెబ్ గంజ్ నవోదయ విద్యార్థులు కరీంనగర్ నవోదయ కు వస్తున్నారు. తృతీయ భాషగా తెలుగు చదివే హిందీ రాష్ట్రాల నుంచే విద్యార్థుల కోసం నవోదయ విద్యాల య సమితి 2017లో తెలుగు విశ్వవిద్యాలయం వారి ఆధ్వర్యంలో నవోదయ తెలుగు ఉపాధ్యాయులుచే 6 నుంచి 10వ తరగతి వరకు నవోదయ తెలుగు భారతి పేర సరళ శైలిలో పాఠ్యపుస్తకాలు రచింపజేసి బోధిస్తున్నది. అలాగే గతంలో స్వర్గీయ ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అప్పటి బీహార్ ముఖ్యమంత్రి భగవత్జా ఆజాద్ తమ రాష్ట్రంలో తెలుగు తృతీయ భాషగా బోధించడానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు.

దానికి అప్పుడు మన ముఖ్యమంత్రి కూడా సానుకూలంగా స్పందించారు. ఈ విషయమై అప్పటి పత్రికల్లో వార్తలు కూడా వచ్చాయి. కానీ ఏ కారణం వల్లనో అది కార్యరూపం ధరించలేదు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అన్నాడని కాదు గాని ముందుగా హిందీ రాష్ట్రాలలో త్రిభాష సూత్రాన్ని అన్ని పాఠశాలల్లో చిత్తశుద్ధితో అమలయ్యేలా కేంద్ర ప్రభుత్వం శ్రద్ధ వహించాలి. రెండవది సంస్కృతాన్ని కాకుండా భారతీయ భాషలైన తెలుగు, కన్నడం, మలయాళం, తమిళం, బెంగాలీ, ఒడియా తదితర భాషల్ని అక్కడ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే పాఠశాలల్లో బోధన సాగించేలా తగిన చర్యలు గైకొనాలి. నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రైవేట్, ప్రభుత్వ అన్న తేడా లేకుండా కనీసం అన్ని ప్రాథమిక పాఠశాలలో మాతృభాషలో విద్యాబోధన జరిగేలా చర్యలు తీసుకోవాలి. అందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలి. ఈ సందర్భంలో ముఖ్యంగా తెలుగు నాట తెలుగుకు తెగులు సోకుతున్న నేపథ్యంలో ప్రాచ్య కళాశాలలను పునరుద్ధరించాలి. అలాగే తెలుగు పండిత శిక్షణ కళాశాలలను పున ప్రారంభించాలి. జాతి ఉనికికి భాష అనేది ఊపిరి అని గుర్తించాలి. మన చరిత్ర, భాషా సంస్కృతుల పరిరక్షణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు గైకొన్నప్పుడే దేశంలో రాష్ట్రంలో త్రిభాషా సూత్రం అనేది అమలవుతుంది. ఆ దిశగా తగిన చర్యలు చేపట్టాలని మనవి.



డాక్టర్ శంకరమంచి
శ్యాంప్రసాద్
99 891 48 305

# "ఇస్లాం" సార్వత్రిక ప్రేమ సందేశం



ఇస్లాం అనేది ప్రేమ, దయ, సమానత్వం మరియు మానవాళి ఐక్యతను నేర్పించే ఒక సార్వత్రిక సందేశం. ఇది కేవలం ముస్లింలకు మాత్రమే పరిమితమైనది కాదు. ప్రపంచంలోని అందరికీ సంబంధించిన ఒక జీవన విధానం. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అనేక కష్టాలను ఎదుర్కొన్నారు. కానీ, ప్రేమ, క్షమాపణ ద్వారా వాటిని అధిగమించారు. ఆయన బోధలు మానవులందరినీ ఒకే సోదరులుగా చూడాలని నేర్పాయి.

ఇస్లాం అనేది - జాతి, మతం, ప్రాంతం లేదా లింగం ఆధారంగా మానవులను విభజించదు. ఈ సృష్టిలో ప్రతి ఒక్కరూ సమానమేనని, అందరూ ఒకే దేవుని సృష్టి అని ఇస్లాం నొక్కి చెబుతుంది. ఒక నిజమైన ముస్లిం అందరినీ ప్రేమిస్తాడు. అతను స్వతహాగా ఎవరినీ ద్వేషించడు. పైగా ద్వేషాన్ని ప్రేమతో జయిస్తాడు. ప్రవక్త ముహమ్మద్ (స) తనపై జరిగిన అన్యాయాలను కూడా క్షమించారు. ఆయన అనుచరులు కూడా అనేక కష్టాలను ఎదుర్కొని, తమ ప్రాణాలను కూడా ఇస్లాం కోసం అర్పించారు. ఈ త్యాగాల ద్వారానే ఇస్లాం ప్రపంచంలో వ్యాపించింది.

ప్రపంచంలోని అనేక మేధావులు, నాయకులు మరియు రచయితలు ఇస్లాం గొప్పదనాన్ని గుర్తించారు. జార్జ్ బెర్నార్డ్ షా అనే ప్రసిద్ధ రచయిత ఇలా అన్నారు, "ముహమ్మద్ (స) బోధలు అన్ని కాలాలకు అన్వయించేవి. ఆయన మానవాళికి రక్షకుడు." మహాత్మా గాంధీ కూడా ఇస్లాంను ప్రశంసించారు. "ఇస్లాం అనేది కత్తి బలంతో కాకుండా, దాని సాధారణత మరియు నిజాయితీ ద్వారా విజయం సాధించింది," అని ఆయన అన్నారు.

ఫ్రెంచి నాయకుడు నెపోలియన్ బోనాపార్టే కూడా ఇస్లాంను గుర్తించారు. "ఖుర్ఆన్ అనేది మానవ జీవితానికి సంబంధించిన సత్యాలను నేర్పే గ్రంథం. ఇది ప్రపంచాన్ని నడిపించగల శక్తిని కలిగి ఉంది," అని ఆయన అన్నారు. ప్రసిద్ధ చరిత్రకారుడు ఎడ్వర్డ్ గిబ్బన్ కూడా ఇస్లాంను గుర్తించారు. "ముహమ్మద్ (స) జీవితం నైతిక శక్తికి ఉదాహరణ. ఆయన బోధలు మానవులను సత్య మార్గంలో నడిపిస్తాయి," అని ఆయన రాశారు.

భారతదేశానికి చెందిన కవయిత్రి సరోజినీ నాయుడు ఇస్లాంలోని సమానత్వాన్ని ప్రశంసించారు. "ఇస్లాం అనేది ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహించే మొట్టమొదటి మతం. మస్జిద్ లో ప్రార్థన సమయంలో అందరూ సమానంగా నిలబడతారు," అని ఆమె అన్నారు.

బ్రిటిష్ యువరాజు ఛార్లెస్ కూడా ఇస్లాంను గుర్తించారు. "ఇస్లాం ప్రపంచానికి అవసరమైన సమాధానాలను అందిస్తుంది. మనం ఇస్లాంనుండి నేర్చుకోవాల్సిన అంశాలు చాలా ఉన్నాయి," అని ఆయన అన్నారు. ముగింపుగా, ఇస్లాం అనేది ప్రేమ, శాంతి మరియు ఐక్యతను నేర్పించే మతం. ప్రవక్త ముహమ్మద్ (స) జీవితం మరియు బోధలు మనందరికీ ఆదర్శంగా నిలుస్తాయి. ముస్లింలు ఈ విలువలను పాటిస్తూ, ప్రపంచానికి ప్రేమ మరియు సహనాన్ని నేర్పించాలి. ఇదే ఇస్లాం యొక్క నిజమైన సందేశం.

డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్
9849328496

# రక్తంతో తడిసిన 'సిరియా'
## శాంతికై పరితపిస్తున్న ప్రజలు



సిరియా, మధ్యప్రాచ్యంలోని ఒక చారిత్రక నగరం. భౌగోళిక ప్రాముఖ్యత గల దేశం. 2011 నుండి తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ సంక్షోభం ప్రారంభంలో ప్రజాప్రతినిధి ప్రభుత్వం కావాలని డిమాండ్ చేస్తూ ప్రజా ప్రదర్శనలతో మొదలైంది. తర్వాత అంతర్గత యుద్ధంగా మారింది. ఈ యుద్ధంలో ప్రభుత్వ సైన్యాలు, విప్లవ సమూహాలు, జిహాదిస్ట్ సంఘాలు చివరకు అంతర్జాతీయ శక్తులు పాల్గొన్నాయి. ఈ సంక్షోభం సిరియా ప్రజలకు అపారమైన బాధలను మిగిల్చింది. రోజూ రక్తపాతం మే. సాయుధ సంఘర్షణ దేశాన్ని విధ్వంసం చేసింది.

**చారిత్రక పరిస్థితులు- హింసాకాండకు కారణాలు:**

సిరియా సంకటం యొక్క మూలాలు దాని చారిత్రక, రాజకీయ, సామాజిక పరిస్థితులలో దాగి ఉన్నాయి. 1963 నుండి 'బాత్' పార్టీ సిరియాలో అధికారంలో ఉంది, 1970 నుండి అస్సాద్ కుటుంబం దేశాన్ని పాలిస్తోంది. హాఫెజ్ అల్-అస్సాద్ (1970-2000), అతని కుమారుడు బషార్ అల్-అస్సాద్ (2000 నుండి) అధికారంలో ఉన్నారు. ఈ కాలంలో సిరియాలో అధికార కేంద్రీకరణ, రాజకీయ అణచివేత, మతపరమైన అసమానతలు ఈ దేశాన్ని పీడిస్తున్నాయి.

2011లో 'అరబ్ స్ప్రింగ్ ' ప్రభావంతో సిరియాలో కూడా ప్రజా ప్రదర్శనలు మొదలయ్యాయి. ప్రజలు రాజకీయ సుసంపన్నతను, స్వేచ్ఛను, న్యాయాన్ని డిమాండ్ చేశారు. అయితే, ప్రభుత్వం ఈ ప్రదర్శనలను హింసాత్మకంగా అణచివేసింది. ప్రజా సాయిధ తిరుగుబాటు, తీవ్రమైన, క్రూర సైనిక సాయుధ సంఘర్షణకు దారితీసింది.

**ప్రస్తుత పరిణామాలు:**

సిరియా యుద్ధం ప్రస్తుతం దాదాపు 13 సంవత్సరాలుగా కొనసాగుతోంది. ఈ సమయంలో, లక్షలాది మంది ప్రజలు మరణించారు. ఫలితంగా కోట్లాది మంది నిరాశ్రయులయ్యారు. సిరియా ప్రజలలో సగం మంది దేశం వెలుపలికి వలస వెళ్లారు. మరికొందరు అంతర్గతంగా స్థానభ్రంశం చెందారు. ప్రస్తుతం, సిరియా యుద్ధం అనేక పార్టీల మధ్య సంక్లిష్టమైన పరిస్థితిలో ఉంది.

ప్రభుత్వ సైన్యాలు, రష్యా, ఇరాన్ మద్దతుతో, దేశంలోని అధిక భాగాలను నియంత్రిస్తున్నాయి. అయితే, ఇద్ద్ లిబ్ ప్రావిన్స్ మరియు ఇతర ప్రాంతాలలో వివిధ విప్లవ సమూహాలు అలాగే జిహాదిస్ట్ సంఘాలు కొనసాగుతున్నాయి. ఉత్తర సిరియాలో, తుర్కీ మద్దతుతో కూడిన సిరియన్ నేషనల్ ఆర్మీ (ఎస్.ఎన్.ఏ) కూడా కొనసాగుతోంది.

అంతర్జాతీయ స్థాయిలో, సిరియా సంఘర్షణలు ప్రధాన శక్తుల మధ్య ప్రాక్సీ యుద్ధంగా మారింది. రష్యా, ఇరాన్ అస్సాద్ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నాయి . అయితే యునైటెడ్ స్టేట్స్, యూరోపియన్ యూనియన్ విప్లవ సమూహాలకు మద్దతు ఇచ్చాయి. ఈ అంతర్జాతీయ శక్తులు జోక్యం ఉన్న సంకట పరిస్థితుల్ని మరింత సంక్లిష్టంగా మార్చింది.

**ప్రభుత్వ విధానం - జియోపాలిటిక్స్ ప్రభావం:**

సిరియా ప్రభుత్వం తన అధికారాన్ని కాపాడుకోవడానికి రష్యా, ఇరాన్ మద్దతును ఆధారం చేసుకుంది. రష్యా సిరియాలో సైనిక రాజకీయ ప్రభావాన్ని పెంచుకుంది. ఇరాన్ షియా మిలిటెంట్ సమూహాల ద్వారా తన ప్రభావాన్ని విస్తరించింది. ఈ విధానం సిరియా యుద్ధాన్ని మధ్యప్రాచ్యంలోని షియా-సున్నీ విభజన యొక్క ప్రధాన అంశంగా మార్చివేసింది.

అంతర్జాతీయ స్థాయిలో, సిరియా సంకటం స్థితి యునైటెడ్ నేషన్స్, ఇతర అంతర్జాతీయ సంస్థలకు ఒక పెద్ద సవాలుగా మారింది. ఈ సంకటం యొక్క పరిష్కారం కోసం అనేక ప్రయత్నాలు జరిగాయి, కానీ ఇప్పటివరకు ఏదీ సఫలం కాలేదు.

**సిరియా భవిష్యత్తు:**

సిరియా భవిష్యత్తు అనిశ్చితంగా ఉంది. ప్రస్తుతం, అస్సాద్ ప్రభుత్వం దేశంలోని అధిక భాగాలను నియంత్రిస్తున్నప్పటికీ, దేశం యొక్క పునర్నిర్మాణం మరియు స్థిరత్వం కోసం అంతర్జాతీయ మద్దతు అవసరం. అయితే, అంతర్జాతీయ సమాజం సిరియా లో మానవ హక్కుల ఉల్లంఘనలు యుద్ధ నేరాలను గుర్తించడం వలన, అస్సాద్ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం కష్టంగా ఉంది. సిరియా యొక్క భవిష్యత్తు రాజకీయ పరిష్కారం, పునర్నిర్మాణంపై ఆధారపడి ఉంటుంది. ఈ ప్రక్రియలో, సిరియా ప్రజల అవసరాలు, వారి ఆకాంక్షల నెరవేర్పులే ప్రధాన అంశాలుగా పరిగణించబడాలి. అంతర్జాతీయ సమాజం సిరియా యొక్క పునర్నిర్మాణానికి మద్దతు ఇవ్వడం అవసరం. దేశంలో సుస్థిరత్వాన్ని, శాంతిని మొదట నెలకొల్పడం కోసం కృషి చేయాలి. సిరియా సంకటం ఒక చారిత్రక, రాజకీయ సంక్లిష్టతలతో కూడిన సమస్యగా మారుతుంది. ఈ సంకటం యొక్క పరిష్కారం కోసం రాజకీయ సంభాషణ, మానవతావాద సహాయం, అంతర్జాతీయ సహకారం అవసరం. సిరియా ప్రజలు శాంతి, స్థిరత్వాన్ని ఆశిస్తున్నారు, ఈ కనీసం ఆశలను నెరవేర్చడానికి అంతర్జాతీయ సమాజం తన పాత్రను విజ్ఞతతో కృషి చేయాలి.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

## మట్టి బండి రైతుల యదార్థ
# జీవితానికి అక్షర రూపం




మట్టి బండి ఒక అనుభవం, ఒక సామూహిక జీవనం, ఒక మానవ ధారావృత్తి, అన్నం ముద్ద రగిలి పగిలి, ఓడిపోయిన రైతు కుటుంబంలో కన్నీటి బిందువులలోనించి, పుట్టిన అక్షరాల ఆత్మఘోష. నాగ భైరవ ఆదినారాయణ రచించిన "మట్టిబండి" కవిత రైతు జీవిత కష్టనష్టాలను, వ్యవసాయ వ్యథను, గ్రామీణ భారతదేశ ఆత్మను హృదయానికి హత్తుకునేలా చిత్రీకరించింది. ఈ కవితా స్ఫూర్తి రైతు జీవితం, అతని కృషి, భవిష్యత్తు నాశనాన్ని మన్నించని సమాజపు యదార్థాన్ని ప్రతిబింబిస్తుంది. మా తాత చెమట చుక్కల్ని/రెక్కల కష్టాన్ని/ చిక్కని రుధిరాన్ని/ రొక్కంగా మార్చి/ సంపాదించిన పొలాన్ని/ అమ్మేశాను. ఈ వాక్యాలలో వ్యవసాయం ఈనాటిది కాదు, తరం తరంగా కష్టానికి చిరునామా అన్న భావం వ్యక్తమవుతుంది. రైతు తన నరనరాల్లో కష్టం నింపుకుని ఆస్తిని సంపాదించినా, తదుపరి తరానికి వ్యవసాయ జీవితం కొనసాగించలేని పరిస్థితి ఏర్పడిందని తెలుస్తోంది. ఈ పొలాన్నే కాదు/ వ్యవసాయంలో/సాయంగా నిలిచిన ఎడ్లను/అండగా ఉండే బండిని కూడా/అమ్మేశాను. వ్యవసాయ పద్ధతుల్లో వచ్చిన మార్పులను సూచిస్తుంది. ఒకప్పుడు వ్యవసాయాన్ని ఆధారంగా చేసుకుని బతికిన రైతు, ఇప్పుడు వ్యవసాయాన్ని వదిలిపెట్టి ఇతర వృత్తులను ఎంచుకోవాల్సిన దుస్థితి వచ్చింది. పంటల కాలంలో/ధాన్యపు బస్తాలతో/నిండు గర్భిణిలా మెల్లగా సాగి వచ్చే/బండిని చూస్తే/బంగారాన్ని మోసుకొచ్చే/లక్ష్మీదేవి అనిపించేది/ఏడాది పాటు కడుపు నింపే/కూటి కుండ అనిపించేది. మట్టిబండిని లక్ష్మీదేవిగా పోల్చడం ద్వారా, అది రైతు కుటుంబానికి ఇచ్చే భద్రత, సంతోషాన్ని వర్ణించాయి. గతంలో ఇది ఆర్థిక స్వతంత్రానికి ప్రతీకగా ఉండగా, ఇప్పుడది ఒక జ్ఞాపకంగా మాత్రమే మిగిలిపోయింది. మా అయ్యా/నాగలి పట్టి దున్నితే చాలు/స్కేలు పెట్టి పెన్సిల్ తో/గీత గీసినట్టుండేది చాలు/ఆ చాలు చక్కందనాన్ని/నిలింపులో అయినా సరే/నిలబడి చూడాల్సిందే. పసుపు పూసిన గడపల/బంతిపూలు విరగా పూసేవి/ఏమంతంలో తెల్లార గట్ల/పొలానికి వెళ్తుంటే/మంచు రాయంచలా/కనిపించేది.

కర్షకుడు అంటే/వర్షపు చినుకును/ఒడిసిపట్టి/విత్తునకు సత్తువను కూర్చి/పచ్చదనాన్ని పసిడిగా మార్చే/కార్మికుడు. రైతును ఒక శిల్పిగా, ప్రకృతిని నమ్ముకుని జీవించే మహానుభావుడిగా చిత్రీకరించడం గమనార్హం. విత్తనానికి జీవం పోసే గొప్పతనాన్ని కవి హృదయాన్ని హత్తుకునేలా వర్ణించాడు. నకిలీ విత్తనాలు/నట్ట నడి వీధులు/నగ్నంగా నాట్యం చేస్తున్న/పట్టించుకునే/ప్రజారక్షకులు కనబడడం లేదు. అతివృష్టి అనావృష్టి/కాలనాగులై కాటేసినప్పుడు/తన సిరాన్ని సిరాలో ముంచి/తన లలాటంపై/తన ఆత్మహత్యను/తానే లిఖించుకునే విధాత రైతు. వ్యవసాయాన్ని ముంచెత్తుతున్న సమస్యలు - నకిలీ విత్తనాలు, అధిక వర్షపాతం, దుర్భిక్షం, ప్రభుత్వ నిర్లక్ష్యం - ఇవన్నీ రైతును ఆత్మహత్య వైపు నెడుతున్న దురదృష్టాన్ని హృదయవిదారకంగా వ్యక్తీకరించారు."ఇది నిన్న రైతు ఎదుర్కొన్న పరిస్థితి%ౌ% ఇంకో వృత్తిలో ముందుకు సాగు."

ఇంతటితో ముగించు సాగు/ఇంకో వృత్తిలో ముందుకు సాగు. అన్నము రామచంద్ర/అనే అరుపులు వినిపిస్తాయేమో. వ్యవసాయాన్ని వదిలి వేరే వృత్తిని అన్వేషించాలని కవి సూచిస్తున్నాడా? లేక వ్యవసాయ పునరుజ్జీవనానికి అవసరమైన మార్పులను కోరుతున్నాడా? అన్నది పాఠకుల ఆలోచనకే వదిలేశాడు. ఈ కవిత రైతు జీవిత సత్యాన్ని ఎటువంటి ఆభరణాలు లేకుండా, కేవలం మట్టి వాసనతో మన ముందు ఉంచుతుంది. నాగ భైరవ ఆదినారాయణ తన పదాలతో వ్యవసాయ నష్టాలను హృదయానికి హత్తుకునేలా ప్రతిబింబించారు. ఇది కేవలం రైతు బాధనే కాదు, సమాజం, ప్రభుత్వం, వ్యవస్థల వైఫల్యానికి దర్పణం కూడా. ఈ కవిత్వం కేవలం చదవటానికి కాదు, ఆలోచించడానికి, మార్పును కోరటానికి. అన్నదాతలే అసలైన ధర్మవీరులని నేటి సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు తెలుసుకోవాలి. రైతు యొక్క ప్రాముఖ్యతను మట్టి బండి కవిత్వంలో డా"నాగభైరవ ఆదినారాయణ తన కన్నీటి బిందువులను అక్షరాలుగా చేర్చి మట్టి బండి కవిత్వానికి ఆద్యం పోశారు.



పూసపాటి వేదాద్రి
కవి సాహితీ విశ్లేషకులు
9912197694

# ఎల్ఆర్ఎస్‌కు మరో అవకాశం

- ఎల్ఆర్ఎస్ రుసుంలో 25 శాతం డిస్కౌంట్
- ఈ నెల 31 వరకు గడువు
- పుంజుకున్న క్రయవిక్రయాలు



**వనపర్తి, మార్చి 9 (జనంసాక్షి) :** గతంలో ప్లాట్లు కొని ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకోని వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. అప్పట్లో గడువులోగా దరఖాస్తు చేయని వారికి రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకున్న నిర్ణయం వరంగా మారింది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు చేసుకోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయకుండా నిలుపుదల చేసినందున నాలుగేళ్ళ నుంచి ప్లాట్ల క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కొత్తగా వెంచర్లు ప్రారంభించిన వారందరి పెట్టుబడులపై వడ్డీలు పెరిగి తీవ్ర ఆర్థిక ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు అవకాశం లేకపోవడంతో పెద్ద పెద్ద వెంచర్లలో వేసిన ప్లాట్లు కొనడానికి ఎవరూ ముందుకు రానందున భారీగా నష్టపోయామని, అయితే ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తమకు మేలు కలిగిస్తోందని రియల్టర్లు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

**పెండింగులో ఉన్న వాటికి కూడా..**

ల్ఆర్ఎస్‌కు అప్లై చేసుకోవాలనుకుంటున్న వారికి తెలంగాణ సర్కారు గుడ్‌న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో నాలుగేళ్ల నుంచి పెండింగులో ఉంటున్న ప్లాట్లకు సైతం రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు సర్కారు అంగీకరించింది.

**25 శాతం డిస్కౌంట్‌తో జోరందుకున్న క్రయవిక్రయాలు**

కొత్తగా ఎల్ఆర్ఎస్ కుదరఖాస్తుచేసుకుంటే అందుకు సంబంధించిన రుసుములో 25 శాతం డిస్కౌంటు ఇస్తామని ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన జీఓలో పేర్కొంది. దరఖాస్తు చేసుకోవాలనుకుంటున్నవారు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులోకి వెళ్లి ఫీజును ఇచ్చి, రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సర్కారు చెప్పింది. ఈ నెల 31లోగా రిజిస్ట్రేషన్లను చేసుకుంటేనే ఎల్ఆర్ఎస్ రుసుములో డిస్కౌంట్ దక్కుతుంది. ఎల్ఆర్ఎస్ పథకాన్ని అమలు చేసేందుకు వేగవంతంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ప్లాట్లు కొనడానికి లబ్ధిదారులు ముందుకు వస్తున్నారని రియల్ ఎస్టేట్ వ్యాపారులు అంటున్నారు. 25 శాతం రాయితీ అయినా పెద్ద మొత్తంలోనే ఆర్థిక ప్రయోజనం కలుగుతుందన్న ఆశ కొనుగోలుదారుల్లో ఏర్పడింది రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకున్నందున రిజిస్ట్రేషన్ కార్యాలయాలు రద్దీగా మారాయి.

**లే అవుట్‌ల ప్లాట్లకు కూడా**

ఇప్పటివరకు ఉన్న పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను కూడా వేగంగా పరిష్కరించాలని ప్రభుత్వం చెప్పింది. గతంలో అనుమతి లేని లే అవుట్ల విషంలో ప్లాట్ల రిజిస్ట్రేషన్లను సర్కారు నిషేధించింది. ఈ కారణంతో వాటిని కొన్న వారు నాలుగేళ్లుగా రిజిస్ట్రేషన్ చేసుకోలేకపోతున్నారు.

ఇప్పుడు అటువంటి వారంతా ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. లే అవుట్‌లో 10 శాతం ప్లాట్లు ఇప్పటికే రిజిస్టర్ అయి ఉంటే, అందులోని మిగతా 90 శాతం ప్లాట్లు రిజిస్టరు కాపోతే ఎల్ఆర్ఎస్ కింద వాటి క్రమబద్ధీకరణ చేసుకోవచ్చు. అలాగే, వాటికి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఇప్పటికే ఆయా ప్లాట్లను కొని, విక్రయ దస్తావేజు ఉన్నవారు వచ్చేనెల 31లోగా అప్లై చేసుకుంటే డిస్కౌంట్ దక్కుతుంది. చాలామంది నాలుగేళ్లుగా ఎల్ఆర్ఎస్‌ల పరిష్కారం కోసం వేచి ఉన్నారు. అటువంటి వారిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ అవకాశం కల్పించింది. లే-అవుట్ యజమాని 2020 ఆగస్టు 26కు ముందు.. తాను అభివృద్ధి చేసిన లే-అవుట్‌లో 10 శాతం ప్లాట్లను రిజిస్టర్డ్ సేల్ డీడ్ ద్వారా విక్రయించి ఉంటే, వారు ఎల్ఆర్ఎస్-2020 కింద దరఖాస్తు చేసుకున్నా, చేసుకోకపోయినా కూడా.. ఆ లే అవుట్‌లోని మిగతా 90 శాతం ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తారు. సదరు లే-అవుట్‌లో భూమిని కొనుగోలు చేసినవారు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్తే వారి వద్ద నిర్ణీత ఫార్మాట్‌లో వివరాలు సేకరించి, ఎల్ఆర్ఎస్ పోర్టల్‌కు పంపుతారు. అక్కడ నిర్ణీత క్రమబద్ధీకరణ చార్జీలు, ప్రోరేటా ఓపెన్ స్పేస్ చార్జీలు వసూలు చేసి రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి వచ్చే ఆ వివరాలను రూల్ నంబర్ 6 కింద ఎల్ఆర్ఎస్ కు దరఖాస్తుగా పరిగణిస్తారు.

## రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సన్మానం



**ఉర్కొండ, మార్చి 9 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని శ్రీ వేంకట బాల్ రామయ్య పాఠశాల విద్యార్థులను ఎయిమ్స్ ఐఐటీ వారు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన జాతీయ స్థాయి కార్యక్రమంలో సన్మానించారు. కార్యక్రమంలో సామల శివాని తండ్రి శ్రీకాంత్ ,సామల ప్రణవి తండ్రి శ్రీకాంత్ ,దొంత మణికంఠ తండ్రి రవి లను మెమెంటో ,సెర్టిఫికెట్ ,మెడల్ లతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ తిరుపతయ్య , కరస్పాండెంట్ బాల్ రాజు , ప్రిన్సిపాల్ జార్జ్ ,వైస్ ప్రిన్సిపాల్ రామ్ ,ఐఐటీ ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వాహనాలకు నెంబర్ ప్లేట్లు తప్పనిసరిగా వేయించుకోవాలి



**మక్తల్, మార్చి 9 (జనంసాక్షి) :** వాహనాలకు నెంబర్ ప్లేట్లు తప్పనిసరిగా వేయించుకోవాలని హెడ్ కానిస్టేబుల్ బలరాం తెలిపారు. ఆదివారం మక్తల్ టౌన్ లో నెంబర్ ప్లేట్ లేని వాహనాలు, సరియైన ధ్రువ పత్రాలు లేని వాహనాల పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 15 ద్విచక్ర వాహనాలను పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించి కేసులు నమోదు చేయడం జరిగిందని హెడ్ కానిస్టేబుల్ బలరాం తెలిపారు. ఈ సందర్భంగా మక్తల్ హెడ్ కానిస్టేబుల్ బలరాం మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. అలాగే వాహనాలకు నెంబర్ ప్లేట్ తప్పనిసరిగా వేయించుకోవాలని అన్నారు. వాహనాలకు నెంబర్ ప్లేట్లు లేకపోవడం వల్ల ఎక్కువ దొంగతనాలు అయ్యే అవకాశం ఎక్కువ ఉందని తెలిపారు. కావున తప్పనిసరిగా నెంబర్ ప్లేట్లు వేయించుకోవాలని సూచించారు. వాహనదారులు వాహనాలకు సరైన పత్రాలు తప్పకుండా కల్గి ఉండాలని తెలిపారు. అలాగే వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని అధికారులు తెలిపారు. పరిమిత వేగంలో వాహనాలు నడపాలి. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించి పోలీస్ వారికి సహకరించాలని తెలిపారు.

# సామాన్య ప్రజలకు తీవ్ర అన్యాయం

- భారత్ బచావో నాయకుడు గాదె ఇన్నయ్య




**మోమిన్‌పేట, నవంబర్ మార్చి 9 (జనం సాక్షి) :** కోటి ఆశలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని తరువాత ప్రజల ఆశలు అయ్యాయని, సామాన్య ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారని భారత్ బచావో నాయకుడు గాదే ఇన్నయ్య పేర్కొన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని గొలుముల నాగభూషణం అధ్యక్షతన తెలంగాణ ప్రజా ఫ్రంట్ వికారాబాద్ జిల్లా మొదటి మహాసభ జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులు దళితులు బడుగు బలహీన వర్గాల వ్యవసాయ సాగు భూములు లాక్కొని పెద్ద కంపెనీలకు కోట్లాది రూపాయలు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని రైతులకు మాత్రం మొండి చేయి చూపుతున్నారని ఆయన ఆరోపించారు ఇతర ప్రాంతాల వారు దోపిడీలు చేస్తే తెలంగాణ ప్రాంతం బార్డర్ వరకు తరిమి కొడతామని ఆయన హెచ్చరించారు ప్రభుత్వ భూముల పేరుతో భూములు లాక్కుంటున్నా రైతులకు న్యాయం జరిగే వరకూ తెలంగాణ ప్రజా ఫ్రంట్ పోరాటం చేస్తుందని ఆయన హెచ్చరించారు రోజు శుభాకాంక్షలు రాష్ట్ర పౌర హక్కుల సంఘం గడ్డం లక్ష్మణ్ తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి నాగభూషణం తెలంగాణ రాష్ట్ర కో కన్వీనర్ గణపురం సత్తయ్య రాష్ట్ర కో కన్వీనర్ బి రమాదేవి రాష్ట్ర కో కన్వీనర్ ప్రజా ఫంట్ శంకర ప్రభాకర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రజా కళా మండలి రాజా నర్సింలు రాష్ట్ర పిడిఎం అధ్యక్షులు చంద్రమౌళి రాష్ట్ర అంబేద్కర్ ప్రజా సంఘం అధ్యక్షుడు కట్టెల మల్లేశం చైతన్య మహిళా సంఘం జిల్లా కార్యదర్శి అలివేలు ప్రజాసంఘాల నాయకులు వివిధ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఎన్‌హెచ్‌ఏఐ తీరుపై జలమండలి ఎండీ అసంతృప్తి

- పనుల ఆలస్యంతో నీటి సరఫరాకు కొనసాగుతున్న అంతరాయం



**హైదరాబాద్, మార్చి 9 (జనంసాక్షి) :** రోడ్డు పనుల్లో భాగంగా తాగునీటి పైప్‌లైన్‌ను మరో చోటకు మార్చే పనులను ఆలస్యం చేస్తుండటం పట్ల నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) తీరుపై జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. 12 గంటలని చెప్పి 30 గంటలు గడిచినా పనులు పూర్తి చేయకపోవడం వల్ల నీటి సరఫరాకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని ఆయన పేర్కొన్నారు. బీహెచ్‌ఈఎల్ జంక్షన్ వద్ద రోడ్డు పనులు జరిపేందుకు గానూ జలమండలి పీఎస్సీ పైప్‌లైన్‌ను వేరే చోటకు మార్చాల్సిన అవసరం ఏర్పడింది. ఈ పనుల బాధ్యతను ఎన్‌హెచ్‌ఏఐ తీసుకుంది. 12 గంటల్లో పనులు పూర్తి చేస్తామని జలమండలికి చెప్పింది. దీంతో 08.03.2024(శనివారం) ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓ అండ్ ఎం డివిజన్లు 6, 9, 17, 22లోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, కొన్ని చోట్ల లో-ప్రెషర్‌తో సరఫరా ఉంటుందని జలమండలి ఒక ప్రకటన ద్వారా ప్రజలకు సమాచారం అందించింది. అయితే, 30 గంటలు గడుస్తున్నా పైప్‌లైన్‌ను మరోచోటకు మార్చే పనిని ఎన్‌హెచ్‌ఏఐ పూర్తి చేయలేదు. దీంతో నీటి సరఫరాలో అంతరాయం కొనసాగుతోంది. ఈ పరిస్థితిని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి సమీక్షించారు. వీలైనంత వేగంగా పనులు పూర్తి చేయాలని ఎన్‌హెచ్‌ఏఐకు సూచించారు. పనుల ఆలస్యం వల్ల నీటి సరఫరా పూర్తిగా పునరుద్ధరించి, సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు వారం రోజుల పాటు పట్టవచ్చని, ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

## డ్రైనేజ్ వాటర్‌లో నుంచి స్వామివారికి బోనాలు



**కొమురవెల్లి, మార్చి 9 (జనంసాక్షి) :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురెల్లి మల్లన్న స్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి దర్శనానికి వెళ్లే భక్తులు మురుగు నీటిలో నుంచే వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఆలయ పరిసరాలలో ఉన్న కోడెల స్తంభం వద్ద ఉన్న డ్రైనేజ్ కాలువ మరమ్మతులు పనులు చేపట్టకపోవడంతో రోజురోజుకు మురుగు కాలువల తయారైంది దీంతో రోడ్లపై మురుగునీరు ఏరులై పారుతుంది. ఆలయానికి వెళ్లే ప్రధాన ద్వారం గుండా ఈ మురుగునీరు ప్రవహించడంతో భక్తులు మురుగునీరు నుంచి నడుచుకుంటూ వెళ్లే దుస్థితి నెలకొంది. దీనివల్ల ఆ ప్రాంతంలో దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



**శంషాబాద్, మార్చి 9 (జనంసాక్షి) :** సయ్యద్ మహబూబ్ అలీ రాంగ్ రూట్లో అజాగ్రత్తగా, ప్రమాదకరంగా నడుపుతూ టూ వీలర్‌పై వెళ్తు ప్రమాదానికి గురై అక్కడికక్కడే చనిపోయిన సంఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తోండుపల్లి ఓఆర్ఆర్‌పై జరిగింది. సయ్యద్ మహబూబ్ అలీ వయసు 54 సంవత్సరాలు, పిల్లలతో కలిసి నారాయణపేట నుండి బ్రతుకుదెరువు కోసం నార్సింగి పరిధిలో గల ఇబ్రహీంభాగ్ లో నివసిస్తూ అక్కడి నుండి గత నాలుగు నెలల క్రితం శంషాబాద్ లోని రాజీవ్ గృహకల్పకు వచ్చి అక్కడే ఉంటున్నాడు. అతని కుమారులైన మహమ్మద్ యూసుఫ్ అతని తమ్ముడు ప్రైవేట్ జాబ్ చేసుకుంటూ జీవిస్తున్నారు. సయ్యద్ మహబూబ్ అలీ షాదనగర్ లో పని ఉందిని చెప్పి టూ వీలర్ అయిన హోండా షైన్ పై వరుసకు అల్లుడైన వ్యక్తిని తీసుకెళ్లిండు. పెద్దగోల్కొండ నుండి తొండుపల్లి ఓ ఆర్ ఆర్ రోడ్డు పై డివైడర్ దగ్గర రక్తగాయలతో మహబూబ్ అలీ చనిపోయి ఉన్నాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని. టోల్ గేట్ లోని సీసీ కెమెరాలను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నా అధికారులు

- బాధితుల ఆవేదన

**నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 9 (జనం సాక్షి) :** నారాయణపేట పట్టణంలోని పళ్ల బుర్జు నల్ల చెరువు నాలా ఆక్రమనను అడ్డుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు. నల్ల చెరువు కాల్వ సర్వే నెంబర్లను 690, 690/ఆ, 699లలో పక్కనుంచి వెళుతుందని తెలిపారు. పక్కనే సర్వే నెంబర్ 700, 701లో దినేష్ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి నాలాను కబ్జా చేసి మూసి వేశారని బాధితులు ఆశప్పా, డి.నర్సింహులు, కే.రాములు, ఉసేనమ్మ, మంగలి గోపాల్, గుత్తి రమేష్ గత ఏడాది సెప్టెంబర్ 30న ప్రజావాణిలో అలాగే అక్టోబర్ 14, 28 తేదీలలో కలెక్టర్ కు విన్నవించారు. అయితే రెండు సార్లు కలెక్టర్ నోటీసు పంపినా స్పందన లేకపోగా మూడోసారి నేరుగా ఇరిగేషన్ అధికారులకు ఇచ్చి రశీదు తీసుకు రావాలని ఆదేశించినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకుని నాలా కబ్జాను అరికట్టి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

## మార్చి 11న ఉప్పల్‌కు మంత్రి శ్రీధర్ బాబు



**ఉప్పల్, మార్చి (జనం సాక్షి) :** ఉప్పల్ ,రామంతాపూర్ డివిజన్ లో రూ.43.27 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించనున్న మంత్రి శ్రీధర్ బాబు. మీడియా సమావేశంలో వెల్లడించిన కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి. రాష్ట్రంలో అభివృద్ధినే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేపట్టే సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో రాష్ట్రం అన్ని రంగాలలో పురోగతిని సాధిస్తుందన్నారు. ఉప్పల్, రామంతాపూర్ డివిజన్‌లో రూ.43.27 కోట్ల నిధులతో చేపట్టే పలు అభివృద్ధి పనుల శంఖు స్థాపనకు రాష్ట్ర మంత్రి, జిల్లా ఇంఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు రానున్నట్టుగా చెప్పారు. ఆదివారం ఉప్పల్‌లోని వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇంఛార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి, చెర్లపల్లి ,ఉప్పల్ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, మందుముల రజితాపరమేశ్వర్ రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో రూ.240 కోట్లతో పలు అభివృద్ధి పనులను చేపట్టినట్లుగా చెప్పారు. ఉప్పల్ డివిజన్‌లో రూ.43.27 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనుల శంఖు స్థాపన ఈనెల 11న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగాజరుగుతాయన్నారు.

# వివేకానందుడు అందరికీ ఆదర్శం

- ఎస్పీ యోగేష్ గౌతం

**నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 9 (జనం సాక్షి) :** స్వామి వివేకానందుడి జీవితం ప్రతి వ్యక్తికి ఆదర్శమని నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. వివేకానందుడి బోధనలు ఆత్మవిశ్వాసానికి, ఉత్తమ జీవితానికి ప్రేరేపితం అన్నారు. నారాయణపేట మండలం కోటకొండలో స్వామి వివేకానంద విగ్రహ ఆవిష్కరణ అర్ధ దశాబ్దపు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సరిగ్గా ఐదేళ్ల క్రితం గవర్నర్ బండారు దత్తాత్రేయ ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. నభూతో న భవిష్యత్తు అనే రీతిలో నిర్వహించిన కార్యక్రమాన్ని స్మరించుకుంటూ మరోసారి కార్యక్రమం నిర్వహించారు. 2020 మార్చి 8వ తేదీన అంగరంగ వైభవంగా కనివిని ఎరుగని రీతిలో కోటకొండలో విగ్రహావిష్కరణ నిర్వహించారు. దానిని పురస్కరించుకొని యువతలో మరింత ఆత్మవిశ్వాసం ప్రేరేపితం కల్పించాలని లక్ష్యంతో అర్ధ దశాబ్దపు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో తమ జీవితాన్ని సఫలం చేసుకోవాలన్నారు. మానసిక ఉల్లాసం విజయాలకు పునాదులు అని గుర్తు చేశారు. బలమైన జీవ నమే భవితకు మార్గదర్శనం అని సూచించారు. ప్రపంచ దేశాలు గర్వించేలా ఉత్తమ జీవితం గడిపిన స్వామి వివేకానందుడు తరతరాలకు మార్గదర్శనం అని అన్నారు. ప్రతి విద్యార్థి, యువకుడు తమ జీవితంలో లక్ష్యం ఏర్పాటు చేసుకొని దాన్ని సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. పట్టుదల క్రమశిక్షణ ఉంటే సాధించలేనిది ఏదీ లేదని, అందుకు వివేకా నందుడి జీవితమే ఉదాహరణ అని చెప్పారు. అంతకు ముందు స్వామి వివేకానంద విగ్రహానికి గజమాలవేసి పూజా కార్యక్రమం నిర్వహించారు. నవ యువత యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు మాట్లాడారు. భారతీయ చరిత్ర చాలా గొప్పదని, దానిని ప్రపంచ దేశాలకు విస్తరించిన వివేకుడు స్వామీజీ అన్నారు. ప్రపంచ మహాసభలలో హిందుత్వం గొప్పతనాన్ని చాటి చెప్పిన మహనీయుడు స్వామీజీ అన్నారు. ఈ దేశంలో పేదరికం, అంటరానితనం అంతరించిపోవాలని లక్ష్యంతో వివేకానందుడు కృషి చేశారన్నారు. నేడు కొనసాగుతున్న మతమార్పిడులను అరికట్టేందుకు పని చేశారన్నారు. ప్రపంచ దేశాలకు భగవద్గీత సారాంశం, సందేశం అందించిన మహనీయుడు అన్నారు. ప్రపంచ దేశాలకు హిందుత్వం గొప్పతనం, విశిష్టతను వివరించిన వివేకానందుడు చిరస్మరణీయుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలోవిశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార ప్రముఖ్, నవ యువత యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పగుడాకుల బాలస్వామి,నవ యువత యువజన సంఘం నాయకులు పగుడాకుల రవికుమార్, యంగలి సిద్దు, చెవుల కృష్ణయ్య, యంగలి




నవీన్ , బొక్కి సాయిలు, చెవుల రవికుమార్, ఎంగలి సురేందర్, వడ్ల కాలప్ప, జంగం జగదీష్, చెప్ప నరేష్, కిషోర్, చర్లపల్లి ఆంజనేయులు, కమ్మరి మహేష్, బీడీల రాజు, కుమ్మరి వెంకటేష్, చుక్క రాజు ,బొమ్మను పాడు శేఖర్, పగుడాకుల చైతన్య, కంచే కుమార్ ,ఎల్లనోళ్ల రామకృష్ణ, గుండెగారి కాశీనాథ్, కావలి వెంకటేష్, ఎడ్ల కురుమయ్య, బొల్లు రాము, బొడెం బాలు, తిరుపతి యాదవ్ ,బొమ్మను పాడు రవి, పగుడాకుల కృష్ణ, చుక్క గోవిందు, గాజుల సత్యం, రాము నాయక్, గాజుల శ్రీధర్, తీగలి రాజు, వేపూరు విశ్వనాథ్ రెడ్డి, కావలి వెంకటేష్, కోస్గి కరుణాకర్, కోస్గి దస్తప్ప, నరేష్, చరణ్ రెడ్డి, ఇంతియాజ్, బీడీల లక్ష్మణ్, చెవుల నరేష్, దుబాయ్ రమేష్ గుండెగారి శ్రీనివాస్, బూనేడు కాశీనాథ్ కుందేళ్ళ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# రుణ విముక్తితో పాటు రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలి

- తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్




**గద్వాల నడిగడ్డ, మార్చి 9 (జనం సాక్షి) :** సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కమిటీ పిలుపులో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం శాంతినగర్ అంబేద్కర్ చౌరస్తా కేంద్రంలో ఆదివారము ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. గోపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, నూతన జాతీయ మార్కెటింగ్ విధానాన్ని రద్దు చేయాలని,మూడు వ్యవసాయ చట్టాలను మళ్లీ అమల్లోకి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని,విద్యుత్ సవరణ బిల్లుని రైతు సంఘాలతో చర్చించకుండా పార్లమెంటులో ప్రవేశపెట్టనని రాతపూర్వకంగా హామీ ఇచ్చి వాటిని తుంగలో తొక్కిందని, కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి నిధులలో కోత విధించిందని, ఎరువుల సబ్సిడీలో తగ్గింపు చేసిందని ధరల స్థిరీకరణ నిధి పెంచలేదని, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన రైతాంగానికి ఉపయోగపడే విధంగా చర్యలు చేపట్టలేదని అన్నారు. మార్కెట్ విధానాన్ని అమలు చేయమని తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని, పార్లమెంటులో దీన్ని వ్యతిరేకించాలని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని,డిమాండు చేశారు.గట్టు ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని,జూరాల ప్రాజెక్టులో పూడిక తీసివేయాలని, ఆర్డీఎస్ 15.9 టీఎంసీలు వాటా చివరి ఆయకట్టువరకు నీళ్లు పారించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలలో తెలంగాణ జన సమితి ఆలంపూర్ తాలూకా ఇన్చార్జి వై.రామ్మోహన్, సామాజిక కార్యకర్త గోపాల్ రెడ్డి,లింగేశ్వర్ రెడ్డి, రామకృష్ణ,తిక్కన్న, మద్దిలేటి, గోపాల్, పక్కిరన్న,సుదర్శన్, హాలీబాబు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాలకు 11 వేల కోట్లు మంజూరు..!

- ఉత్తర్వులుపై మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం



**హుస్నాబాద్, మార్చి 9 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌లకి 11 వేల కోట్లు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకోవడం పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి దశలో 55 నియోజకవర్గాల్లో ఒక్క యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కి 200 కోట్లు చొప్పున నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. ఇందులో తన నియోజకవర్గం హుస్నాబాద్‌లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కి కూడా 200 కోట్లు కేటాయించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకి ధన్యవాదాలు తెలిపారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌లు కార్పొరేట్ స్కూల్‌లకి ధీటుగా విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో విద్యా ప్రమాణాలు అందించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు,క్రీడలు , సాంకేతికత విద్యా ,కంప్యూటర్, సైన్స్ అండ్ టెక్నాలజీ తదితర శిక్షణ కోర్సులను ఈ యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ ద్వారా అందించనున్నారు.

## రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగించాలి

- ఎంపీ, ఎమ్మెల్యే చేతుల మీదుగా విగ్రహ ఆవిష్కరణ



**రామన్నపేట, మార్చి 9 (జనంసాక్షి) :** కంప్యూటర్ రంగాన్ని మన దేశానికి పరిచయం చేసి ఎంతోమంది విద్యార్థులు సాంకేతిక విద్యను నేర్చుకునేలా చేసింది రాజీవ్ గాంధీనే అని భువనగిరి పార్లమెంటు సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని చిట్యాల - భువనగిరి రహదారిపై మాజీ ఎంపీటీసీ వనం హర్షిని చంద్రశేఖర్ ఏర్పాటుచేసిన రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఆదివారం నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశంతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ గాంధీ హయాంలో నూతన సంస్కరణలు చేపట్టడంతో దేశం సాంకేతిక రంగంలో నేడు దేశం అభివృద్ధి చెందిందన్నారు. 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి యువతను ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యం చేసిన ఘనత రాజీవ్ గాంధీకి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్ సింగల్ విండో చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి, మహిళా మండల అధ్యక్షురాలు గాదె శోభారాణి కాంగ్రెస్ నాయకులు గంగుల వెంకట్ రాజిరెడ్డి, జినుకల ప్రభాకర్, గంగుల కృష్ణారెడ్డి, పున్న రమేష్, వనం నరసింహ, గోదాస్ పృథ్వీరాజ్, మేడి రవి చంద్ర, గుత్తా నర్సిరెడ్డి, తిమ్మాపురం మహేందర్ రెడ్డి, మాదుగుల జ్యోతి, మహమ్మద్ అక్రం, మొహమ్మద్ నాసర్, కేశవ్ దాస్ వెంకటేశం, కోట సుధాకర్, జెల్లా వెంకటేశం, రాయిని రమేష్, ఆముద లక్ష్మణ్, వనం సుధాకర్, బొడ్డు సురేందర్, బొడ్డు శంకరయ్య, కొమ్ము శేఖర్, గొలుసుల ప్రసాద్, మోటే రమేష్, మొహమ్మద్ అజార్, లవరం సాయి, కేశవదాస్ ఉదయ్, బట్టే సంతోష్ కుమార్, పిట్ట రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుడి కుటుంబానికి అండగా ఐసీబీఎఫ్

### బీమా ఇన్సూరెన్స్ అందజేత



**నిజామాబాద్, మార్చి 9 (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం ధర్మోర గ్రామానికి చెందిన పత్రి రాజేశ్వర్ అనే కార్మికుడు బతుకు దేరువకై ఖతార్ దేశం వెళ్లి అక్కడ తెలంగాణ గల్ఫ్ సమితిలో చేరి సాంస్కృతిక బృందంలో డప్పు కళాకారుడిగా అక్కడ జరిగే కార్యక్రమల్లో పాల్గొనేవాడు. అప్పుడు తెలంగాణ గల్ఫ్ సమితి కార్మిక సంఘం వారు అతడికి 125 రియల్స్ తో ఐసిబిఎఫ్ ప్రమాద బీమా ఇన్సూరెన్స్ చేపించారు. దురదృష్టవశాత్తు పత్రి రాజేశ్వర్ మరణించడంతో ఆ కుటుంబానికి ఇన్సూరెన్స్ 23 లక్షల 80 వేల రూపాయలు రాజేశ్వర్ భార్య అకౌంట్ లో జమఐనవి. కాగా భార్య, వికలాంగురాలు అయిన కూతురు, కీర్తి ఏ తోడు లేని ఇద్దరు అక్కలకు ఈ ఇన్సురెన్స్ ధ్వారా వారిని రోడ్డున పడకుండా కాపాడగలిగింది. దీనికి కారణమైన తెలంగాణ గల్ఫ్ సమితికి ఆ కుటుంబ సభ్యులు, కుల పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గల్ఫ్ లో మరణించిన కార్మికులకు ప్రభుత్వం ధ్వారా వచ్చే 5 లక్షల ఎక్స్ గ్రేషియాను కూడా అందజేయాలనీ, వికలాంగురాలైన కుమార్తె కు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని అనిల్ ఇరవత్రికి ఫోన్ చేసి మాట్లాడడంతో సానుకూలంగా స్పందించిన అనిల్ తప్పకుండ ఆ కుటుంబానికి అండగా ఉంటామని మాటిచ్చారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ జేఏసీ ఉద్యమ నాయకులు చెన్నామనేని శ్రీనివాసరావు, గుగ్గిల్ల రవి గౌడ్, సుందరగిరి శంకర్ గౌడ్, కారం మారుతి పాల్గొన్నారు.

## హైదరాబాద్-విజయవాడ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు యువకుల దుర్మరణం




**అల్వాల్, మార్చి 9 (జనంసాక్షి) :** హైదరాబాద్-విజయవాడ హైవేపై నార్కెట్పల్లి లింగోటం వద్ద తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పొగమంచు కారణంగా, వేగంగా వెళ్తున్న ఓ వాహనం రోడ్డు పక్కన నిలిపివున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో అల్వాల్‌కు చెందిన సాయి గౌడ్, లోతుకుంటకు చెందిన సాయి సందీప్ గౌడ్ అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ ప్రారంభించారు. ప్రాథమికంగా, ప్రమాదానికి పొగమంచు కారణమని అధికారులు తెలిపారు. ఈ ఘటనతో అల్వాల్, లోతుకుంట ప్రాంతాల్లో తీవ్ర విషాదం నెలకొంది. మృతుల కుటుంబసభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

## క్షతగాత్రులను పరామర్శించిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



**ఊర్కొండ, మార్చి 9 (జనం సాక్షి) :** మండలంలోని జకినాలపల్లి గ్రామానికి చెందిన దశరథ్ గౌడ్ కుమారుడు ప్రమాదవశాత్తు కరెంట్ పోల్ పైన పడటంతో గాయాలతో కల్వకుర్తి డిఎంకె హాస్పిటల్ లో ఉండడంతో స్వయంగా హాస్పిటల్ కి వెళ్లి పరమర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకోవడం జరిగింది. మాదారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు మేకల మల్లేష్, రామ్‌రెడ్డిపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు గోవిందు శ్రీకాంత్ ను కల్వకుర్తి అమ్మ హాస్పిటల్లో స్వయంగా వెళ్లి ఆరోగ్య పరిస్థితిలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ద్యాప వీరారెడ్డి, మాజీ సర్పంచులు శ్రీనివాసులు, కృష్ణ గౌడ్, రాజయ్య, సీనియర్ నాయకులు జంగయ్య, మాజీ ఎంపిటిసి గోపాల్ గుప్తా , కదిరె శేఖర్ యాదవ్, అక్బర్, గిరి, శ్రీకాంత్ రెడ్డి, రాజేష్, దుబ్బరవి,ఆంజనేయులు,వెంకటేష్,శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణోత్సవ సభలో శ్యాం సుందర్ పుస్తకావిష్కరణ



**వనపర్తి బ్యూరో, మార్చి 9 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ ధర్మ పీఠం స్వర్ణోత్సవం సభలో వనపర్తి పట్టణానికి చెందిన డా. బైరోజు శ్యాం సుందర్ పరిశోధనా గ్రంధాన్ని మాజీ శాసనసభ సభాపతి, యంయల్‌సి సిరికొండ మధుసూదనాచారి ఆవిష్కరించారు. ఆదివారం హైదారాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో విశ్వబ్రాహ్మణ ధర్మ పీఠం ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ సభలు జరిగాయి. ఈనాటి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై 2015 సంవత్సరంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పిహెచ్‌డి పట్టాను పొందిన డా.శ్యాం సుందర్ సిద్ధాంత గ్రంధాన్ని ఆవిష్కరణ చేశారు.విశ్వకర్మ సంస్కృతి సాంప్రదాయానికి సంబంధించి సాహిత్యం ఎంతో ఉందని దానిపై మరిన్ని పరిశోధనలు రావాలని మధుసూదనాచారి సాహితీ వేత్తలను కోరారు.ఈనాటి కార్యక్రమంలో సభాపతి డా.త్రిమూర్తుల గౌరీ శంకర్,లాలుకోట వెంకటాచారి,దైవజ్ఞ శర్మ తదితరులు పాల్గొన్నారు.నిర్వాహకులు డా.శ్యాం సుందర్ ను శాలువా పూలమాల జ్ఞాపికతో సత్కరించారు.డా.శ్యాం సుందర్‌ను సన్మానించడం పట్ల వనపర్తి జిల్లా సాహితీ కళా వేదిక అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్, ప్రతినిధులు జనజ్వాల, బండారు శ్రీనివాస్, నరేష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## పచ్చని అడవిని కాలుష్యం చేస్తామంటే ఊరుకోం

- జేఏసీ నాయకుల హెచ్చరిక




**సంగారెడ్డి, మార్చి 9 (జనంసాక్షి) :** ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డును ఏర్పాటు చేసి అడవిని కాలుష్యం చేస్తామంటే ఊరుకునే ప్రసక్తే లేదని జేఏసీ నాయకులు హెచ్చరించారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా నర్సాపూర్‌లో చేపట్టిన రిలేనిరాహార దీక్ష ఆదివారం నాటికి 19వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. డంపింగ్‌యార్డు నిర్మాణంతో అడవితోపాటు రాయారావు చెరువు కాలుష్యం అవుతుందని గుర్తుచేశారు. డంపింగ్‌యార్డు నిర్మాణాన్ని నిలిపే వరకు ఉద్యమం కొనసాగిస్తామని వెల్లడించారు. ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి డంపింగ్‌యార్డు నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు దేవెందర్‌యాదవ్, మహేశ్‌గౌడ్, దయానంద్, నరేందర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

## ఆటిజం పిల్లల పట్ల ధోరణి మారాలి

- ఆటిజం సిఆర్ఈ సర్టిఫికేట్ అందుకున్న రిసెర్చ్ స్కాలర్ అట్ల స్వప్న




**హైదరాబాద్, మార్చి 9 (జనంసాక్షి) :** ఆదివారం రోజున స్వీకార్ అకాడమీ ఆఫ్ రిహాబిలిటేషన్ సైన్సెస్ సికింద్రాబాద్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణ చేతుల మీదుగా ఆటిజం సర్టిఫికేట్ ను పి.హెచ్.డి.స్కాలర్ అట్ల స్వప్న అందుకున్నారు. రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా న్యూఢిల్లీ ఆమోదించిన నిరంతర పునరావాస విద్యా కార్యక్రమంలో భాగంగా ఆటిజం స్పెక్ట్రమ్ రుగ్మతలతో బాధపడుతున్న పిల్లల వ్యూహాలు మరియు నిర్వహణపై మూడు రోజుల జాతీయ స్థాయి సి.ఆర్.ఈ. కార్యక్రమం స్వీకార్ అకాడమీ ఆఫ్ రిహాబిలిటేషన్ సైన్సెస్ సికింద్రాబాద్ యందు జరిగింది. ఈ సందర్భంగా పి.హెచ్.డి. స్కాలర్ అట్ల స్వప్న మాట్లాడుతూ సమాజంలో ఆటిజం పిల్లల పట్ల వ్యవహరించే ధోరణి మారాలి, ఆటిజం పిల్లలకు ఆత్మీయ శిక్షణ అవసరం అని అన్నారు. చిన్నపిల్లలో వచ్చే ఆటిజం సమస్యను భూతద్దం లో చూడకుండా దాన్ని పరిష్కరించుకునే దిశలో పనిచేయటం ముఖ్యం అని తల్లిదండ్రులకు పి.హెచ్.డి. స్కాలర్ అట్ల స్వప్న సూచించారు. ఈ కార్యక్రమంలో స్వీకార్ అకాడమీ ఆఫ్ రిహాబిలిటేషన్ సైన్సెస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ లు దండి సబిత, ప్రవీణ, రాథోడ్ విఠల్, పలువురు పునరావాస నిపుణులు పాల్గొన్నారు.

## రోడ్డు తవ్వకాల్లో పురాతన విగ్రహం లభ్యం

- ఎన్కేపల్లి గ్రామంలో చోటు చేసుకున్న వింత ఘటన



**బొంరాస్‌పేట, మార్చి 9 (జనంసాక్షి) :** మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ నిధుల నుండి మంజూరైన రూ. 25 లక్షల సిసి రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా గుంతల మాయమైన రోడ్డును జెసిబి సహాయంతో లెవలింగ్ చేస్తుండగా మట్టిలో నుండి పురాతనమైన విగ్రహం లభ్యమై బయటపడింది.దీంతో అక్కడ ఉన్న పలువురు గ్రామస్తులు అవాక్కయ్యారు. అందరూ కలిసి విగ్రహాన్ని పక్కకు తీసుకెళ్లి మట్టిలో నుండి తీసిన విగ్రహానికి జలముతో అభిషేకం చేసి అనంతరం పూజలు నిర్వహించారు. గ్రామ దేవత అమ్మవారి విగ్రహముగా పలువురు గ్రామస్తులు తెలిపారు.పూజా కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ పూజారి నర్సింలు, గ్రామస్తులు బోయిని బాలరాజు, కురువ లక్ష్మప్ప, రాజశేఖర్ రెడ్డి, పరమేష్, నర్సింలు,వెంకటయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీ వ్యవహార శైలి నచ్చక బీఆర్ఎస్‌లో చేరిక

- జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజ్



**ఉప్పునుంతల, మార్చి 9 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీ వ్యవహార శైలి నచ్చక బిఆర్ఎస్ పార్టీలో చేరిక మండల పరిధిలోని మామిళ్ళపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎంపిటిసి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజు సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న విధివిధానాలు నచ్చక ఉచిత హామీల పేరుతో ప్రజలను మోసం చేస్తూ కాంగ్రెస్ పార్టీ పబ్బం గడుపుతుందని వారన్నారు ఒక సంవత్సరం లోనే ప్రజలతో తీవ్ర వ్యతిరేకత మొదలైందని అందుకు ఉదాహరణకి ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటూ పార్టీకి సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్న మాధవరం లక్ష్మమ్మ రాజల్ రావు ప్రభాకర్ రావు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగిందని వారన్నారు కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనప్పుడు పార్టీని కాపాడుకుంటూ అన్ని విధాల సహాయ సహకారాలు చేసుకుంటూ వస్తున్న కానీ పార్టీలోకి మధ్యల వచ్చినవారికి నామినేట్ పదవులు కట్టబెడుతూ పార్టీని నమ్ముకున్న వారికి తీరని అన్యాయం చేస్తున్నారు. గత సంవత్సరం మామిళ్ళపల్లి దేవాలయ గుడి చైర్మన్ గా తాత్కాలికంగా చెయ్యడం జరిగినది ఇప్పుడు అధికారంలోకి వచ్చాక గ్రామస్తులను కాదని నాయకులు ఏకపక్ష నిర్ణయం తీసుకొని గతంలో పార్టీని పట్టించుకొని వారికి అధికారంలోకి వచ్చాక వేరే గ్రామానికి చెందిన వారికి చైర్మన్ పదవి కట్టబెట్టడం జరిగిందని వారన్నారు అదేవిధంగా ఆరు గ్యారంటీలా పేరుతొ కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలను మోసము చేసిందని పార్టీ పైనా ప్రజలలో చాలా వ్యతిరేకత ఉంది అని వారు విమర్శించారు ఈ కార్యక్రమంలో వారితోపాటు పార్టీ అధ్యక్షులు కొత్త రవీందర్ రావు మాజీ సర్పంచ్ దామోదర్ మాజీ టెంపుల్ చేర్మెన్ రామస్వామి గౌడ్ పార్టీ నాయకులు మురళీదార్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కాలానికి మౌలిక వసతులకు కృషి చేస్తా..

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**కాప్రా, మార్చి 9 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గం లోని ప్రతి కాలనీకి మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ బండారు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని కృష్ణ రెడ్డి నగర్ (బంజారా కాలనీ) నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ల వారీగా అన్ని ప్రణాళికలు సిద్ధం చేశాము అని ఆయన అన్నారు.నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సిసిఎస్ ప్రతినిధి పద్మరెడ్డి బిఆర్ఎస్ పార్టీ నాయకులు మహేష్ గౌడ్, నాయకులు జయ కృష్ణ , సంపత్ కుమార్ కృష్ణారెడ్డి నగర్ కాలనీ ప్రెసిడెంట్ వెంకటేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి సురేష్ నాయక్, వైస్ ప్రెసిడెంట్ శంకర్ నాయక్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆరు నెలల్లో వంతెన నిర్మాణం పూర్తి చేస్తాం





**పెండింగ్ పనులన్నీ త్వరితగతిన పూర్తి చేస్తాం**

**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**రూ 6 కోట్ల 85 లక్షలతో బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన**

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 9 (జనంసాక్షి)

తిప్పాపూర్ నుండి వేములవాడకు రావడానికి మూలవాగుపై రెండో వంతెన నిర్మాణాన్ని ఆరు నెలల్లో పూర్తి చేయిస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడలోని తిప్పాపూర్ రెండో బ్రిడ్జి నిర్మాణానికి రూ 6 కోట్ల 85 లక్షల వ్యయంతో ఆదివారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్,కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ మర్రిపెల్లి రిజర్వాయర్,కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్, లచ్చపేట రిజర్వాయర్, చందుర్తి బిమోత్కరావుపేట రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారం,జిల్లా కలెక్టర్ చొరవతో భారీగా నిధులను ఈ ప్రాంత అభివృద్ధికి మంజూరు చేస్తున్నారన్నారు.సిఎం రేవంత్ రెడ్డి ఇటీవల వేములవాడలో సుమారు రూ 700 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని అయన గుర్తు చేశారు. రూ 47 కోట్లతో రోడ్డు వెడల్పు,రూ 35 కోట్లతో నిత్య అన్నదాన సత్రం, ఆలయ విస్తీర్ణ చేపడుతున్నామన్నారు. భక్తులకు శీఘ్రంగా దర్శనం కలిగించేలా ఆలయ విస్తరణ చేపడుతున్నమని విప్ తెలిపారు. మే నెలలో శృంగేరి పీఠాధిపతి విధుశేఖర శేఖరశర్మ వేములవాడకు రానున్నారని తెలిపారు. ఆలయ నిర్మాణ సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్వామి వారి దర్శనాన్ని భీమేశ్వర ఆలయంలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.ఉత్తమ విద్య అందించేలా రుద్రంగి మండల కేంద్రంలో ఎటీసి కాలేజ్, మేడిపల్లి జూనియర్ కళాశాల మంజూరు చేయడం జరిగిందన్నారు.బ్రిడ్జి నిర్మాణంలో నష్టపోయే వారికి తప్పకుండా నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. నష్టపోయే వారికి భూసేకరణ చట్టం ప్రకారం తప్పకుండా న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ తో పనుల్లో కొంత జాప్యమైందన్నారు. రహదారి వెడల్పులో దుకాణాలు పూర్తిగా కోల్పోతున్న వారికి మధ్య మార్గం ద్వారా ప్రత్యామ్నాయం చూస్తున్నామన్నారు.రైల్వే లైన్లో భూమి పోతున్న వారికి కూడా తప్పకుండా న్యాయం చేస్తామని విప్ స్పష్టం చేశారు. ఇండ్లు లేని నిరుపేదలకు త్వరలోనే ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. బస్ డిపో పక్కన ఆగిపోయిన ఇళ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు.

**రూ.80 లక్షలతో మార్కెట్ సముదాయం**

వేములవాడలోని రెండవ బైపాస్ రోడ్ లో రూ 80 లక్షలతో అన్నీ ఒకే రకంగా కూరగాయల సముదాయం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కొనుగోలుదారులు, అమ్మకం. దారులకు ఉపయోగపడేలా, సౌకర్యంగా ఉండేలా నిర్మాణాలు చేయిస్తామన్నారు. వేములవాడలో ప్రతి వార్డులో 10 లక్షలతో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని ప్రకటించారు.ఇప్పటికీ పట్టణంలో 34 సంఘ భవనాల నిర్మాణాలకు నిధులు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. నిత్యం తాను ప్రజల మధ్యలో ఉంటూ ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటునన్నారు. కోనరావుపేట మండల పరిధిలో త్వరలోనే పెండింగ్లో ఉన్న బ్రిడ్జిల నిర్మాణాన్ని చేపడతామని ప్రకటించారు. వేములవాడ మూల వాగులో ఉన్న గంగమ్మ దేవాలయానికి భక్తులు వెళ్లడానికి నడిచిపోయేట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రజలు తమ ఫ్లాట్లను క్రమబద్ధికరించుకునేందుకు ప్రభుత్వం ఈ నెల 31 వరకు అవకాశం కల్పించిందన్నారు. అర్హులైన వారందరూ తప్పకుండా వినియోగించుకోవాలని అయన పిలుపు నిచ్చారు.తద్వారా 25 శాతం రాయితీ కల్పిస్తారని తెలిపారు. వేములవాడ నియోజకవర్గంలో అర్ధాంతరంగా ఆగిపోయిన అన్ని పనులను పూర్తి చేస్తామని విప్ ఆది శ్రీనివాస్ హామీఇచ్చారు.

**విప్ ప్రత్యేక శ్రద్ధతోనే..**

వేములవాడలో దాదాపు 10 సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక శ్రద్ధతోనే పనులు ప్రారంభమయ్యాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాఅన్నారు. రాష్ట్ర ప్రభుత్వం,సీఎం రేవంత్ రెడ్డి, ఆయా శాఖ మంత్రులను ఒప్పించి బ్రిడ్జి నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్ నిధులు మంజూరు చేయించారని గుర్తు చేశారు. భూసేకరణ ఇతర పనులను రెండు నెలల్లో పూర్తి చేసిన వేములవాడ ఏ ఆర్డీవో, తహసిల్దార్, ఆర్ అండ్ బి, మున్సిపల్ శాఖ, నీటిపారుదల అధికారులను కలెక్టర్ అభినందించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కాంగ్రెస్ నాయకులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, కూరగాయల కొమురయ్య, చిలుక రమేష్, పుల్కం రాజు, ఎర్రం రాజు తో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ ప్రతీ గింజ కొనే బాధ్యత ప్రభుత్వానిదే..

**మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి**

**మతి భ్రమించి మాట్లాడటం సరికాదు**

**బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి**



నిర్మల్ బ్యూరో, మార్చి 09 (జనంసాక్షి)

మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వయసు మీదపడి మతి భ్రమించి మాట్లాడటం సరికాదని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇష్టా రీతిన అక్రమాలు, భూ కబ్జాలు, చేసి జిల్లాను అస్తవ్యస్తంగా చేసారని మండి పడ్డారు.గత ప్రభుత్వ హయాంలో పామ్ ఆయిల్ కంపెనీకి 40 ఎకరాల ప్రభుత్వ భూమిని సొంత పార్టీకి చెందిన ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టింది వాస్తవం కాదా. సిద్ధిపేటలో ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ కు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీనీ ఇచ్చినపుడు, నిర్మల్ లో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడంలో ఆంతర్యం ఏమిటి. గతంలో మంత్రిగా పనిచేసిన ఇంద్రకరణ్ రెడ్డి పాక్ పట్ల గ్రామంలోని తన వ్యవసాయ క్షేత్రం సమీపంలో ఓ ప్రైవేటు కంపెనీకి తక్కువ ధరకు ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ కొరకు భూములు ఇప్పించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కేవలం కమిషన్లకు ఆశపడి భూములను అప్పనంగా అప్పగించారని విమర్శించారు. ప్రైవేట్ ఫ్యాక్టరీలు ఇచ్చే కమిషన్లతో రైతులతో కలిసి ధర్నా చేస్తానని చెప్పడం సిగ్గుచేటన్నారు. 100 గజాలు పేదలకు ఇల్లు కట్టుకోవడానికి ఇవ్వడానికి చేతకాదు కానీ 40 ఎకరాల ప్రభుత్వ భూమిని తక్కువ ధరకే ప్రైవేటు కంపెనీకి ధారాదత్తం చేయొస్తధా. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పై నిర్వహించిన జాయింట్ ఇన్స్పెక్షన్ కమిటీ నివేదిక ప్రకారం కేటాయించిన భూమి ఇరిగేషన్ శాఖ పరిధిలోని. ఆ ప్రాంత ముంపుకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉందనీ ఇరిగేషన్ అధికారులు నివేదికలో పొందుపర్చారు. ఫ్యాక్టరీ నిర్మాణ అనుమతులు ఒక సర్వే నెంబర్ లో చూపి, నిర్మానం వేరే సర్వే నెంబర్లో చూయించారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రతిదీ రాజకీయం చేయడం సరికాదని, ఫ్యాక్టరీ నిర్మాణం కొరకు సీఎం రేవంత్ రెడ్డి, ఇన్చార్జ్ మంత్రి సీతక్క దగ్గర ధర్నా చేయాలని ఎద్దేవా చేశారు. ఓటమి చెంది నెల రోజులు కాక ముందే అధికార పార్టీలో చేరింది అక్రమ ఆస్తులు కాపాడుకోవడానికి కాదా, నీ సొంత తమ్ముళ్లు చేసిన అక్రమాలు అంతాఇంతా కాదు, ఇరిగేషన్ నాళాలు పూడ్చి అనుమతులు లేకుండా లెఔట్ లు చేసి అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. రత్నాపూర్ కాండ్లిలో గ్రో-ఫాస్ట్ పేరిట మీ కుటుంబ సభ్యుడు ఇరిగేషన్ కెనాల్ ను పూర్తిగా ధ్వంసం చేసి, పూడ్చేసి అక్రమ లేఔట్ నిర్మించారు. మాడేగావ్ లో అక్రమంగా క్రషర్ మిషన్ నడిపించింది మీ కుటుంబ సభ్యులు మీ తమ్ముడే కదా. చిట్యాల్ గ్రామంలో మీ తమ్ముడు మురళీధర్ రెడ్డి ఏర్పాటు చేసిన ఏఎంఆర్ లేఔట్ కు దారికోసం అసైండ్ భూమిలో ఉన్న నాళాపై అక్రమంగా బ్రిడ్జి నిర్మాణం చేసింది వాస్తవం కాదా.. ప్రభుత్వ భూమిలో నిర్మించిన డి- మార్ట్ పై కలెక్టర్ తో పాటు ఉన్నత అధికారులకు కంప్లయింట్ చేశాం. గతంలో మీ హయాంలో జరిగిన డి1 పట్టాల పై, డి - మార్ట్ నిర్మాణాలపై ఎంక్వైరీ చేయిస్తున్నామని తెలిపారు. అధికార పార్టీలో ఉండి ఈ ఎంక్వైరీని అడ్డుకునే ప్రయత్నం చేస్తే రాబోయే మా ప్రభుత్వంలో తప్పక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, మెడిసెమ్మ రాజు, పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, నాయకులు ముత్యం రెడ్డి , భూపాల్ రెడ్డి ,సాదం అరవింద్, భూపతి రెడ్డి, వొడిసేల అర్జున్, మండల పార్టీ అధ్యక్షులు మార గంగారెడ్డి, బర్కుంట నరేందర్, నర్సరెడ్డి, నాయకులు విజయ్, రాజేందర్, దత్తూరాం పాల్గొన్నారు.

# పాలన చేతకాకనే విమర్శలు

**పంటలు ఎండుతున్న...**

**ఎమ్మెల్యే విదేశాల్లో**

**బీఆర్ఎస్ నాయకుల ధ్వజం**



పాలకుర్తి, మార్చి 09(జనంసాక్షి)

పరిపాలన చేతకాకనే ప్రతిపక్ష పార్టీలపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేసున్నారని బీఆర్ఎస్ జెడ్పి ఫ్లోర్ లీడర్లు మంగళంపల్లి శ్రీనివాస్, పుస్కూరి శ్రీనివాసరావు, దుయ్యబట్టారు. అదివారం మండల కేంద్రంలోని సోమేశ్వర ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముఖ్యఅతిథిగా వారు హాజరై మాట్లాడారు. పాలకుర్తి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, అనుమాండ్ల యూన్సిరెడ్డిలపై తీవ్ర వ్యతిరేకత పెరిగిందని, ప్రజలు పాలన పట్ల అసంపూర్తిగా ఉన్నారని అన్నారు. ప్రజాభిప్రాయం మేరకు ఎమ్మెల్యేపై వస్తున్న వ్యతిరేకతపై వాస్తవ కథనాలు ప్రచురిస్తున్న మీడియా ప్రతినిధులపై కేసులు పెడుతూ రాక్షసానందం పొందుతున్నారని అన్నారు. రాజ్ కుమార్, ఉపేందర్ వంటి యువ జర్నలిస్టులను ఝాన్సీరెడ్డి ఇబ్బందులు గురి చేస్తుందని విమర్శించారు. పాలకుర్తిలో ప్రజాపాలన జరుగడం లేదని, రాచరిక పాలన కొనసాగుతుందన్నారు. నియోజకవర్గంలో ఏ సామాజిక వర్గం సంతృప్తితో లేరని అన్నారు. న్యాయం కోసం పోలీస్ స్టేషన్కు వెళ్తే న్యాయం జరగకపోవడంతో గిరిజన బిడ్డ శ్రీనివాస్ ఆత్మహత్యకు పాల్పడిన విషయం అందరికి తెలుసన్నారు. ఎమ్మెల్యే తీరుపై సోషల్ మీడియాలో పోస్టు పెడితే గిరిజన యువకుడు సురేష్ బాబును తొర్రూరు పోలీస్టేషన్లో చితక బాదిన చరిత్ర పాలకుర్తి ఎమ్మెల్యే పాలనలో కనిపించిందన్నారు. నీళ్లు తీసుకురావడం చేతకాక వరి పొలాలు, పంటలు ఎండిపోతున్నాయని అవేధన వ్యక్తం చేశారు. రైతుల తరుపున మాజీ మంత్రి దయాకర్ రావు పోరాటం చేస్తే భయనడి నీళ్లు వదిలారని గుర్తు చేశారు. దయాకర్ రావు పోరాటం వల్లనే నీళ్లు వదిలితే ఆ ఘనత మాదేనని ఎమ్మెల్యే గొప్పలు చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. నియోజకవర్గంలో సొంత కాంగ్రెస్ పార్టీలోనే కుమ్ములాటలు మొదలయ్యాయని, ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవహారల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్కు కాంగ్రెస్ కార్యకర్త ఎమ్మెల్యే, కాంగ్రెస్ ఇంచార్జీల తీరుపై పిర్యాదు చేశాడని గుర్తు చేశారు. ఇది పూర్తిగా కాంగ్రెస్ పార్టీకి సంబందించిన విషయమని ఈ పిర్యాదు వెనుక మాజీ మంత్రి దయాకర్రావు ఉన్నారని పేర్కోనడం సిగ్గు చేటన్నారు. వారి తప్పులను సరిదిద్దుకోలేని అధికార పార్టీ నాయకులు ప్రతిపక్ష పార్టీపై ఆరోపణలు చేయడం దారుణమన్నారు. ఓవైపు పం టలు ఎండుతుంటే స్థానికంగా ఉండి నీళ్లు వదిలేందుకు కృషి చేయాల్సిన ఎమ్మెల్యే అమెరికాలో గ్రీన్కార్డు పొందేందుకు వెళ్లారని అన్నారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డిలు పీఏల మాటలు వింటున్నారని, ప్రజల మాటలు వినడం లేదని అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో కాంగ్రెస్ పార్టీ మీడియా సమావేశం నిర్వహించడం పూర్తిగా చట్టా వ్యతిరేకమని, దీనిపై జిల్లా కలెక్టర్ సుమోటో క్రింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు పసునూరి నవీన్, తీగల దయాకర్, సింధే రామోజీ, నర్సింహనాయక్. రంగు కుమార్, ఈదురు ఐలయ్య, గాంధీ నాయక్, రాజేష్ నాయక్, బబ్బూరి శ్రీకాంత్ గౌడ్, బొబ్బల అశోక్ రెడ్డి, పేరం రాము. బిందు శ్రీనివాస్,ఉన్నారు.

# రాణి రుద్రమ" స్ఫూర్తితో వరంగల్ పోలీసులకు ప్రత్యేకత ఉంది..

**వరంగల్ పోలీస్ ఎవర్ విక్టోరియస్....**

**వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**బదిలీపై వెళ్తున్న కమిషనర్ కు ఘనంగా వీడ్కోలు..**

వరంగల్ ప్రతినిధి: మార్చి 9 (జనం సాక్షి)





వరంగల్ పోలీసులు ఎవర్ విక్టోరియస్ అని, ఇక్కడ పనిచేయడం సంతృప్తినిచ్చిందని బదిలీపై వెళ్ళుతున్న పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్కు బదిలీ పై వెళుతున్న అంబర్ కిషోర్ ఝా తో పాటు, సిఐడి ఎస్పీగా బదిలీ అయిన ఈస్ట్జోన్ డిసిపి రవీందర్ను వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారులు ఆదివారం ఘనంగా సత్కరించారు.

వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, బదిలీపై వెళుతున్న అంబర్ కిషోర్ ఝా తో పాటు డిసిపి రవీందర్లను పుష్పాగుచ్చాలు అందజేసి జ్ఞాపికలను అందజేసారు. ఈ సందర్భం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝు మాట్లాడుతూ వరంగల్ జిల్లాతో ఆరు సంవత్సరాల అనుబంధం వుందని, ఒఎస్డీగా, ఎస్పీగా ఇక్కడే పనిచేయడంతో పోలీస్ కమిషనర్గా వరంగల్లో పనిచేయడం చాలా సంతోషాన్ని కలిగించిందని తన మనోభావాన్ని వెల్లడించారు. నేరస్థులను పట్టుకోవడం వరంగల్ పోలీసులు దిట్టయని, ఎలాంటి పని అయిన దానిని విజయవంతంగా పూర్తి చేయడంలో వరంగల్ పోలీసుల ప్రత్యేకతని ఝు కొనియాడారు

, రాణిరుద్రమ దేవి పాలించిన ఈ నెలపై పనిచేసినందుకు నేను గర్వపడుతున్నాని పోలీస్ కమిషనర్ తెలిపారు. డిసిపి రవీందర్ మాట్లాడుతూ ఈస్ట్జోన్ డిసిపిగా పనిచేయడం సంతృప్తి కలిగించిందని, ఇక్కడి అధికారులు, సిబ్బంది సమన్వయంతో చెయడం ఇక్కడి పోలీసుల ప్రత్యేకతని డిసిపి తెలిపారు.పూల వాహనంలో అంబర్ కిషోర్ ఝు కు ఘనంగా వీడ్కోలు బదిలీపై వెళ్ళుతున్న పోలీస్ కమిషనర్ కమిషనర్ అంబర్ కిషోర్ను సుందరంగా పూలతో అలంకరించిన పోలీస్ వాహనాన్ని డిసిపి స్థాయి నుండి కానిస్టేబుల్ వరకు త్రాడుతో వాహనాన్ని లాగుతూ గౌరవంగా వీడ్కోలు పలికారు.

ఈ కార్యక్రమములో డిసిపిలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, అంకిత్కుమర్, ఏఎస్పీ చైతన్య, అదనపు డిసిపిలు రవి, సురేష్కుమార్తో పాటు, ఏసిపిలు,ఇన్స్పెక్టర్లు,ఆర్.ఐలు, ఎస్.ఐలు, ఆర్.ఎస్.ఐలు ఇతర పోలీస్ మరియు పరిపాలన విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# సర్కార్ ఆదేశాలు బేఖాతర్

అదిలాబాద్ ప్రతినిది, (జనంసాక్షి)





**ఉదయం,రాత్రి వేళల్లో ఇసుక అక్రమ తవ్వకాలు**

**జిల్లాకు కూతవేటు దూరంలోనే ఇసుక దందా**

**నీరు లేక రాళ్ళ వాగుగా మారుతున్న మహానది**

**చూసిచూడనట్టు వ్యవహరిస్తున్న అదికారులు**

**జిల్లా అంతటా ఇదే తీరు**

రాష్ట్రంలో ఎక్కడైనా వాగుల్లో ఎవరైనా సరే అక్రమంగా ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టి అక్రమంగా తరలిస్తే అటువంటి వారిపై ఇకనుంచి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆదేశాలు జారీ చేయడం జరిగింది. కానీ అది మూణ్ణాళ్ల ముచ్చటగానే మారింది. అయితే పరిస్థితి మళ్ళీ మొదటికి వచ్చింది. అదిలాబాద్ జిల్లాలో ఇప్పుడు ఇసుకాసురులు రెచ్చి పోతున్నారు.అది కూడా జిల్లాకు కూత వేటు దూరంలోనే కావడం విడ్డూరంగా ఉంది . ఎవరు ఏమి అనడం లేదు కదా అని మాకేం అడ్డు అని ఇంకా జోరుగా అక్రమంగా ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతూ తమ పని కానిచ్చేస్తూ అక్రమంగా వ్యాపారం చేస్తూ లక్షలు ఆర్జిస్తున్నారు. సర్కార్ ఆదేశాలను బే ఖాతరు చేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. జిల్లాలో ప్రవహిస్తున్న పెన్ గంగా నదిని ఇసుకాసురులు టార్గెట్ గా పెట్టుకున్నారు. ఈ నది ప్రవహిస్తున్న పరిసర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ట్రాక్టర్ లను పెడుతూ రోజు వారీ కూలీలను పెట్టీ యదేచ్చగా ఇసుక తవ్వకాలను చేపడుతున్నారు. ఇసుక తవ్వకాలతొ నదిలో నీరు లేక పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమదకరంగా మారిపోతుంది. అందిన కాడికల్ల తవ్వేస్తూ నదిని నామ రూపాలు లేకుండా చేస్తున్నారు. ఇదంతా జిల్లాకు కేవలం పది నుంచి ముప్పై కిలో మీటర్ల కూత వేటు దూరంలోనే జరుగుతుండడం విస్మయం కలిగిస్తోంది. గతంలో కొన్ని రోజులు ఇసుక అక్రమ తవ్వకాలు జరగ కుండా పోలీసులు కొన్ని గ్రామాలలో నది వద్ద గట్టి పహారా కూడా నిర్వహించి పటిష్ట చర్యలు తీసుకున్నారు. అయితే ఇసుకాసురులు దానిని తేలిగ్గా తీసుకున్నారో ఏమో మళ్ళీ తమ దందాను పునరావృతం చేస్తున్నారు. ఇప్పుడు ఇసుక అక్రమరవాణా తరలింపు మామూలుగా మారిపోయింది.ప్రభుత్వం ఎంత హెచ్చరించిన ఇసుకాసురులు మాత్రం పట్టించుకోవడం లేదు.ఫలితంగా పెన్ గంగా నదిలో క్రమంగా నీటి నిలువలు తగ్గిపోతూ వస్తుండడం విచారకరం. ఈ మహానదిలో ఇప్పుడు ఎక్కడ చూసినా నీరుకు బదులు రాళ్ళ కుప్పలు దర్శనం ఇస్తున్నాయి. నీరు ఉండాల్సినగంగా నది ఇప్పుడు మోడు వారి పోయి ఎడారిని తలపిస్తుంది. నదిలో ఎప్పుడూ గల గల పారుతూ నీటి సవ్వడి చేసే గంగమ్మ తల్లి ఇప్పుడు నీరు లేక బోసిపోయి వెల వెల పోతుంది. జిల్లా అంతటా ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పుడూ ఈ సమస్య మరింత తీవ్రం అవుతుంది. ఇసుకాసురులు ఇసుకను అక్రమంగా తరలించు పోతున్నపటికిని కొంతమంది అదికారులు మాత్రం పట్టించుకోవడం

లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఇసుకాసురులు వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుందని కొంత మంది ప్రజలు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పెన్ గంగా నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలను ఆపి ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ డబ్బులను సొమ్ము చేసుకుంటున్న ఇసుకాసురులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పెన్ గంగా నదికి

పూర్వ వైభవం తీసుకొచ్చే విధంగా కృషి చెయ్యాలని కోరుతున్నారు.

**ఉదయం వేళలో అక్రమ తవ్వకాలు**

గుట్టుచప్పుడు కాకుండా ఎవరూ చూడరనే ఉద్దేశంతో ఇసుకాసురులు తెల్లవారు జామునే ట్రాక్టర్ లను దినసరి లేబర్ లను పెట్టీ అక్రమంగా నదిలో ఇసుకను తోడేస్తూ జల్లెడ పట్టేస్తున్నారు.

ఇలా ఉదయం తొమ్మిది గంటల వరకు ఇసుక తవ్వి ఎవరూ గుర్తు పట్ట కుండా ఉండేందుకు అక్కడే సమీపంలో చెట్ల పొదల మాటున ఇసుకను డంప్ చేసేస్తూ ఏమీ ఎరగనట్టు నటిస్తున్నారు.

**భవిష్యత్తులో పెను ప్రమాదం**

జిల్లాలో ఉన్న నదులన్నింటిలో ఇసుకాసురులు నదుల్లోని ఇసుకను ఇష్టారీతిన తోడేస్తుండడం వల్ల భవిష్యత్తులో పెను ప్రమాదం పొంచి ఉంది. నీటి నిలువలు తగ్గిపోయి నదులన్నీ ఎడారి ప్రాంతాలుగా మారే అవకాశం లేకపోలేదు.దీని వల్లఇసుక దొరకడం ప్రశ్నార్ధకంగా మిగిలిపోతుంది.

# పన్ను వసూళ్ల పురోగతిని పరిశీలించిన కమిషనర్

వరంగల్ ఎంజీఎం, మార్చి 9(జనంసాక్షి)




హనుమకొండ పరిధి ఎస్ బి హెచ్ కాలనీ,64 వ డివిజన్ పరిధి లోని టి ఎన్ జీ ఓస్ కాలనీలలో పన్ను వసూళ్ల తీరును ఆదివారం బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి పన్ను వసూళ్ల తీరును పరిశీలించి సమర్ధవంతంగా నిర్వహించుటకు అధికారు లకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడు తూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని, పన్ను చెల్లించని కమర్షియల్ రెసిడెన్షియల్ నిర్మాణాలకు నోటీసులు అందజేయడం తో పాటు సుదీర్ఘంగా పన్నులు చెల్లించని భవనాలకు ఇప్పటికే రెడ్ నోటీసులు అందజేయడం జరిగిందని, పన్నులు చెల్లించని పక్షంలో అట్టి ఆస్తులను సీజ్ చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ సందర్భం గా పన్నులు చెల్లించిన యాజమాన్యాలకు కమిషనర్ రసీదు లను అందజేశారు.ట్రేడ్ లైసెన్స్ వసూళ్లు ప్లాస్టిక్ ఎన్ఫోర్స్ మెంట్ పెనాల్టీ తీరు తనిఖీ... హన్మకొండ పరిధి 63 వ డివిజన్ విజిటేబుల్ మార్కెట్ ప్రాంతం లో ట్రేడ్ లైసెన్స్ వసూళ్ల తీరు తో పాటు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయించిన దుకాణాలకు విధించిన పెనాల్టీని కమిషనర్ క్షేత్ర స్థాయి లో పరిశీలించి నిర్వహించిన విధానాన్ని పరిశీలించి

మాట్లాడుతూ నిర్దేశించిన ట్రేడ్ లక్ష్యాలను వేగవంతం గా వసూళ్లు చేయాలని అన్నారు. ప్లాస్టిక్ ను నియంత్రించే క్రమం లో సింగిల్ యూజ్ ను అరికట్టాలని కమిషనర్ ఎన్ఫోర్స్మెంట్ టీంలను సూచించారు. ఈ కార్యక్రమంలో సి ఏం హెచ్ ఓ డా.రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఆర్ ఓ యూసూఫోద్దీన్, ఎస్ ఐ లు రవీందర్ యాదవ్, వెంకన్న, ఆర్ ఐ నవనీత్, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, జవాన్ లు తదితరులు పాల్గొన్నారు.

# ఆ ఊరికి ఎవరూ పోరు..!

- నీళ్లు లేవు.. అభివృద్ధి నిధులూ లేవు
- ప్రధాన రహదారి గుండా ఎటువెళ్లినా దుమ్ము
- నాటి సర్కారు.. నేటి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ప్రజల ఆవేదన
- కామారెడ్డి జిల్లా కేంద్రానికి 30 కిలోమీటర్లలోనే గ్రామం



**మా గ్రామం ఎన్ని రోజులు ప్రభుత్వ అభివృద్ధికి దూరంగా ఉండాలి ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎంతమంది ఎమ్మెల్యేలు వచ్చిన మమ్మల్ని గుర్తించరా అంటూ ఓ గ్రామ ప్రజల ఆవేదన, రోడ్లు లేవు, సీసీలు లేవు. డ్రైనేజీలు కరువు, అగ్గిపెట్టె అవసరమైన రెండు కిలోమీటర్ల దూరం నడవాల్సిందేన పట్టించుకోని అధికార యంత్రాంగం మా ప్రజల గోస చూడండి. ఇది ఎక్కడో కాదు. కామారెడ్డి జిల్లా గాంధారి మండల ఓ మారుమూల గ్రామం రామలక్ష్మణపల్లి.**

**గాంధారి, మార్చి 9 (జనం సాక్షి) :** ఆ ఊరికి ఎవరు పోరు. ఈ కాలంలో అలాంటి ఊరు ఉందా అని అందరూ ఆశ్చర్య పోవాల్సిందే. ఆ గ్రామం ఎక్కడో కాదు కామారెడ్డి జిల్లాకి సరిగ్గా 30 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. గాంధారి మండలంలోని ఓ చిన్న గ్రామమైన రామలక్ష్మణ పల్లి జిపి, పరిధిలోని అన్ని సమస్యలే ఉన్నాయి. ఆ గ్రామంలో నీళ్ల ట్యాంకు ఉన్న ఒక్కరోజు కూడా తాగునీరు సరపర కాదు. ఆ నీళ్లు కూడా ఒక్కొక్క ఇంటికి రెండు నుంచి నాలుగు బిందెలు నీళ్లు వస్తే అదృష్టమే ఈ విషయమై జిపి పై అధికారి లైన మండల ఎంపీడీవో, ఎంపీవో, దృష్టికి ఎన్నోసార్లు తీసుకెళ్లిన సమస్య తీరడం లేదంటున్నారు. గ్రామంలో బోరు బావులు లేక మిషన్ భగీరథ ద్వారా మాత్రమే నీరు సరఫరా అవుతుంది. అనుకున్న సమయంలో ఆ గ్రామ ప్రజల దురదృష్టము ఏదో కానీ అది కూడా లేదు. గత పోయిన సంవత్సరం సర్పంచుల హయాంలో అటు ఇటుగా కొంత మట్టుకు సమస్య ఆ గ్రామ సర్పంచ్ తీర్చే ప్రయత్నం చేశారు. సర్పంచులు పదవి కాలం ముగిసిన నాటి నుండి ఇప్పటివరకు గ్రామపంచాయతీకి సంబంధించిన ఏ ఒక్క అభివృద్ధి పనులు ఆ గ్రామానికి లేవు. కనీసం తాగదామంటే బిందెడు నీరు లేదంటే నమ్ముతారా, ప్రతి యొక్క పనికి గాంధారి మండల కేంద్రానికి వెళ్లవలసి ఉంటుంది. రామలక్ష్మణపల్లి గ్రామం నుండి రోడ్డు గాందారికి లేక వెళ్లాలనుకునే చోధకులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక్కొక్క పరిస్థితిలో రైతులు కాలినడకల వెళ్లాల్సి వస్తుంది. ఇప్పుడున్న స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్, దృష్టికి మాకు రోడ్డు వేయాలని వినతి పత్రాలు సమర్పించాము. అని స్థానిక గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పుడున్న ఎమ్మెల్యే, స్పందించి ఆ గ్రామాన్ని అభివృద్ధి చేసే విధంగా అడుగులు వేస్తున్నారని ఆ గ్రామ ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా అప్పటికి ఆ గ్రామంలో పుట్టడమే మా దురదృష్టం అంటూ గ్రామ ప్రజలు బాధపడుతున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారి గుండా ఎటుగా వెళ్లిన దుమ్ము దులికి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలైతేనేమి కాలినడకన వస్తున్న చోదకులు అసలే కనపడరు అంటే నమ్ముతారా కనుక గ్రామస్తుల విన్నపం ఏమిటంటే బి ఆర్ ఎస్ పార్టీ ఉన్నప్పుడు ఆ పార్టీ ఎమ్మెల్యే నల్లమడుగు సురేందర్, తన గ్రామం వరకే రోడ్డు వేసుకొని మా గ్రామాన్ని మర్చిపోయారని ఆవేదన చెందుతున్నారు. ఇప్పుడున్న ఎమ్మెల్యే మదన్మోహన్ స్పందించి నల్లమడుగు, గ్రామం నుండి గాంధారి వరకు రోడ్డు వేయించాలని అలాగే రామలక్ష్మణపల్లి, గ్రామాన్ని దృష్టిలో పెట్టుకొని వాడవాడకు సిసి రోడ్లు సాంక్షన్ చేసి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని వేడుకుంటున్నారు. చూద్దాం ఈసారైనా మా గ్రామ సమస్యలపై ఏ అధికారైన స్పందిస్తారా లేదా అనేది అని అంటున్నారు. ప్రజలు దీనిని బట్టి పై అధికారులు వెంటనే స్పందించి ఆ గ్రామానికి కనీస సౌకర్యాలు రోడ్డులైతేనేమి గ్రామంలో ఉన్న ప్రజలకు త్రాగునీటి సమస్య అయితే నేమి గ్రామ కాలనీలకు సీసీ రోడ్డులైతేనేమి మంజూరు చేసి ఆ గ్రామ తీర్చే విధంగా ప్రయత్నం చేసి గ్రామంలో ప్రజలు ఉన్నారని గుర్తించే ప్రయత్నం చేస్తే బాగుంటుంది. అనే గ్రామ ప్రజలు అధికారులను యంత్రాంగాన్ని కోరుకుంటున్నారు.

# ఐకేపీ అక్రమాలపై పూర్తి విచారణ ఎప్పుడో..

- కొన్ని సంవత్సరాల నుండి అవకతవకలు
- అధికారులు ఎందుకు పట్టించుకోలేదు
- క్షేత్రస్థాయి నుండి పై స్థాయి అధికారుల వరకు తెలిసే జరిగిందా..
- ప్రతి సంవత్సరం ఆడిట్లో నిధుల అవకతవకలు బయట పడలేదా..
- పూర్తి విచారణ చేయాలని మండల ప్రజలు డిమాండ్



**కల్లూరు, మార్చి 9 (జనంసాక్షి) :** ఐకెపి కార్యాలయం పరిధిలో స్త్రీ నిధి రుణాల వసూళ, చెల్లింపుల్లో జరిగిన అక్రమాలపై జిల్లా స్థాయి అధికారులు జోక్యం చేసుకుని పూర్తిస్థాయి విచారణ జరిపి అక్రమాలకు పాల్పడి న వారి పై చట్ట పరంగా చర్యలు తీసుకొవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పేద మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం స్త్రీనిధి పథకం 2011లో ప్రారంభించి నాటి నుంచి రుణాలు మంజూరు చేస్తుండగా కొందరు సిబ్బంది తీరుతో పథకం అమలుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. మండలంలో 1,593 డ్వాక్రా గ్రూపులు ఉండగా, ప్రస్తుతానికి 1,251 గ్రూపులే కొనసాగుతున్నాయి. అంతేకాక ఉన్న సంఘాల సమావేశాలు సైతం సరిగ్గా నిర్వహించకుండా, రికార్డులు రాయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఇటీవల బదిలీపై జనవరి 9వ తేదీన కల్లూరు వెలుగు ఏపీఎంగా బీరవల్లి రాంబాబు బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామ దీపికలు, సీసీలతో 10వ తేదీన సమీక్ష సమావేశం నిర్వహించారు. స్త్రీనిధి రుణాల చెల్లింపులో అవకతవకలు జరిగాయని గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఒకే క్లస్టర్‌లోని ముగ్గు వెంకటాపురం, పేరువంచ, చంద్రుపట్ల, నారాయణపురం, గ్రామాలలో సీఆర్పీలతో ఆడిట్ చేయించగా వీఓఏలు వసూలు చేసిన, బ్యాంకులో చెల్లించిన స్త్రీనిధి రుణాల్లో సుమారు రూ.52 లక్షలు తేడా బయటపడింది. ఒక క్లస్టర్లోనే పెద్ద మొత్తంలో అవకతవకలు అయిందంటే మిగతా ఆరు క్లస్టర్ల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో తేలాల్సి ఉంది. పక్కదారి పట్టిన నగదు వెంటనే రికవరీ చేయాలని నలుగురు సీసీలు, 11 మంది గ్రామ దీపికలకు నోటీసులు ఇవ్వగా అవకతవకలు పాల్పడిన వారు తప్పు ఒప్పుకుని రూ 20 లక్షల మేర తిరిగి చెల్లించారనీ, మిగతా క్లస్టర్ల పరిధిలోని కొంతమంది 10 లక్షల వరకు చెల్లించారని ఏపీఎం రాంబాబు చెప్తున్నారు. ఇది ఇలా ఉండగా గ్రామ దీపికలుపై కొత్తగా వచ్చిన ఏపిఎం మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారనీ కొంతమంది గ్రామ దీపికలు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎ పీఎం మాత్రం పని సక్రమంగా ఉండాలని స్త్రీనిధి డబ్బులు రికవరీచేయాలని ఆదేశిస్తున్న నేపథ్యంలోనే సిబ్బందిని దుర్భాషలాడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ అంశంపై ఆయన స్పందిస్తూ రుణాల చెల్లింపులో సుమారు రూ.52 లక్షల తేడా ఉండడం తో సిబ్బందితో మాట్లాడి నగదు చెల్లించాలని సూచించానే తప్ప ఎలాంటి దుర్భాషలాడలేదని చెప్పారు. గత కొన్ని సంవత్సరాల నుండి ఈ తేడాలు వస్తూనే ఉన్నాయని ఇప్పుడు కొత్తగా వచ్చినవి కావని సభ్యులు అంటున్నారు. అయితే ప్రతి సంవత్సరం ఆడిట్ చేస్తున్నప్పుడు ఇవి బయటికి రాలేదాని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆడిట్ చేస్తే అధికారులు అన్ని సక్రమంగా ఉన్నాయని ఎలా రిపోర్ట్ ఇస్తున్నారని ఐకెపి సంస్థకే తెలియాలి అంటున్నారు. వెలుగులో నిధుల గోల్మాల్పై వచ్చిన ఆరోపణలకు స్పందిస్తు ఖమ్మం నుండి విచారణ చేయటానికి వచ్చిన అధికారులు కేవలం ఐకెపి కార్యాలయంలోనే కొన్ని గంటల్లోనే విచారణ చేసుకొని అక్రమాలు జరిగితే ఎవరిని ఉపేక్షించేది లేదంటూ చర్యలు కుంటాము అంటూ వెళ్లిపోయారు. మండలంలో ఉన్న అన్ని క్లస్టర్ల పరిధిలో గ్రామాల వారీగా ఎందుకు విచారణ చేపట్టలేదు. ప్రస్తుతం మండలంలో పనిచేస్తున్న గ్రామ దీపికలు, ఐకెపి ఏపీఎం ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. నిజాయితీగా పనిచేస్తే నిందలు వేస్తారా అని, ఏపిఎం అంటుండగా, మేము ధరించే వస్తువులు దుస్తులుపై కామెంట్ చేస్తూ అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని గ్రామ దీపికలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో ఆ శాఖకు సంబంధించిన జిల్లా స్థాయి అధికారులు ఎందుకు జోక్యం చేసుకోవటం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. మండలంలో వేలాది కుటుంబాలువ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ స్వయం సహాయకసంఘాల్లో సభ్యులుగా చేరి నెలనెలా పొదుపు చేసుకుంటూ ప్రభుత్వం ద్వారా బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధిరుణాలు తీసుకొని సకాలంలో చెల్లించినప్పటికీ బ్యాంకుల్లో జమా చేయకపోవడంతో డ్వాక్రా సంఘాల్లోని సభ్యులు ఆందోళన చెందుతున్నారని. ఇప్పటికైనా ఐకెపిలో వచ్చిన అవినీతి ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని, నష్టపోయిన స్వయం సహాయక గ్రూపు సభ్యులకు న్యాయం చేయాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

## తండ్రి మందలించాడని మనస్థాపానికి గురై 10వ తరగతి విద్యార్థి ఆత్మహత్య



**బొంరాస్‌పేట, మార్చి 9 (జనం సాక్షి) :** తండ్రి మందలించాడని మనస్థాపానికి గురై బొంరాస్ పేట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థి మమత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని మహతిపూర్ గ్రామంలో చోటుచేసుకుంది.స్థానిక ఎస్సై అబ్దుల్ రావుఫ్ తెలిపిన వివరాల ప్రకారం మహంతిపూర్ గ్రామానికి చెందిన తిరుపతి అనిత,తిరుపతి లాలప్ప కూతురు తిరుపతి మమత(15) ఈనెల 8న ఉదయం 11 గంటలకు సమయంలో పోలం దగ్గర ఉన్న తల్లిదండ్రుల దగ్గరికి పాఠశాలకు సెలవు ఉండడంతో మమత వెళ్ళగా, గొర్రెల దగ్గర కొద్దిసేపు కాపలా ఉండమని తండ్రి మందలించడంతో మనస్థాపానికి గురైన విద్యార్థి ఇంటికి వెళ్లి దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోవడంతో హుటాహుటిన ఆటోలో తాండూరు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలపడం జరిగిందన్నారు. కూతురు మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని తల్లి అనిత ఇచ్చిన ఫిర్యాదు తీసుకోని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## సాఫ్ట్‌వేర్ జాబ్ ఇప్పిస్తానని 2 లక్షలతో కుచ్చుటోపీ

**హైదరాబాద్, మార్చి 9 (జనంసాక్షి) :** సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేయాలన్న ఆ యువకుడి ఆశలతో ఆడుకున్నాడో కేటుగాడు. కన్సల్టెన్సీ పేరుతో మంచి కంపెనీలో భారీ జీతంతో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. యువకుడి నుంచి రూ.2.25 లక్షలు తీసుకుని అడ్రస్ లేకుండా పోయాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు హైదరాబాద్‌లోని మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరు జిల్లాకు చెందిన ఎ. సాయికుమార్ (26) బీటెక్ పూర్తిచేశాడు. హైదరాబాద్‌లోని వెంగళరావునగర్ కాలనీలోని హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో అతనితో డిప్లొమో చేసిన గుంటూరుకు చెందిన జానీ తనకు ఒక కన్సలెంట్ తెలుసని చెప్పాడు. సాఫ్ట్‌వేర్ జాబ్ ఇప్పిస్తానంటే చందు అమర్‌నాథ్ అనే కన్సల్టెంట్‌కు రూ.2.25 లక్షలు ఇచ్చానని.. నువ్వు కూడా డబ్బులు కడితే జాబ్ వస్తుందని నమ్మించాడు. అమర్‌నాథ్‌ను పరిచయం చేశాడు. అమర్‌నాథ్‌తో అన్ని వివరాలు మాట్లాడిన సాయికుమార్.. సాఫ్ట్‌వేర్ జాబ్ కోసం పలు దఫాలుగా రూ.2.25లక్షలు చెల్లించాడు. డబ్బులు కట్టిన మూడు నెలలకు డికావర్స్ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్‌లో ఉద్యోగం ఉందని.. జూమ్ కాల్‌లో ఇంటర్వ్యూ కూడా చేయించాడు. కానీ ఇంటర్వ్యూలో ఎలాంటి టెక్నికల్ ప్రశ్నలు అడగకపోవడంతో అనుమానం వచ్చి అమర్‌నాథ్‌కు సాయికుమార్ చెప్పాడు. అలానా.. అంటూ సాయి మాటలను అమర్‌నాథ్ దాటవేశాడు. ఆ తర్వాత కొద్దిరోజులకు డికావర్స్ టెక్నాలజీ పేరిట ఓ ఆఫర్ లెటర్‌నుకూడా సాయికి పంపించాడు. ఆ కంపెనీ ఎక్కడ ఉంది? ఎలా ఉంటుందని ఆన్‌లైన్‌లో సాయి సెర్చ్ చేయగా ఎక్కడా కంపెనీ డీటెయిల్స్ రాలేదు. అలాంటి కంపెనీ లేదని తెలియడంతో తనకు వచ్చిన ఆఫర్ లెటర్ ఫేక్ అని నిర్ధారించుకున్నాడు. ఇదే విషయంలో అమర్‌నాథ్‌ను సాయి నిలదీశాడు. అప్పట్నుంచి అమర్‌నాథ్ ఫోన్ లిఫ్ట్ చేయడం మానేశాడు. దీంతో మోసపోయానని గ్రహించిన సాయికుమార్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు.

## బదిలీపై వెళ్తున్న ఎస్పీకి ఘనంగా వీడ్కోలు



**అదిలాబాద్ ప్రతినిధి, మార్చి 9 (జనంసాక్షి) :** అదిలాబాద్ జిల్లా ఎస్పీగా నాపై ఆదరణ చూపిన జిల్లా ప్రజలు ఎప్పుడు నా గుండెలో చిరస్థాయిగా నిలిచి పోతారని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. బదిలీపై వెళ్తున్న జిల్లా ఎస్పీ గౌస్ ఆలం కు ఆదివారం జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్ మైదానంలో పోలీసులు ఆయనను గజమాలతో సత్కరించారు. మొదటగా ఎస్పీ పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం కొద్దిసేపు భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో చేసిన సేవలు మరువలేనివని సిబ్బందిని విడి పోవడం బాధాకరమని తెలియజేశారు. 14 నెలలపాటు చేసిన సేవలు జిల్లా పోలీసుల తో తన అనుబంధాన్ని పంచుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా పోలీసు సిబ్బందికి, డిపిఓ సిబ్బందికి పోలీసు అధికారులకు తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్, సిహెచ్ నాగేందర్, హసీబుల్ల, సిఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వ్యర్థాలు తరలించండి మహాప్రభో..



**చంపాపేట్, మార్చి 9 (జనం సాక్షి) :** డ్రైనేజీ మరమ్మ తులు నిర్వహించి వ్యర్థాలను తొలగించకపో వడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యాకుత్ పురా నియోజకవర్గం కుర్మ గుడ డివిజన్ మాదన్నపేట్ చంద్రయన హాట్స్ సైదాబాద్ ధోభీ ఘాట్ కల్లు దుకాణం లైన్ వద్ద రోడ్డులో కొద్ది రోజుల క్రితం జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు డ్రైనేజీ పూడికతీత పనులు చేపట్టారు. మురుగు నీరు సాఫీగా వెళ్లేందుకు కృషి చేశారు. అయితే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సిబ్బంది డ్రైనేజీల నుంచి తీసిన వ్యర్థాలు రోజుల తరబడి తొల గించకపోవడంతో స్థానికులు దుర్వాసనతో సతమతమవుతున్నారు. రోడ్లపై చెత్త, వ్యర్థాలు వేసిన వారికి చలానా విధిస్తామం టున్న జీహెచ్ఎంసీ అధికారులు వారి తప్పి దాలను ఎలా సమర్థించుకుంటారని పలు వురు ప్రశ్నిస్తున్నారు. వెంటనే వ్యర్థాలను తొలగించాలని స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

# జిల్లా అధికారి మాటను లెక్కచేయని వార్డెన్

- బర్డ్ ఫ్లూ కారణంగా చికెన్ బంద్
- హాస్టల్ ప్రాంగణంలో వీర స్వైరం చేస్తున్న పందులు, కోతులు



**కౌడిపల్లి, మార్చి 9 (జనం సాక్షి) :** కౌడిపల్లి మండల కేంద్రంలో ఆదివారం సమీకృత సంక్షేమ ఎస్సీ బాలికల వసతి గృహంలో మొత్తం విద్యార్థుల సంఖ్య 220, ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్య 186, విద్యార్థులకు తప్పని కష్టాలు. కడుపు మార్చుకొని విద్యార్థినులు బయట హోటల్స్ లో ఆహారాన్ని హాస్టల్స్‌కి తీసుకెళ్తున్నారు. విషయం ఏమిటని విలేకరులు హాస్టల్‌కి వెళ్లి పరిశీలించగా... జిల్లా అధికారులు ఇచ్చిన మెనూ ప్రకారం ఆహారం విద్యార్థులకు అందించని వార్డెన్ నర్సమ్మ, విద్యార్థులు పలుమార్లు చెప్పిన వార్డెన్ నర్సమ్మ పట్టించుకోకపోవడం వెనుక కారనం ఏమిటి...? ప్రభుత్వం తరఫున విద్యార్థునులకు రావలసిన గుడ్లు అరటి పండ్లు సరిగా అందించడం లేదంటూ... విద్యార్థులు వాపోతున్నారు. నాలుగు వారాలుగా బర్డ్ ఫ్లూ వ్యాధి కారణంగా చికెన్ అందించడం లేదు, కనీసం రెండు వారాలకు ఒకసారి అయినా మటన్ అందిస్తే బాగుంటుందేమోనని విద్యార్థులు వాపోతున్నారు. అదే పక్కన ఉన్న గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహం, బీసీ బాలుర సంక్షేమ వసతి గృహం వార్డెన్స్ మెనూ ప్రకారం విద్యార్థులకు రావలసిన ఆహారాన్ని అందిస్తున్నట్టు బీసీ, ఎస్టీ, వసతి గృహాల విద్యార్థులు చెబుతున్నారు. చదువుకునే విద్యార్థులకు వసతి గృహాల్లో ఆహార విషయంలో మెనూ తప్పక పాటించాలని ప్రభుత్వం చెబుతున్న... అవేవీ నా చెవిన పట్టవు అంటూ... వ్యవహరిస్తున్న వార్డెన్ నర్సమ్మ పనితీరు... ఆదివారం రోజు చికెన్ పెట్టకపోగా దానికి బదులు మటన్ అయినా అందిస్తారు ఏమో అని ఎదురుచూస్తున్న విద్యార్థులు, చికెన్ మటన్ ముక్కలకు బదులు ఆలుముక్కలతో కడుపు నింపుకోవాలని విద్యార్థులను హెచ్చరిస్తున్న వార్డెన్ నర్సమ్మ. ఆదివారం ఉదయం ఇడ్లీ పెట్టాల్సింది ప్రభుత్వం ఇచ్చిన మెనులో ఉండగా దానికి బదులు తెల్లన్నం నీళ్ల చారు తో పెట్టారంటూ బాధపడుతూ... విద్యార్థునులు చింతించారు. ఉదయం టిఫిన్ బంద్, ప్రతి వారం చికెన్ కు బదులు మటన్ బంద్, నిత్యం అందించే ఆహారంలో నాణ్యత కరువు, మూడు, నాలుగు, నంబర్ రూములకు డోర్లు విరిగిపోయాయి, కిటికీలకు జాలి లేక ఇటు దోమలతో అటు కోతులతో ఇబ్బందికరంగా ఉంది. గత కొన్ని నెలలుగా తాగడానికి మినరల్ వాటర్ కు బదులు బోర్ నీళ్లు, వృధాగా ఓ మూలన పడ్డ మినరల్ వాటర్ ప్లాంట్, గతంలో సైతం ఈ సమస్యలన్నింటిపై (జనంసాక్షి) లో ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం విధితమే. గతంలో వార్డెన్ నర్సమ్మపై చాలా ఆరోపణలు ఉన్నప్పటికీ అప్పటి జిల్లా అధికారి మా బాధను పట్టించుకోకపోగా ప్రస్తుతం ఉన్న జిల్లా అధికారి మాకు ఉన్న సమస్యలు తెలుసుకొని వార్డెన్ నర్సమ్మను ట్రాన్స్ఫర్ చేయాలంటూ విద్యార్థులు కోరారు. మా సమస్యలు పట్టించుకోకపోతే మా తల్లిదండ్రులతో కలిసి జిల్లా కలెక్టర్ ను సంప్రదిస్తామంటూ విద్యార్థులు వాపోయారు.

# మహా మేడారం జాతరకు అప్రమత్తంగా ఉండాలి

- కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వస్తే చర్యలు తప్పవు
- మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**ములుగు బ్యూరో, మార్చి 9 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులలో అన్ని శాఖల అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని,చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత సమయం లోపు పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణ అభివృద్ధి,గ్రామీణ నీటి సరఫరా,మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు.ఆదివారం కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్,డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ లతో కలసి ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని, క్రింది స్థాయి నుండి ఉన్నత అధికారుల వరకు ప్రతి పనిని పరిశీలించాలని సూచించారు. గ్రామాల్లో చేపడుతున్న పనితో పాటు జిల్లా స్థాయిలో చేపడుతున్న పనులను సంబంధిత అధికారులు నిత్యం పరిశీలించి నాణ్యతతో కూడిన పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జాతీయ రహదారి 100 కిలోమీటర్లు ఉండటం పాటు, గోదావరి పరిహక ప్రాంతం 100 కిలోమీటర్లు ఉందని, పలు ప్రాంతాల నుండి వచ్చే పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్,ట్రైబల్ వెల్ఫేర్ శాఖల నుండి చేపట్టిన పనులను నాణ్యత లోపించకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ప్రస్తుత వేసవికాలంలో గ్రామాలలో మంచినీటి ఎద్దడి ఏర్పడకుండా సంబంధిత అధికారులు ముందస్తు ప్రాణాలిక సిద్ధం చేసుకోవాలని అన్నారు. వేసవికాలంలో తాగునీటి ఇబ్బందులు ఏర్పడకుండా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని దానికి అనుగుణంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని,సాగు నీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఐటీడీఏ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.రానున్న మహా మేడారం జాతరను పురస్కరించుకొని చేపట్టనున్న పనులపై అధికారులు అంచనాలు తయారు చేయాలని, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.పలు రకాల పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయని పక్షంలో చర్యలు తప్పవని,ఈ విషయంలో సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని మంత్రి తెలిపారు.వేసవి కాలం మూసే వరకు జిల్లాలోని పలు గ్రామాలకు పలు శాఖల ద్వారా చేపట్టిన పనులను రెండు నెలల కాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాలలో మంచి నీటిని సరఫరా చేసే ట్యాంకులను శుభ్రం చేయాలని, గ్రామాలలోని చెరువు కుంటలలో నీరు లేని సమయంలో వాటికి అవసరమైన మరమ్మతులను చేపట్టాలని, ప్రతి చెరువు కుంటను సాగునీరు,త్రాగునీరుకు అనుకూలంగా ఉండే విధంగా పనులు చేయాలని మంత్రి అన్నారు.ఈ సమావేశంలో ఆర్డిఓ వెంకటేష్,ఆర్ అండ్ బి, పిఆర్, ట్రైబల్ వెల్ఫేర్,నేషనల్ హైవే,ఆర్డబ్లుఎస్, ఇర్రిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దలాల్ స్ట్రీట్‌లో ఐపిఓ బజ్ తగ్గింది

**ముంబై:** దలాల్ స్ట్రీట్‌లో ప్రారంభ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపిఓ) చుట్టూ ఉన్న ఉత్సాహం గణనీయంగా తగ్గింది. గతంలో, ప్రతి వారం సగటున ఐదు లేదా ఆరు కంపెనీలు తమ ప్రజా సంచికలతో సంచలనం సృష్టించేవి. అయితే, ఆ ఉత్సాహం ఇటీవల తగ్గిపోయింది, ముఖ్యంగా ఫిబ్రవరి 14న జరిగిన చివరి ఐపిఓ తర్వాత. ముఖ్యంగా, గత మూడు వారాల్లో ప్రధాన బోర్డు నుండి ఏ కంపెనీలు ఐపిఓలను ప్రారంభించలేదు. ఈ క్షీణతకు స్టాక్ మార్కెట్లో వరుస నష్టాలు మరియు వాణిజ్య యుద్ధం గురించి పెరుగుతున్న భయాలు కారణమని చెప్పవచ్చు.

గత సంవత్సరం డిసెంబర్‌లో 16 కంపెనీలు ఐపిఓ మార్కెట్‌లోకి ప్రవేశించాయి, కానీ జనవరిలో ఈ సంఖ్య కేవలం ఐదుకి పడిపోయింది మరియు ఫిబ్రవరిలో నాలుగుకి తగ్గింది. గత సంవత్సరం, మొత్తం 91 కంపెనీలు సుమారు రూ. 1.6 లక్షల కోట్లు, బలమైన రిటైల్ భాగస్వామ్యం మరియు స్థిరమైన ఆర్థిక వ్యవస్థ ద్వారా ఇది ఉత్తేజితమైంది. అయితే, మార్కెట్లలో ఇటీవలి అస్థిరత కొత్త జాబితాలపై ఆసక్తి తగ్గడానికి దారితీసింది, పెట్టుబడిదారులు తమ ప్రస్తుత పోర్ట్‌ఫోలియోలను మెరుగుపరచుకోవడంపై ఎక్కువ దృష్టి సారించారు.

ప్రస్తుతం, 45 కంపెనీలు సెబీ నుండి ఆమోదం పొందాయి మరియు రూ.కు పైగా సేకరించాలని చూస్తున్నాయి. 67,000 కోట్లు అయితే, ఎవరూ ఇంకా వారి ఐపిఓప్రణాళికలను ప్రకటించలేదు. అదనంగా, మరో 69 కంపెనీలు సెబీ ఆమోదం కోసం వేచి ఉన్నాయి, ఇవి రూ. కంటే ఎక్కువ సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. 1.15 లక్షల కోట్లు. వారి మార్కెట్ ప్రవేశానికి




కాలక్రమం అనిశ్చితంగా ఉంది.

ఐపిఓ కార్యకలాపాల క్షీణత వాణిజ్య యుద్ధం భయాలతో ముడిపడి ఉండవచ్చు, ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న సుంకాల నిర్ణయాలు పెట్టుబడిదారులను కలవరపెట్టాయి. ఇంకా, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు దేశీయ మార్కెట్ నుండి తమ పెట్టుబడులను క్రమంగా ఉపసంహరించుకుంటున్నారు, ఇది భారత మార్కెట్లపై ఒత్తిడిని పెంచుతుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కూడా ఐపిఓలపై ఆసక్తిని కోల్పోతున్నారని, దీని వలన మార్కెట్ పరిస్థితులు మెరుగుపడే వరకు చాలా కంపెనీలు తమ ఐపిఓ ప్రణాళికలను వాయిదా వేసుకోవాలని భావిస్తున్నాయని నిపుణులు గమనిస్తున్నారు.

## పెండింగ్‌లో టాటా మోటార్స్ ఫైనాన్స్‌తో టాటా క్యాపిటల్ ఐపిఓ విలీనం

**న్యూఢిల్లీ, (జనంసాక్షి) :** టాటా గ్రూప్ అనుబంధ సంస్థ అయిన టాటా క్యాపిటల్, దాని పబ్లిక్ ఇష్యూ ప్లాన్‌కు బోర్డు ఆమోదం పొందింది మరియు త్వరలో ఐపిఓతో ముందుకు సాగాలని యోచిస్తోంది. అయితే, టాటా మోటార్స్ ఫైనాన్స్‌తో విలీనానికి తుది ఆమోదం ఇంకా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఐపిఓ) నుండి పెండింగ్‌లో ఉంది. ఈ ఆమోదం పొందిన తర్వాతే టాటా క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థకు ముసాయిదా పత్రాలను దాఖలు చేస్తుందని తెలుస్తోంది.




ఆ కంపెనీ 2 బిలియన్ల డాలర్లు వరకు (సుమారు రూ.) సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. 17,000 కోట్లు) పెట్టుబడి పెట్టనుంది, ఇందులో 23 కోట్ల తాజా షేర్ల జారీతో పాటు అమ్మకానికి ఆఫర్ కూడా ఉంటుంది. ఐపిఓకి ముందు, టాటా క్యాపిటల్ హక్కుల జారీ ద్వారా నిధులను సేకరించడం ద్వారా తన ఆర్థిక స్థితిని బలోపేతం చేసుకోవాలని యోచిస్తోంది.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గుర్తింపు పొందిన నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (ఎన్‌బిఎఫ్‌సి) సంస్థగా, టాటా క్యాపిటల్ మూడు సంవత్సరాలలోపు తన వాటాలను జాబితా చేయాలి, అంటే అది సెప్టెంబర్ 2025 నాటికి అలా చేయాలి. 2023లో టాటా టెక్నాలజీస్ ఐపిఓ తర్వాత, ఇది టాటా గ్రూప్ నుండి మరొక ముఖ్యమైన పబ్లిక్ ఆఫరింగ్‌ను సూచిస్తుంది.

# మీ శరీరం మాట వినండి

### పనివేళలపై సౌమ్య స్వామినాథన్

భారతదేశంలో పని గంటలు అనే అంశం గణనీయమైన చర్చకు దారితీసింది, వివిధ ప్రముఖులు దీనిపై చర్చించారు. ఇటీవల, డబ్ల్యూహెచ్ఓ మాజీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ సౌమ్య స్వామినాథన్ తన అభిప్రాయాలను పంచుకున్నారు, ఎక్కువ పని గంటలు సామర్థ్యాన్ని తగ్గిస్తాయని నొక్కి చెప్పారు. పిటిఐ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో, వ్యక్తులు అలసటగా అనిపించినప్పుడు వారి శరీరాలను వినాలని ఆమె సలహా ఇచ్చింది.

స్వామినాథన్ ఇలా వ్యాఖ్యానించాడు, "చాలా మంది సమయాన్ని గమనించకుండా కష్టపడి పనిచేస్తారు. అయితే, మీరు అలసిపోయినట్లయితే, మీ శరీరం మీకు ఆ సంకేతాన్ని ఇస్తుంది. కొవిడ్-19 మహమ్మారి వంటి స్వల్ప కాలాలకు పొడిగించిన గంటలను ఉంచడం సాధ్యమే అయినప్పటికీ, దీర్ఘకాలంలో అది స్థిరంగా ఉండదు." మహమ్మారి సమయంలో దీర్ఘకాలిక ఒత్తిడి మరియు నిద్ర లేకపోవడం వల్ల వ్యక్తులపై పడే నష్టం గురించి ఆమె ఆందోళన వ్యక్తం చేశారు, చాలా మంది నిపుణులు చివరికి అలసిపోయి తమ ఉద్యోగాలను విడిచిపెట్టారని ఆమె హైలైట్ చేశారు.



ఉత్పాదకతకు మానసిక విశ్రాంతి యొక్క ప్రాముఖ్యతను ఆమె నొక్కి చెబుతూ, "మెరుగైన ఆలోచనలను రూపొందించడానికి విరామం తీసుకోవడం చాలా ముఖ్యం" అని అన్నారు. ఆమె ప్రకారం, మానవ శరీరానికి తగినంత నిద్ర అవసరం కాబట్టి, పని చేసిన గంటల కంటే పని నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలి.

ముఖ్యంగా ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి వంటి పరిశ్రమల ప్రముఖుల వ్యాఖ్యల తర్వాత ఈ వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి, భారతీయ యువత పోటీతత్వాన్ని కొనసాగించడానికి వారానికి 70 గంటలు పని చేయాలని ఆయన సూచించారు మరియు ఎల్&టి చైర్మన్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్ వారానికి 90 గంటల పని విధానాన్ని ప్రతిపాదించారు.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
| --- | --- | --- |
| హైదరాబాద్ | ₹ 410 | ₹ 49.2 |
| వరంగల్ | ₹ 412 | ₹49.4 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**

హైదరాబాద్

₹ 86,100 (24 క్యారెట్లు)

₹ 78,925 (22 క్యారెట్లు)

చెన్నై

₹79,035 (22 క్యారెట్లు)

₹86,220 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**

హైదరాబాద్

₹97,360

### ఎమ్మెల్యే రాజా భయ్యాపై గృహహింస కేసు



న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని కుందా నియోజకవర్గం ఎమ్మెల్యే రఘురాజ్ ప్రతాప్ సింగ్ అలియాస్ రాజా భయ్యా పై గృహహింస కింద కేసు నమోదైంది. ఆయన భార్య భన్వి సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఎంక్లేవ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

# తక్కువ పెట్టుబడి, అధిక రాబడి



### మహిళల కోసం గృహ ఆధారిత వ్యాపార ఆలోచనలు

ఇంటి నుండి పని చేసి ఆదాయం సంపాదించాలనే ఆసక్తి మహిళల్లో పెరుగుతు న్నందున, తక్కువ పెట్టుబడి అవసరమయ్యే మరియు సులభంగా ప్రారంభించగల రెండు ఆశాజనక వ్యాపార ఆలోచనలు ఇక్కడ ఉన్నాయి.:

**1. బ్యూటీ పార్లర్ సేవలు**

చాలా మంది మహిళలకు వ్యక్తిగత వస్త్రధారణ ప్రాధాన్యతగా ఉండటంతో అందం సేవలకు నిరంతరం అధిక డిమాండ్ ఉంది. ఎలా ప్రారంభించాలో ఇక్కడ ఉంది:

- **అందించే సేవలు:** మీరు మేకప్, ఫేషియల్స్, హెయిర్ కట్స్, మెహందీ డిజైన్స్, పెడిక్యూర్స్, మానిక్యూర్స్ వంటి అనేక రకాల సేవలను అందించవచ్చు.
- **నైపుణ్య అభివృద్ధి:** మీ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఒక చిన్న బ్యూటీ థెరపీ కోర్సు లో చేరడాన్ని పరిగణించండి. ఇది నాణ్యమైన సేవలను అందించడంలో మీకు సహాయపడుతుంది.
- **ప్రారంభ క్లయింట్లు:** మీ సేవలను కుటుంబ సభ్యులు, స్నేహితులు మరియు పొరుగువారికి అందించడం ద్వారా ప్రారంభించండి, తద్వారా వారి అభిప్రాయాన్ని సేకరించి మీ నైపుణ్యాలను మెరుగుపరచుకోండి.
- **ప్రమోషన్:** మీ సేవలను ప్రోత్సహించడానికి మరియు విస్తృత ప్రేక్షకులను చేరుకోవడానికి వాట్సాప్, ఇన్‌స్టగ్రాం, ఫేస్ బుక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ లను ఉపయోగించండి.
- **పెట్టుబడి:** ప్రారంభ ఖర్చులు రూ. నుండి రూ. వరకు ఉండవచ్చు. 10,000 నుండి రూ. 20,000, ప్రాథమిక పరికరాలు మరియు సామాగ్రిని కవర్ చేస్తుంది.
- **ఆదాయ సంభావ్యత:** ప్రభావవంతమైన ప్రమోషన్ మరియు కస్టమర్ నమ్మకంతో, మీరు రూ. మధ్య సంపాదించవచ్చు. 30,000 మరియు రూ. నెలకు 1 లక్ష.

**2. చేతితో తయారు చేసిన ఆభరణాల వ్యాపారం**

చేతితో తయారు చేసిన ఆభరణాల మార్కెట్, ముఖ్యంగా ప్రత్యేకమైన డిజైన్లను ఇష్టపడే యువత మరియు మహిళలలో వేగంగా అభివృద్ధి చెందుతోంది. మీరు ఎలా ప్రారంభించవచ్చో ఇక్కడ ఉంది:

- **ఉత్పత్తి శ్రేణి:** విలక్షణమైన డిజైన్లతో చెవిపోగులు, గాజులు, నెక్లెస్‌లు, ఇతర ఆభరణాలను సృష్టించడంపై దృష్టి పెట్టండి.
- **అభ్యాస వనరులు:** విస్తృతమైన నైపుణ్యాలు అవసరం లేకుండానే మీరు యూట్యూబ్, ఇన్‌స్టగ్రాం ట్యుటోరియల్స్ ద్వారా నగల తయారీ పద్ధతులను సులభంగా నేర్చుకోవచ్చు.
- **చిన్నగా ప్రారంభించడం:** తక్కువ బడ్జెట్‌తో సామాగ్రిని కొనుగోలు చేయడం ద్వారా ప్రారంభించండి (రూ. 5,000 నుండి రూ. 10,000) ప్రారంభ ఉత్పత్తులను సృష్టించడానికి.
- **అమ్మకాల మార్గాలు:** మీ సృష్టిని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ప్రచారం చేయండి మరియు వాటిని అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఇ-కామర్స్ వెబ్‌సైట్‌లలో జాబితా చేయడాన్ని పరిగణించండి.
- **కస్టమర్ ఎంగేజ్‌మెంట్:** కస్టమర్లతో నేరుగా కనెక్ట్ అవ్వడానికి వాట్సాప్ బిజినెస్ వంటి ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించుకోండి.



- **ఆదాయ సంభావ్యత:** మీరు దృఢమైన కస్టమర్ బేస్‌ను అభివృద్ధి చేసుకున్న తర్వాత, మీరు రూ. సంపాదించవచ్చు. నెలకు 50,000 లేదా అంతకంటే ఎక్కువ.

**ముగింపు**

ఈ రెండు వ్యాపార ఆలోచనలకు ప్రారంభ పెట్టుబడి తక్కువగా ఉండటమే కాకుండా, ఇంటి నుండి పని చేసే సౌలభ్యాన్ని కూడా అందిస్తాయి. అంకితభావం, నైపుణ్యాభివృద్ధి మరియు ప్రభావవంతమైన మార్కెటింగ్ వ్యూహాలతో, మహిళలు ఈ వెంచర్లను విజయవంతంగా స్థాపించగలరు మరియు వారి వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలను సమతుల్యం చేసుకుంటూ గణనీయమైన ఆదాయాలను సాధించగలరు.

# కీవ్ దళాలు కూలిపోతాయి

### స్టార్‌లింక్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తే : మస్క్ హెచ్చరిక

**కెనాడా (జనంసాక్షి) :** రష్యాతో కొనసాగుతున్న సంఘర్షణను అనవసరంగా పొడిగిస్తున్నా రని ఎలోన్ మస్క్ ఇటీవల ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీని విమర్శించారు. స్టార్‌లింక్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తే, కీవ్‌లోని దళాలు యుద్ధభూమిలో కూలిపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. పుతిన్ ఇంకా సవాలు లేకుండా ఉండగా, ఉక్రెయిన్‌పై మాత్రమే దృష్టి ఎందుకు ఉందని ప్రశ్నించిన ట్వీట్‌కు ప్రతిస్పందనగా మస్క్ వ్యాఖ్యలు వచ్చాయి.



"ఉక్రెయిన్ విషయంలో నేరుగా చర్చించమని నేను గతంలో పుతిన్‌ను సవాలు చేశాను. మా స్టార్‌లింక్ వ్యవస్థ కీవ్ సైన్యానికి వెన్నెముకగా పనిచేస్తుంది. ఈ ఇంటర్నెట్ సేవలు నిలిపివేయబడితే, కీవ్ సైన్యం తడబడుతుంది. చివరికి, ఉక్రెయిన్‌కు ఓటమి అనివార్యంగా కనిపిస్తోంది. ఇంతలో, కొనసాగుతున్న హింస ఏకరీతిగా మారింది. హేతుబద్ధంగా ఆలోచించి పరిస్థితిని అర్థం చేసుకునే వారు ఈ యుద్ధం ముగియాలని కోరుకుంటారు" అని మస్క్ అన్నారు.

అదనంగా, వైట్ హౌస్ దగ్గర ఒక పెద్ద ఉక్రేనియన్ జెండాకు నిధులు సమకూర్చడం గురించి 'ఎక్స్' ప్లాట్‌ఫామ్‌లో అడిగినప్పుడు, అటువంటి కార్యకలాపాలను నిరోధించడానికి ఆంక్షలు అత్యంత సంపన్న ఉక్రేనియన్లను, ముఖ్యంగా మొనాకోలో విలాసవంతమైన ఆస్తులను కలిగి ఉన్నవారిని లక్ష్యంగా చేసుకోవాలని మస్క్ సూచించారు. ప్రస్తుతం, స్టార్‌లింక్ ఉక్రెయిన్‌కు చాలా కీలకం, ముఖ్యంగా రష్యన్ దాడులు దాని కమ్యూనికేషన్ వ్యవస్థలకు అంతరాయం కలిగించిన తర్వాత.

# ట్రంప్ నుంచి ఒత్తిడి లేదు

- **వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి సుంకాల తగ్గింపు : భారత్**

**న్యూఢిల్లీ, (జనంసాక్షి) :** తన బహిరంగ ప్రకటనలపై భారతదేశం ఆందోళన వ్యక్తం చేసిందని, సుంకాలను తగ్గించడానికి అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. అయితే, భారత అధికారులు ఈ వాదనలను తోసిపుచ్చారు, అభివృద్ధి చెందిన దేశాలతో వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి సుంకాల తగ్గింపులు విస్తృత ప్రయత్నాలలో భాగమని పేర్కొన్నా రు. గతంలో, ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలలో భాగంగా ఆస్ట్రేలియా, యుఎఇ, స్విట్జర్లాండ్, నార్వే వంటి దేశాలకు భారతదేశం సుంకాలను తగ్గించింది. ప్రస్తుతం, యూరోపియన్ యూనియన్ మరియు యూకెలతో చర్చలు జరుగుతున్నాయి, దీనితో అమెరికాతో సంబంధాలను పెంచుకోవడా నికి న్యూఢిల్లీ సుంకాలను తగ్గించింది. ఈ నిర్ణయం భారతదేశంపై అమెరికా విధించబోయే సుంకాలకు ప్రతిస్పందన కాదని భారత అధికారులు తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులు మినహా దాదాపు అన్ని వస్తువులపై సుంకాలను తొలగించాలని అమెరికా భారతదేశాన్ని అభ్యర్థించిందని నివేదికలు సూచిస్తు న్నాయి. భారతదేశానికి అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా, ద్వైపాక్షిక వాణిజ్యం గత ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో డాలర్లు118.2 బిలియన్లకు చేరుకుంది, 2030 నాటికి దీనిని డాలర్లు500 బిలియన్లకు పెంచాలనే లక్ష్యంతో ఉంది. ప్రధానమంత్రి మోదీ



ఇటీవల అమెరికా పర్యటన సందర్భంగా, సుంకాల అడ్డంకులను తగ్గించడం మరియు మార్కెట్ ప్రాప్యతను విస్తరించడం లక్ష్యంగా పెట్టుకున్న పరస్పర ప్రయోజనకరమైన బహుళ రంగాల ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఏ)పై చర్చలు ప్రారంభించబడ్డాయి. భారతదేశం మరియు చైనాతో సహా అనేక దేశాలపై భారీ సుంకాలు విధిస్తామని ట్రంప్ నిరంతరం బెదిరిస్తూనే ఉన్నారు, భారతదేశాన్ని "సుంకాల రాజు"గా ముద్ర వేస్తున్నారు. సుంకాలు మరియు నాన్-టారిఫ్ అడ్డంకులను అధిగమించడం లక్ష్యంగా బిటిఏ ద్వారా అమెరికాతో సంబంధాలను పెంపొందించుకోవడానికి భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తన నిబద్ధతను నొక్కి చెప్పింది.



# కరోలినాలో చెలరేగిన కార్చిచ్చు

### అగ్నిప్రమాదానికి మూలకారణమైన మహిళ అరెస్టు

**బియాలౌసో :** గత వారం ఉత్తర, దక్షిణ కరోలినాలో చెలరేగిన కార్చిచ్చు ఇంకా వ్యాప్తి చెందుతూనే ఉంది, 4,000 ఎకరాల అడవిని దగ్ధం చేసింది. దక్షిణ కరోలినాలోని మిర్టిల్ బీచ్‌కు చెందిన 40 ఏళ్ల అలెగ్జాండ్రా బియలౌసోను అధికారులు అరెస్టు చేశారు, ఆమె ఈ అగ్నిప్రమాదానికి మూలకారణమని గుర్తించారు. ఆమె విస్తారమైన అటవీ ప్రాంతాలను, నివాస ఆస్తులను ప్రమాదంలో పడేసినందుకు అభియోగాలు ఎదుర్కొంటు న్నారు మరియు ఏప్రిల్ 15న హెర్రీ కౌంటీ కోర్టులో హాజరు కావాల్సి ఉంది. నేరం రుజువైతే, ఆమెకు ప్రతి అభియోగానికి 30 రోజుల వరకు జైలు శిక్ష లేదా జరిమానా విధించే అవకాశం ఉంది.

సౌత్ కరోలినా ఫారెస్ట్రీ కమిషన్ అధికారుల ప్రకారం, బియాలౌసో కోవింగ్టన్ లేక్స్ సబ్ డివిజన్‌లోని ఒక చెట్టులో మంటలను ఆర్పింది, తగినంత నీరు లేకపోవడం వల్ల దానిని ఆర్పడానికి ఆమె ప్రయత్నించినప్పటికీ అది త్వరగా వ్యాపించింది. ఈ మంటలు ఇప్పటికే పక్కనే ఉన్న వాకర్ వుడ్స్ ప్రాంతంలోని చెట్లను ప్రభావితం చేశాయి మరియు సమీపంలోని ఇళ్లను ప్రమాదంలో పడేశాయి. శనివారం మధ్యాహ్నం నాటికి, మంటలు 55% అదుపులోకి వచ్చినట్లు సమాచారం. పొడి పరిస్థితులు పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తున్నందున, తరలింపులకు ఆదేశించబడ్డాయి మరియు అత్యవసర పరిస్థితి అమలులో ఉంది, అలాగే అనవసరమైన వస్తువులను కాల్చడంపై కొనసాగుతున్న ఆంక్షలు కూడా ఉన్నాయి.

# వన్యప్రాణుల సంరక్షణకు.. భారత్ నిబద్ధతతో ఉంది

### ప్రధాన మంత్రి మోడీ



**న్యూఢిల్లీ, (జనంసాక్షి) :** ముఖ్యంగా మధ్యప్రదేశ్‌లోని మాధవ్ జాతీయ ఉద్యాన వనాన్ని టైగర్ రిజర్వ్‌గా గుర్తించిన తర్వాత, వన్యప్రా ణుల సంరక్షణ పట్ల భారతదేశం యొక్క నిబద్ధతను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నొక్కిచెప్పారు. జంతు ప్రేమికులకు ఈ వార్త సానుకూలమని, భారతదేశ గొప్ప జీవవైవిధ్యం మరియు వన్యప్రాణుల పట్ల సాంస్కృతిక గౌరవాన్ని ఇది హైలైట్ చేస్తుందని ఆయన వ్యక్తం చేశారు.

తన వ్యాఖ్యల సందర్భంగా మోడీ, "భారతదేశం ఎల్లప్పుడూ ప్రకృతిని, జంతువులను రక్షించడంలో ముందంజలో ఉంది, మన గ్రహాన్ని సురక్షితమైన ప్రదేశంగా మార్చడానికి ప్రయత్నిస్తుంది" అని అన్నారు. మాధవ్ టైగర్ రిజర్వ్ గురించి కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ చేసిన ట్వీట్‌ను కూడా ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. పర్యావరణ వైవిధ్య పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇచ్చినందుకు ప్రధానమంత్రి మోదీని కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ ప్రశంసించారు. మోదీ నాయకత్వంలో పర్యావరణ పరిరక్షణ మరియు వన్యప్రాణుల సంరక్షణలో గణనీయమైన పురోగతి సాధించిందని ఆయన గుర్తించారు మరియు మాధవ్ నేషనల్ పార్క్‌ను టైగర్ రిజర్వ్‌గా నియమించడాన్ని జరుపుకున్నారు.

ఈ అదనంగా, భారతదేశం ఇప్పుడు 58 టైగర్ రిజర్వ్ జోన్‌లను కలిగి ఉంది, మాధవ్ మధ్యప్రదేశ్‌లో తొమ్మిదవది. వన్యప్రాణుల ఔత్సాహికులు మరియు పరిరక్షకులను యాదవ్ అభినందించారు, ఈ విజయం అటవీ అధికారుల అంకితభావ ప్రయత్నాలను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. ఆయన తన ట్వీట్‌లో ప్రధానమంత్రిని ట్యాగ్ చేశారు, దానికి మోడీ రీట్వీట్ చేసి, కృతజ్ఞతలు తెలిపారు.

### కదులుతున్న రైలు కింద పడబోతున్న మహిళను

## రైల్వే పోలీసుల భద్రతా సిబ్బంది

**ముంబై:** ముంబైలోని బోరివలి స్టేషన్‌లో, కదులుతున్న రైలు నుండి దిగడానికి ప్రయత్నించిన ఒక మహిళ దాని కింద పడింది, కానీ అప్రమత్త మైన భద్రతా సిబ్బంది ఆమెను రక్షించారు. "మిషన్ జీవన్ రక్ష"లో భాగం గా రైల్వే పోలీసుల వేగవంతమైన ప్రతిస్పందనను హైలైట్ చేస్తూ, భారత రైల్వే మంత్రిత్వ శాఖ ఈ సంఘటనకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది, ఇది ఆన్‌లైన్ లో త్వరగా దృష్టిని ఆకర్షించింది. "బోరివాలి స్టేషన్‌లో కదులుతున్న రైలు నుంచి దిగడానికి ప్రయత్నిస్తూ ఒక మహిళ బ్యాలెన్స్ కోల్పోయి రైలు, ప్లాట్‌ఫారమ్ మధ్య పడిపోయింది. భద్రతా సిబ్బంది ఆమెను సురక్షితంగా తీసుకురావడానికి వేగంగా చర్య తీసుకున్నారు, సంభావ్య విషాదాన్ని నివారించారు. "ప్రయాణీకులు రైలులో ప్రయాణించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని గుర్తు చేస్తున్నారు, ఎందుకంటే మా సిబ్బంది వారి భద్రతను నిర్ధారించడానికి అవిశ్రాంతంగా పనిచేస్తు న్నారు" అని రైల్వే శాఖ పేర్కొంది. గత నెలలో అంధేరీ స్టేషన్‌లో ఇలాంటి సంఘటనే జరిగింది, అక్కడ 40 ఏళ్ల వ్యక్తి రెండు బ్యాగులతో కదులుతున్న రైలు ఎక్కడానికి ప్రయత్నిస్తూ పడిపోయాడు. రైల్వే పోలీసులు కూడా వెంటనే అతన్ని రక్షించారు.





### కాలిఫోర్నియాలో దేవాలయంపై దాడి: ఖండించిన ఇండియా

**న్యూఢిల్లీ, (జనంసాక్షి) :** కాలిఫోర్నియాలోని ఒక హిందూ దేవాలయం, బిఏపిఎస్ శ్రీ స్వామి నారాయణ మందిర్, ద్వేషపూరిత గ్రాఫిటీలతో ధ్వంసం చేయబడింది. ఆలయ అధికారులు ఈ సంఘటనను నివేదించారు, దీనితో భారత ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ, "కాలిఫోర్నియాలోని చినో హిల్స్‌లోని హిందూ ఆలయంపై దాడికి సంబంధించిన వార్తలను మేము గమనించా ము. ఇటువంటి నీచమైన చర్యలను మేము తీవ్రంగా ఖండిస్తున్నాము మరియు బాధ్యులపై స్థానిక అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాము. అదనంగా, ప్రార్థనా స్థలాలకు మెరుగైన భద్రతా చర్యలను మేము కోరుతున్నాము." ఈ సంఘటన ఇలాంటి దాడుల తర్వాత జరిగింది, గత సెప్టెంబర్‌లో కాలిఫోర్నియాలోని సాక్రమెంటో లోని బిఏపిఎస్ శ్రీ స్వామినారాయణ మందిర్‌లో ద్వేషపూరిత సందేశాలు కనుగొనబడ్డాయి. దీనికి ముందు, న్యూయార్క్‌లోని బిఏపిఎస్ ఆలయంలో ఇలాంటి విధ్వంసక చర్యలు జరిగాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
10 మార్చి 2025

# ఉన్నతాధికారే అక్రమాలకు పాల్పడుతున్నాడు

## బడంగ్‌పేట మున్సిపల్ కమిషనర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

హైదరాబాద్ (జనంసాక్షి)




బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సరస్వతి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు నాదర్‌గుల్‌కు చెందిన సాయిబాబా ఫిర్యాదు చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఎంక్వయిరీ అధికారిని నియమించారు. జరిగిన సంఘటనపై క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి.. బడంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ ప్రధాన కూడలిలో ఉన్న 1805 గజాల స్థల వివాదం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. స్థలానికి సంబంధించిన వివరాలను సేకరించినట్లు తెలిసింది. గత కొన్ని సంవత్సరాల నుంచి భూ వివాదం ఉన్నట్లు ఎంక్వయిరీ అధికారి నిర్ధారణకు వచ్చారు. ఇద్దరు వ్యక్తుల మధ్యన జరిగిన భూ వివాదం విషయంలో కమిషనర్ జోక్యం చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మొదట అక్రమ నిర్మాణాలంటూ మున్సిపల్ అధికారులు 1805 గజాల స్థలంలో నిర్మాణం చేసిన షెడ్లను తొలగించారు. కూల్చివేసిన తర్వాత అదే స్థలంలో మరోసారి నిర్మాణాలు చేపడుతున్న విషయాన్ని సాయిబాబా అనే వ్యక్తి కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కమిషనర్ నెలల తరబడి ఆ విషయాన్ని నాంచుతూ వస్తున్నారని సాయిబాబా ఆరోపించారు. అక్రమ నిర్మాణదారులకు మద్దతు పలుకుతూ వారి నుంచి లంచం తీసుకున్నట్లు సాయిబాబా ఫిర్యాదులో పేర్కొన్నాడు. తన భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే కమిషనర్, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆవేదనతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సాయిబాబా తెలిపారు. ఎంక్వైరీ ఆఫీసర్ టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి వివాదాస్పదంగా మారిన స్థలాన్ని పరిశీలించినట్లు తెలిసింది. అధికారులు న్యాయం చేస్తారో లేదోనని సాయిబాబా కమిషనర్ పై కోర్టులో కంటెంప్ట్ పిటిషన్ కూడా వేసినట్లు సాయిబాబా తెలిపారు. అధికారులు న్యాయం చేయకపోతే లోకాయుక్తను ఆశ్రయిస్తానని తెలిపారు.

# ఆస్తి పన్ను చెల్లించలేదని దుకాణాలు సీజ్

హైదరాబాద్ (జనంసాక్షి)




ఆస్తి పన్ను చెల్లింపులకు మార్చి 31తో గడువు గియనుండటంతో జీహెచ్ఎంసీ అధికారులు ప్రాపర్టీ ట్యాక్స్ వసూలులో వేగం పెంచారు. ఈ ఏడాది 2024-25 ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో 22 రోజులే గడువు ఉండటంతో నిర్దేశిత లక్ష్యాన్ని చేరేందుకు అధికారులు దూకుడు పెంచారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ప్రాపర్టీ ట్యాక్స్ బకాయి ఉన్న దుకాణాలను ఇంచార్జి ఏఎంసీ బాలరాజ్ ఆధ్వర్యంలో సీజ్ చేశారు. ఆస్తిపన్ను చెల్లింపులకు జీహెచ్ఎంసీ అధికారులు ఆస్తి పన్ను విషయంలో కఠినంగా వ్యవహరించేందుకు సిద్ధమవుతున్నారు. జీహెచ్ఎంసీ 19వ సర్కిల్‌లోని యూసుఫ్‌గూడ, రెహ్మత్ నగర్, వెంగళ్రావు నగర్, బోరబండ, ఎర్రగడ్డ వార్డుల్లో 9 డాకెట్స్‌గా విభజించి ఆస్తి పన్ను వసూలును ముమ్మరం చేస్తున్నారు. ఆస్తి పన్ను చెల్లించకుండా ఉండేవారిని ఉపేక్షించేది లేదని డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా హెచ్చరించారు. గడువులోపు బకాయిలు చెల్లించని వారి ఆస్తులను జప్తు చేస్తామని సపష్టం చేశారు. పాత బకాయిలతో పాటు మొత్తం ఆస్తిపన్ను చెల్లించిన వారికి వన్ టైమ్ సెటిల్‌మెంట్‌లో భాగంగా వడ్డీ పై 90 శాతం మాఫీ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆస్తిపన్ను బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు.

# భవిష్యత్తు అవసరాలకనుగుణంగా ఉన్నత విద్య అభ్యసించాలి

## అంబరాన్ని తాకిన వసతి గృహ వార్షికోత్సవ సంబరాలు

## ఘనంగా ఎస్సీ బాలుర వసతి గృహం (ఏ ) వార్షికోత్సవం

ఖమ్మం (జనం సాక్షి) :








విద్యార్థుల కేరింతలు.. కోలాహలం.. సినీ గేయాలకు ఆడి పాడిన ఉత్సాహం.. ఉరకలేసిన ఆనందం.. వెరసి వసతి గృహ వార్షికోత్సవ సంబరాలు అంబరాన్ని తాకాయి. ఖమ్మం నగరంలోని ఎస్సీ బాలుర వసతి గృహ సముదాయం "హాస్టల్ డే" కార్యక్రమము, హాస్టల్ వెల్ఫేర్ ఫోరం ఖమ్మం జిల్లా అధ్యక్షులు కోటపాటి రుక్మారావు అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవానికి ముఖ్య అతిథులుగా టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ, ఖమ్మం జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ, టీఎస్జీవోస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు అట్లూరి వెంకటరమణ హాజరైనారు. ఈ సందర్భంగా ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ఆటపాటల మధ్య హాస్టల్ వార్షికోత్సవం నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందని, విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదువుకుంటూ, మంచి పౌరులుగా ఎదగాలని, అన్ని అంశాలలో ప్రావీణ్యం సంపాదించాలని, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఉన్నత విద్యను అభ్యసించాలని, ప్రభుత్వం అందించే సదుపాయాలను సక్రమంగా వినియోగించుకుంటూ ఉత్తమ పౌరులుగా ఎదగాలని, మీకు మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. ఈ సందర్భంగా కస్తాల సత్యనారాయణ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని హాస్టల్లో ప్రతి సంవత్సరం వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇక్కడ కూడా ప్రతి సంవత్సరం చాలా ఘనంగా నిర్వహిస్తున్నారు, ప్రత్యేకంగా ప్రభుత్వం నుంచి ఏవైతే ఉచిత వస్తువులు వస్తున్నాయో వాటన్నిటిని అందరికీ తెలిసే విధంగా స్టాల్ ఏర్పాటు చేసి ప్రదర్శించడం అనేది చాలా బాగుంది, ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం మూలంగా విద్యార్థుల్లో నూతన ఉత్తేజం వస్తుంది. అదేవిధంగా వసతిగృహాలలో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉన్నత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, సిబ్బంది నరేష్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# రోజూ వారి మెనూ పక్కాగా అమలు చేయాలి

## మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ (జనంసాక్షి)



గురుకులాలు, వసతి గృహాలలో రోజూ వారి మెనూ పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం హవేలి ఘనపూర్ మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపులే బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వంట గదితోపాటు వంట సరుకులు నిల్వ చేసే గదిని తనిఖీ చేసి పప్పులు, వంట నూనె, బియ్యం, కూరగాయలు, ఆకు కూరలు పరిశీలించి నాణ్యత ప్రమాణాలను తప్పకుండా పాటించాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని ప్రయోగశాల, మరుగుదొడ్లు, మూత్రశాలలు, తరగతి గదులను తనిఖీ చేసి నిత్యం పరిశుభ్రత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్, సరుకుల నిల్వల రిజిష్టర్, వార్డెన్‌ల హాజరు రిజిష్టర్‌లను పరిశీలించి రిజిస్ట్రర్‌లలో వివరాలను సరైన విధంగా నమోదు చేయాలని, వాటిని సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం విద్యార్థినిలతో మాట్లాడుతూ..ఎక్కడి నుంచి వచ్చారు.. ఎలా చదువుతున్నారు..ఉదయం అల్పహారం, మధ్యాహ్న భోజనం సమయానికి అందిస్తున్నారా అంటూ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినిల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించి చక్కగా చదువుకోని ఉన్నత విలువలతో తమ లక్ష్యాలను సాధించాలని విద్యార్థినిలకు సూచించారు.

# సీఎంఆర్ స్కాంపై సీబీఐకి ఫిర్యాదు



వరంగల్, మార్చి 09 (జనంసాక్షి)

వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల్లో జరిగిన సీఎంఆర్ స్కాంపై సీబీఐ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్నట్లు వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్ తెలిపారు. ఆదివారం శివనగర్‌లోని వరంగల్ ఉమ్మడి జిల్లా సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత మంది రైస్ మిల్లర్లు కోట్లాది రూపాయాల దోపిడికి పాల్పడారని ఆరోపించారు. వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినా చర్యలు శూన్యమని విమర్శించారు. ప్రజాప్రతినిధులు, కొంత మంది ఉన్నతాధికారుల అండదండలు ఉండడం వల్ల సంబంధిత మిల్లులపై చర్యలు తీసుకోకుండా వారికే సీఎంఆర్ వడ్లు కేటాయించారన్నారు. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్న మిల్లులకు సంబంధిత అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకున్నారన్నారు. సూర్యపేట జిల్లాలో సీఎంఆర్ మిల్లర్ల దోపిడి, అధికారుల సహకారంపై స్వచ్ఛంద సంస్థలు సీపీఐని ఆశ్రయించగా వారు విచారణ జరుపుతున్నారన్నారు. ఇదే తరహాలో అక్రమార్కులకు అండగ నిలబడిన అధికారులు, మిల్లర్లపై ఈ నెల 25న ఢిల్లీలోని సీబీఐ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సమావేశంలో తీర్మానించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మురారిశెట్టి యశ్వంత్‌కుమార్, రంగరాజు, ఆనందరావు, రాయబారపు భిక్షపతి, బండి అనిల్‌కుమార్, మృదుల, సమాఖ్య సభ్యులు చిలువేరు ప్రవీణ్‌కుమార్, రాజేష్, భార్గవ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# మిత్రపక్షంకు న్యాయం.. సిపిఐలో ఉత్సాహం



ఎన్నికల సందర్భంగా సిపిఐతో కాంగ్రెస్ పార్టీ పెట్టుకున్న ఒత్తు ఒప్పందంలో భాగంగా ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని సిపిఐ కి కాంగ్రెస్ వదిలిపెట్టడం తో ఆ పార్టీలో నూతన ఉత్సాహం కనిపిస్తుంది. గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం సిపిఐ కి ఒక ప్రాతినిధ్యం కౌన్సిల్లో కూడా కలిగినట్లు అయ్యింది మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి కే దాదాపు ఈ ఎమ్మెల్సీ సీటును సిపిఐ కేటాయించే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా సిపిఐ కి చట్టసభల్లో కొంత బలం పెరిగినట్లు కూడా అయింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కేవలం ఒకే ఒక ఎమ్మెల్యే రాష్ట్ర సిపిఐ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాత్రమే ఉన్నారు. అయితే తెలంగాణ కౌన్సిల్లో ఒక ఎమ్మెల్సీ సీటు కూడా లభించడంతో తెలంగాణలో కొంత సిపిఐ కి బలం చేకూరినట్లు అయింది .ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీలోనూ ఖాళీగా ఉన్న ఎమ్మెల్సీ స్థానాలలో అద్దంకి దయాకర్ కు కేటాయించడం న్యాయంగా ఉంది. చాలా కాలంగా ఆయన పార్టీని పట్టుకొని ఉంటున్నారు. ఆయనకు పార్టీ న్యాయం చేసినట్లు అవుతుంది. మంచి వక్త కూడా, అయిన అద్దంకి దయాకర్ కౌన్సిల్లో ఉండడం వల్ల పార్టీకి ఎంతో ప్రయోజనం ఉంటుంది. మరోవైపు ఫైర్ బ్రాండ్, రాములమ్మ విజయశాంతి కి కూడా కౌన్సిల్ సభ్యత్వం దక్కింది. ఆమె కూడా ఎమ్మెల్సీ కానున్నారు. మహిళా ప్రాతినిధ్యం కూడా ఈ ఖాళీలలో కల్పించినట్లు అయ్యింది. మరోవైపు కేతువాత్ శంకర్ నాయక్ కు కూడా ఎమ్మెల్సీ స్థానాన్ని కల్పించారు. సామాజిక న్యాయం ఇక్కడ జరిగినట్లు చాలా స్పష్టంగా కనిపిస్తుంది. మిగిలిన ఒక సీటు ఎవరికి ఇస్తారు అనేది ఇంకా తేలాల్సి ఉంది. ఒకవైపు మజిలీస్ పార్టీ కూడా కాంగ్రెస్ మద్దతును కోరే అవకాశం ఉంది. కాంగ్రెస్తో మజిలీస్ బాగానే ఉంటుంది .కాంగ్రెస్ పార్టీ మద్దతుతో ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని దక్కించుకోవడం కోసం వారు చూస్తున్నట్లు సమాచారం! ఒకవేళ కాంగ్రెస్ గనక మద్దతు ఇవ్వకపోతే బిఆర్ఎస్ మజ్లిస్ కు మద్దతు ఇస్తుందని ప్రచారం కూడా జరుగుతున్నది. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ ఈసారి ఎమ్మెల్సీ ఖాళీలను భర్తీ చేసే విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించింది. ఎక్కడ కూడా మాట రాకుండా ఏఐసీసీ నుంచి తెలంగాణ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ ప్రవేశంతో మొత్తం కింది నుంచి మీది దాకా కాంగ్రెస్ పార్టీలో ఒక ప్రక్షాళన మాదిరి ఈ ఎమ్మెల్సీల ఖాళీల భర్తీ ఎంపిక స్పష్టంగా కనిపిస్తుంది. ఇక్కడ ఎక్కడ కూడా గతంలో మాదిరి అగ్రవర్ణాల డామినేషన్ కనిపించలేదు. ఆ అవకాశం ఇవ్వరాదనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ పార్టీ ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖరిగే నేతృత్వంలో పెద్ద ఎత్తున కసరత్తు జరిపి చివరికి మీనాక్షి నటరాజన్ ఇచ్చిన జాబితానే ఫైనల్ చేసినట్లు తెలుస్తుంది .మిత్రపక్షమైన సిపిఐ కి ఒక కౌన్సిల్ స్థానాన్ని వదిలిపెట్టడం కూడా మీనాక్షి నటరాజన్ వ్యూహంలో భాగమేనని స్పష్టంగా కనిపిస్తున్నది .కాగా ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వంలోని తెలంగాణ జన సమితి పార్టీకి కూడా ఒక సీటును అడిగారు అయితే ఈసారి కాకుండా వచ్చే ఖాళీలలో భర్తీ చేసే హామీని ఇచ్చి ఆ సీటును ఎంఐఎం కు కేటాయించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం! ఏది ఏమైనా కాంగ్రెస్ పార్టీ ఈసారి కౌన్సిల్ సభ్యుల ఎంపికను చాలా ఆచితూచి చేసినట్లు స్పష్టంగా కనబడుతున్నది. నిజానికి ఇలాగే అన్ని జిల్లాలలో రాష్ట్రంలోనూ నామినేటెడ్ పదవి విషయంలో సీనియర్లకు ప్రాధాన్యత ను ఇవ్వడం తో పాటు మిత్రపక్షాలను కూడా కలుపుకొని వస్తే పార్టీకి ఢోకా ఉండదు అంటే అతిశయోక్తి కాదు! మంత్రివర్గ విస్తరణ లోను ఇదే పద్ధతిని అవలంబించే అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నారు సామాజిక న్యాయం రానున్న మంత్రివర్గ విస్తరణలో స్పష్టంగా కనిపించే విధంగా నిర్ణయం తీసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

**ఎండి మునీర్ సీనియర్ జర్నలిస్ట్**
**విశ్లేషకులు 9951865223**

# పోరాట ధీరుడు కాసాని ఐలయ్య

## తమ్మినేని వీరభద్రం, జాన్ వెస్లీ



కొత్తగూడెం, మార్చి 9 (జనంసాక్షి)

పోరాట ధీరుడు కాసాని ఐలయ్య అని సీపీఎం కేంద్ర, రాష్ట్ర నాయకులు తమ్మినేని వీరభద్రం, జాన్ వెస్లీలు అన్నారు. ఆదివారం సుజాతనగర్‌లో కాసాని ఐలయ్య, ఆయన సతీమణి లక్ష్మీల విగ్రహాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఐలయ్య సంస్మరణలో వారు మాట్లాడారు. తాను చనిపోవడానికి వారం రోజుల ముందు సుజాతనగర్‌లోని ఏడు గ్రామ పంచాయతీలను కొత్తగూడెం కార్పొరేషన్‌లో కలపవద్దని పెద్ద ఉద్యమానికి ఐలయ్య శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కలెక్టరేట్ ధర్నాకి ప్రజల్ని కదిలించడానికి తానే స్వయంగా ఇరవై గ్రామాలు తిరిగి అర్బన్ స్వభావం రాని పల్లె ప్రాంతాలను కార్పొరేషన్‌లో కలుపడం వల్ల జరిగే నష్టమేమిటో వివరించి, ప్రజల్ని చైతన్యం చేసిన ధీరుడు ఐలయ్య అని కొనియాడారు. తనను క్యాన్సర్ తో పాటు ఎన్నో జబ్బులు చుట్టుముట్టినప్పటికీ వెరువక ఈ పోరాటంలో కీలక పాత్ర వహించి ప్రజల్ని కదిలించాడన్నారు. అందుకే ఆయన ఈ ప్రాంత ప్రజల గుండెల్లో చిరకాలం జీవించే ఉంటాడన్నారు. అనేక పోరాటాలు చేసి వందలాది మందికి ఇంటి జాగా అందించిన వ్యక్తి ఐలయ్య అని కొనియాడారు. సుజాతనగర్ మండల కార్యదర్శి రమేశ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఎం కేంద్ర కమిటీ నాయకులు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సుదర్శన్, అంతర్జాతీయ మిమిక్రీ కళాకారుడు జల్లారపు రమేశ్, న్యూ డెమోక్రసీ నాయకుడు మధు, బీఆర్ఎస్ నాయకులు తులసి రెడ్డి, సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, కోనేరు చిన్ని, సీపీఐ మండల కార్యదర్శి దస్రు, ఐలయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో బ్లాక్ మెయిల్

ఖమ్మం (జనంసాక్షి) :



**తగిన శాస్తిచేసిన పోలీసులు**
**ఏళ్ల తరబడి నష్టపోయిన బాధితుల హర్షం**
**అట్రాసిటీ కేసు నమోదు చేయాలని గిరిజన సంఘాల డిమాండ్**

కారేపల్లి మండలానికి చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి వృత్తిరీత్యా బైక్ మెకానిక్ కావచ్చు, కానీ అతని అసలైన ప్రవృత్తి మాత్రం ఎక్కడి గొడవలో అక్కడ తలదూర్చి, అమాయకులను మోసం చేసి డబ్బులు గుంజడం. డబ్బు కోసం ఎంతకైనా దిగజారే అతని నీచమైన ఆలోచనలు చివరికి అతనిని పోలీసు ల వలలో పడేలా చేశాయి. వాస్తవానికి వెంకటేశ్వర్లును చట్ట పరిధిలోకి తీసు కురావడం అనివార్యమైంది. ఎందు కంటే అతను సోషల్ మీడియాను ఓ ఆయుధంగా మలుచుకొని, ఇతరులపై అవాస్తవ ఆరోపణలు చేస్తూ, తప్పుడు ప్రచారాలు నిర్వహిస్తూ బ్లాక్‌మెయిల్ చేయడాన్ని అలవాటుగా మార్చుకు న్నాడు. భూమి వివాదాలు, వ్యక్తిగత తగాదాలు, పరస్పర విభేదాలు ఏ అంశమైనా తనకు సంబంధం లేకున్నా వినిపించిన ప్రతి గొడవలో తలదూర్చి, తప్పుడు ఆరోపణలు చేస్తూ డబ్బులు పిండుకునే పనిలో పడ్డాడు. తన పద్ధతుల వల్ల బాధితులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ పోలీసులను ఆశ్రయించినా అతని దుర్మార్గం ఆగలేదు. రెవెన్యూ అధికారులు వెంకటేశ్వర్లును అనేకసార్లు హెచ్చరించారు. అతనిపై నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ అతను ఎవరికీ లెక్కచేయకుండా తన దారిలో నడుస్తూ తన మోసాలకు రెక్కలు తొడిగాడు. ఇక చివరికి అధికార యంత్రాంగం నడుం బిగించి వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకున్నారు. అతనిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేయగా, ఇప్పటి వరకు 10 కేసులు నమోదయ్యాయి. ఇంకా అనేక ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. సోషల్ మీడియాలో అసత్య ఆరోపణలు, బ్లాక్‌మెయిల్, ఇతరుల జీవితాల్లో కల్లోలం సృష్టించిన వెంకటేశ్వర్లు ప్రస్తుతం జైలులో ఊచలు లెక్కపెడుతున్నాడు. ఆయన మోసాల వల్ల ఏళ్ల తరబడి నష్టపోయిన బాధితులు ఇప్పుడు పోలీసుల చర్యకు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల ప్రజలు సైతం పోలీసుల తక్షణ చర్యను అభినందిస్తూ, వెంకటేశ్వర్లుపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా నమోదు చేయాలని గిరిజన సంఘాలు గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి. "బ్లాక్‌మెయిల్ రాజకీయాలు, డబ్బు కోసం చేసే మోసాలు ఎంతకాలం నడుస్తాయి?" అనే ప్రశ్నకు పోలీసులు చక్కటి సమాధానం ఇచ్చారు. నేరస్తులకు, నిరాధార ఆరోపణలు చేసి ఇతరుల జీవితాలతో ఆటలాడే వ్యక్తులకు ఇకపై రాష్ట్రవ్యాప్తంగా ఇదే గుణపాఠం కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# కాంగ్రెస్‌కు ఇసుక మాఫియాపై ఉన్న ప్రేమ, ప్రజలపై ఏదీ?

## ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

ఖమ్మం (జనంసాక్షి)

గోదావరి పరివాహక ప్రాంతమంతా ఇసుక అక్రమ వ్యాపారం జోరుగా సాగుతూ మూడు పూలు ఆరు కాయలుగా వర్ధిల్లుతుందని ఉమ్మడి ఖమ్మం జిల్లా శాసనమండలి సభ్యుడు, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ అన్నారు. కాంగ్రెస్‌కు ఇసుక మాఫియాపై ఉన్న ప్రేమ, ప్రజలపై ఏదీ అని ఆయన ప్రశ్నించారు. కాంట్రాక్టర్ల కమీషన్లు, ఇసుక దందాలే కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుగా ఉందని దుయ్యబట్టారు. భద్రాచలం పట్టణం శాంతినగర్‌లో రావులపల్లి రాంప్రసాద్ స్వగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ వస్తే కష్టాలు తప్పవన్నా నానుడి మరోమారు రుజువైందన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి పేరు మర్చిపోతుంటే పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చన్నారు.

**ఉమ్మడి పాలనలోని దుర్భిక్షం మళ్లీ కండ్లముందుకు..**

ఉమ్మడి ఏపీలోని దుర్భిక్ష పరిస్థితులను కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి తీసుకువచ్చిందన్నారు. రాష్ట్రంలోని ఏ గ్రామంలో కూడా 30% మించి రైతు రుణమాఫీ కాలేదన్నారు. మళ్లీ పాత రోజులు పల్లెల్లో దర్శనమిస్తున్నట్లు తెలిపారు. యూరియా బస్తాల కోసం చెప్పులు లైన్‌లో పెట్టి నిలబడాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో పదేండ్ల కేసీఆర్ పాలనలో హైదరాబాద్ నగరంలో ఒక్క వాటర్ ట్యాంక్ కూడా రాలేదని, ఇప్పుడు నగరం నలుమూలలా ఎటు చూసిన వాటర్ ట్యాంకులే దర్శనమిస్తున్నట్లు తెలిపారు. రూ.2 వేల పింఛనును రూ.4 వేలకు పెంచుతామని చెప్పి కాలయపన చేస్తున్నారే తప్పా పెంచడం లేదన్నారు. రాష్ట్ర సచివాలయం ముందు కాంట్రాక్టర్లు ఆందోళన చేపట్టడం అంటే తెలంగాణ పరువును కాంగ్రెస్ ప్రభుత్వం నడి బజారులో తీసేసిందన్నారు. గర్భిణీలకు కేసీఆర్ ప్రభుత్వంలో ఇచ్చిన కేసీఆర్ కిట్టు ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఏర్పాటు చేసిన ఆరోగ్య శ్రీ, ఫీజు రియింబర్స్‌మెంట్ పథకాన్ని కేసీఆర్ కొనసాగించిన విషయాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గుర్తు చేశారు. ఉత్తర తెలంగాణ అంతా నీళ్ల లేకుండా ఎండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్ల కోసం మరో పోరాటం చేసే సమయం ఆసన్నమైందని తెలిపారు.

# మహిళా హక్కుల సాధన కోసమే ప్రపంచ మహిళా దినోత్సవం

**మహిళలు అన్ని రంగాలలో రాణించడానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట..మంత్రి ధనసరి అనసూయ సీతక్క**

**ఆటల పోటీలలో గెలుపొందిన మహిళ ఉద్యోగులకు బహుమతుల ప్రదానం**





**ములుగు ప్రతినిధి, మార్చి 09(జనంసాక్షి) :**

రాష్ట్ర ప్రభుత్వం మహిళలు అన్ని రంగాలలో రాణించడానికి పలు రకాల పథకాలు ప్రవేశపెడుతుందని, ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు.ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్రా, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, అదనపు కలెక్టర్ సంపత్ రావు లతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ప్రారంభోత్సవం చేశారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో ఈ నెల 5, 6 తేదీలలో జిల్లాలోని మహిళా ఉద్యోగులకు జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్ లో 16 రకాల క్రీడా పోటీలను నిర్వహించారు. విజేతలకు మంత్రి సీతక్క బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచంలో మహిళ లేనిదే లోకం లేదని, మహిళలతోనే ప్రపంచం ఉందని ఆమె అన్నారు. రాష్ట్రంలోని మహిళలకు అన్ని రంగాలలో ప్రాధాన్యత ఇవ్వడానికి సీఎం ఏనుముల రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపిస్తున్నారని, మహిళల హక్కుల సాధన కోసం నిర్ణయాలు తీసుకుంటున్నారని వివరించారు. కష్టాలలో ఉన్న మహిళ కుటుంబాలను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి పలు నిర్ణయాలు తీసుకున్నారని, మహిళలను అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేస్తున్నానని అన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సులు ఉచిత ప్రయాణంతో పాటు, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఇందిరమ్మ మహిళ క్యాంటీన్ ఏర్పాటు చేయడంతో పాటు పెట్రోల్ పంపు, రైస్ మిల్లులు, సోలార్ పవర్ తయారీ, ఆర్టీసీ బస్సులతో పాటు పలు రంగాల్లో అభివృద్ధి చెందడానికి ఆర్థిక సాయం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. మహిళా సంఘాలకు ఎక్కడలేని విధంగా 21 వేల 635 కోట్ల రూపాయలతో మహిళా సంఘాల గ్రూపులకు నిధులు కేటాయించి పలు పథకాలలో భాగస్వామ్యం చేశామని, డ్వాక్రా గ్రూప్ మహిళలు ప్రతి నెల 5 లక్షల రూపాయల ఆదాయం పొందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల పాత్ర చాలా ముఖ్యమైనదని, మహిళలకు పెద్దపీట వేస్తుందని, మహిళలు విద్య, ఉపాధి రంగాల్లోముందు ఉన్నారని, సమానత్వం, మహిళా సాధికారత,
సాధించాలనీ, మహిళల సమాన హక్కులను కల్పించడం జరిగింది అన్నారు. సామాజిక, సాంకేతిక రంగాల్లో పురోగతిని ప్రోత్సహించాలని, విద్య, ఉపాధి వంటి రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా మహిళలు ముందుంటారని, ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక స్వావలంబన, తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్రా మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు పురుషులతో పాటు సమాన పనిచేసి జిల్లా ను అభివృద్ధి పదంలో ముందుకు తీసుకెళ్లడానికి తమ వంతు కృషి చేస్తానని అన్నారు.అనంతరం మహిళా దినోత్సవ సందర్భంగా మంత్రి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వెంకటేష్, డిడబ్ల్యూఓ శిరీష, జిల్లా లోని వివిధ శాఖల మహిళ ఉద్యోగులు, టిజిఓ, టిఎన్జిఓ సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల వరం ఇందిరమ్మ పథకం

**ఇండ్లు లేని నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు**

**సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం**

**మంత్రి ధనసరి అనసూయ సీతక్క**

**ములుగు ప్రతినిధి, మార్చి 09(జనంసాక్షి)**





ఇండ్లు లేని నిరుపేదలందరికి ఇల్లు నిర్మించాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పథకం ప్రవేశపెట్టిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆదివారం ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం లోని గ్రామంలో రూ.5 లక్షల అంచనా విలువతో చేపట్టనున్న ఇందిరమ్మ మోడల్ ఇల్లు నిర్మాణానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ తొ కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లో ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌస్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని అన్నారు. ఈ రోజు జిల్లా లో మొదటి సారిగా ఇందిరమ్మ ఇండ్ల పథకం నమూనాల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశామని అన్నారు. మోడల్ హౌస్‌ను పరిశీలించి తక్కువ ధరతో నాణ్యతతో ఇల్లు ఎలా కట్టాలో పేదలు పరిశీలించి వారి స్థలాలలో నిర్మించుకోవాలని సూచించారు.
ఇంటిలో నివసించే ప్రజలే నిర్మాణం చేసుకునేలా ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. రాబోయే నాలుగేళ్లలో పేదవాడి సొంతింటి కల నెరవేర్చే దిశగా ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమం నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ళ యాప్ ప్రారంభించుకున్నామని అన్నారు. ప్రభుత్వం ఏర్పడగానే చేపట్టిన ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తు లలో అర్హులైన దరఖాస్తులను ఎంపిక చేసి మొదటి విడత ప్రభుత్వం మంజూరు చేస్తామని అన్నారు. ప్రతి దశలో ఇంటి నిర్మాణ పురోగతి వివరాలు ఇందిరమ్మ ఇండ్ల యాప్‌లో నమోదు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ, తహశీలదార్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత



**బెల్లంపల్లి, మార్చి 9, (జనంసాక్షి)**

బెల్లంపల్లి నియోజకవర్గం కన్నెపల్లి మండలంలోని సూర్జాపూర్ గ్రామంలో ఆదివారం నిలువ ఉంచిన నకిలీ పత్తి విత్తనాలను అధికారులు పట్టుకున్నారు. కన్నెపల్లి వ్యవసాయాధికారి సాయిప్రశాంత్, ఎస్సై గంగారాం పోలీస్ సిబ్బంది పక్కా సమాచారంతో బేరి నారాయణ అనే వ్యక్తి ఇంట్లో తనిఖీలు చేసి నిల్వ ఉంచిన 140 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను కన్నెపల్లి పోలీస్ స్టేషన్ లో తాండూర్ సీఐ కుమారస్వామి వెల్లడించారు. నకిలీ విత్తనాలను కలిగి ఉన్న బేర నారాయణ వెంకటాపూర్ గ్రామానికి చెందిన కొండగొర్ల రాజన్న, సురేష్ అనే వ్యక్తుల నుండి నకిలీ పత్తి విత్తనాలను పొందినట్లు సీఐ వెల్లడించారు. ప్రస్తుతం పట్టుబడ్డ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకుని నిందితులైన బేర నారాయణ, కొండగొర్ల రాజన్న లను అరెస్టు చేసినట్లు చెప్పారు. సురేష్ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు సీఐ కుమారస్వామి వెల్లడించారు. నకిలీ పత్తి విత్తనాలు అమ్మిన, కొనుగోలు చేసిన కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# జనావాసాల్లో పందుల సంచారం



**భూపాలపల్లి, మార్చి 9 (జనం సాక్షి) :**

భూపాలపల్లి ఏరియా సింగరేణి కాలరీస్ సుభాష్ కాలనీ మిలీనియం కోటర్స్ లో ఇష్టారీతిన పందుల సంచారం , జన నివాసాలు ఉన్నచోట పెంచడానికి అనుమతి లేకున్నా నిబంధనలకు విరుద్ధంగా పెంచుతూ జననివాసాలకు వదిలేస్తూ స్థానికులను అనారోగ్యం పాలు చేస్తున్నారు. పందుల ద్వారా అంటూ వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఎక్కువగా ఉండటం వలన , స్థానికంగా నివాసం ఉంటున్న వారిలో ఎక్కువగా చిన్నపిల్లలు, వయోవృద్ధులు, రిటైర్డ్ కార్మి కులు ఉండటం వలన వారు భయాందోళనకు గురవుతున్నారు , ఈ విషయంపై సంబంధిత అధికారులు సిబ్బంది స్పందించి వెంటనే సమస్య పరిష్కరించాలని కోరుచున్నారు.

# తాటికొండ ఉన్నత పాఠశాలకు ఇన్‌స్పైర్‌లో అవార్డుల పంట

**స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 09 (జనం సాక్షి) :**



ప్రతీ సంవత్సరం భారత ప్రభుత్వం సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా అందించే ఇన్‌స్పైర్ అవార్డుల్లో 2024-25 సంవత్సరాని కి గాను మండలంలోని తాటికొండ ఉన్నత పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు బురుగు రాజు, నారబోయిన శ్రీమాన్,పూల జశ్వంత్ కుమార్ ఎంపికయ్యారు. ఇన్‌స్పైర్ అవార్డుల కు ఎంపికయిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింగమూర్తి , అమ్మ ఆదర్శ కమిటీ చైర్ పర్సన్ బేతి మంజుల రెడ్డి, గైడ్ టీచర్లు మురళీ,అనసూయ,శ్రీనివాస్,రవీందర్ అభినం దించారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు టీఎస్ మండల అధ్యక్షుడు, ఫిజికల్ డైరెక్టర్ గిరెడ్డి ప్రమోద్ రెడ్డి, ఉపాధ్యాయులు రంజిత్ కుమార్, రుద్ర, రుద్రమ దేవి, శ్రీనివాస్, సలావుద్దీన్, వీరబ్రహ్మం, క్రూపమ్మ, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ నూతన పోలీస్ కమిషనర్‌గా గౌస్ ఆలం బాధ్యతల స్వీకరణ

**కరీంనగర్ బ్యూరో, మార్చి 09 (జనంసాక్షి)**



: కరీంనగర్ నూతన పోలీస్ కమిషనర్ గా గౌస్ ఆలం ఆదివారం రోజు భాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేసిన బదిలీలలో భాగంగా ఆదిలాబాద్ ఎస్పీగా పనిచేస్తున్న ఆయన నూతన కరీంనగర్ పోలీస్ కమిషనర్ గా నియమించబడ్డారు. బాధ్యతల స్వీకరణకు కరీంనగర్ కు విచ్చేసిన గౌస్ ఆలం, కరీంనగర్ పోలీస్ కమీషనర్ గా ఉన్న అభిషేక్ మొహంతి లను పూల మొక్కను అందించి మర్యాద పూర్వకంగా కలిశారు. కమిషనరేట్ లోని నేరాలు , శాంతి భద్రతల గురించి తెలుసుకున్నారు. నూతన పోలీసు కమీషనర్ కు సాయుధ బలగాలు గౌరవ వందనం సమర్పించాయి. అనంతరం కమిషనరేట్ లోని పోలీస్ అధికారులు నూతన పోలీసు కమీషనర్ కు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్బంగా కరీంనగర్ నూతన పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ... ముఖ్యంగా నేరాల నియంత్రణ పై ప్రధాన దృష్టి సారిస్తామన్నారు. శాంతిభద్రతలు కాపాడటం, రోడ్డు భద్రత, ఉల్లంఘనల నివారణ, పట్టణ పోలీసింగ్‌పై దృష్టి సారించడం, పౌర-ఆధారిత పోలీసింగ్ సేవలు , ప్రజా భద్రతా సమస్యలు పరిష్కరించుట కృషి చేస్తామన్నారు. పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా ఉపయోగిస్తామన్నారు. కమిషనరేటులోని పోలీసు అధికారుల, సిబ్బంది సంక్షేమం కొరకు ఎల్లప్పుడూ పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఏ. లక్ష్మి నారాయణ, రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్ , ప్రొబేషనరీ ఐపీఎస్ వసుంధర యాదవ్ కమిషనరేట్ లోని ఏసీపీ లు , ఇన్స్పెక్టర్లు , ఆర్ ఐ లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర సంఘం డ్రైవర్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు సయ్యద్ హాసం హుస్సేన్ కు ఘన సన్మానం

**కరీంనగర్ బ్యూరో, మార్చి 09 (జనంసాక్షి) :**



తెలంగాణ ప్రభుత్వ కేంద్ర సంఘం (డ్రైవర్ అసోసియేషన్) నూతన అధ్యక్షులుగా ఎన్నికైన సయ్యద్ హాసం హుస్సేన్ ని కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు యు.వెంకటయ్య , ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షులతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సర్దార్ మంజీత్ సింగ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఈరావేని పద్మ రావు, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి అలీమ్ ఖాన్ లు కరీంనగర్ కు వచ్చిన సందర్భంగా మర్యాదపూర్వకంగా ఆహ్వానం పలుకుతూ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు యు.వెంకటయ్య , సభ్యులతో కలిసి మాట్లాడుతూ... జిల్లా ఎన్నికల గురించి రాష్ట్ర అధ్యక్షులకు విన్నవించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ హాసం హుస్సేన్ సానుకూలంగా స్పందించినారు. రాష్ట్ర కార్యవర్గం, జిల్లా కార్యవర్గాలకి వారు ధన్యవాదాలు తెలిపారు.

# క్రీడలపై మక్కువను పెంచుకోండి



**శేరిలింగంపల్లి, మార్చి 09 (జనంసాక్షి)**



క్రీడలపై మొక్కలను పెంచుకోవాలని, క్రీడల రూపంలో శరీరానికి కావలసినంత శ్రమను ఇవ్వగలిగితే దేహదారిద్యంతోపాటు మానసికోల్లాసాన్ని పొందవచ్చని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు మాదాపూర్ డివిజన్ పరిధి మాతృశ్రీనగర్ కాలనీలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మాతృశ్రీనగర్ కాలనీ క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్-8 ను చైర్మన్ అరికెపూడి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ మాతృశ్రీనగర్ కాలనీ క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్-8 నిర్వహించడం ఎంతో అభినందించదగ్గ విషయమని, మాతృశ్రీ నగర్వాసులకు క్రీడల పై ఉన్న సానుకూల దృక్పథాన్ని ఆయన ప్రత్యేకంగా కొనియాడారు. ఇందులో భాగంగా క్రికెట్ క్రీడ పై ఆసక్తి కలిగినవారు సీజన్-8 క్రికెట్ క్రీడోత్సవానికి భారీ సంఖ్యలో హాజరు కావడం ఆహుతులకు మరింత ఉత్సాహాన్ని అందించింది. సీజన్-8 ప్రీమియర్ లీగ్ ను తన చేతులమీదుగా ప్రారంభించిన పిఎసి చైర్మన్ అరికపూడి టాస్ ను సైతం వేసి ఆటను ప్రారంభింపజేశారు. ఈ క్రమంలో పోటీలకు హాజరైన క్రీడాకారులతో కలిసి కాసేపు పిఎసి చైర్మన్ క్రికెట్ ను ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు పిల్లలలో దాగిన సృజనాత్మకతను వెలికి తీయడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. పిల్లలకు చదువుతోపాటు క్రీడలు ఎంతగానో ముఖ్యమని, క్రీడలతో శారీరక శ్రమతోపాటు మానసిక ఉల్లాసం లభిస్తాయన్నారు. ముఖ్యంగా పిల్లలు చదువుతోపాటు క్రీడలకు సమ ప్రాధాన్యం ఇవ్వాలని, అప్పుడే మంచి భావి పౌరులుగా దేశానికి సేవలు అందిస్తారని పి ఎస్ సి చైర్మన్ అరికెపూడి అభిప్రాయపడ్డారు. ప్రతి వ్యక్తి జీవితంలో క్రీడలు భాగస్వామి కావాలని, క్రీడలలో రాణించడంద్వారా తల్లిదండ్రులకు, దేశానికి మంచి పేరును ఆపాదించవచ్చన్నారు. తెలంగాణ రాష్ట్రంలో క్రీడలతోపాటు విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని, విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ మంచి విద్యను, నాణ్యమైన విద్యను అభ్యసించాల్సిన అవసరం ఉందని అరికపూడి సూచించారు. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్య పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని, నియోజకవర్గం పరిధిలోని ఆయా కాలనీల సమస్యల పరిష్కారానికై నియోజకవర్గ ప్రతినిధిగా వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పారిష్కారం అయ్యేలా చూస్తానని ఆయన భరోసాను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఇండస్ట్రియల్ పొల్యూషన్ డౌన్.. డౌన్

**కుత్బుల్లాపూర్ (జనంసాక్షి)**



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి, నిజాంపేట, ప్రగతి నగర్ పరిసర ప్రాంతాల ప్రజలకు ఇండస్ట్రియల్ కాలుష్యం నుంచి విముక్తి కల్పించాలంటూ పలువురు నినదించారు. గత కొంతకాలంగా బాచుపల్లి, నిజాంపేట, ప్రగతి నగర్ ప్రజలు వాయు కాలుష్యాన్ని నివారించాలంటూ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (పీసీబీ) అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన స్పందన లేకపోవడంతో ఆదివారం బాచుపల్లిలో ఇండస్ట్రియల్ కాలుష్యానికి వ్యతిరేకంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండస్ట్రియల్ కాలుష్యానికి, పీసీబీ అధికారుల నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ప్ల కార్డులు చేతబూని నినదిస్తూ కావ్య ఏవెన్యూ కమ్యూనిటీ హాల్ నుండి మల్లంపేట రోడ్‌లోని సిల్వర్ ఓక్స్ పాఠశాల మీదుగా బాచుపల్లి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇండస్ట్రియల్ కాలుష్యం కారణంగా బాచుపల్లి పరిసర ప్రాంతాల ప్రజలు స్వచ్ఛమైన గాలి పీల్చడం కష్టతరంగా మారుతుందన్నారు. విషవాయువుల విడుదలతో రాత్రిపూట బయటకు వస్తే ముక్కుపుటాలు అదురుతున్నాయని పేర్కొన్నారు. బాచుపల్లి పరిసర ప్రాంతాల్లోని ఐడీఏ బొల్లారం, కాజిపల్లి, బొంతపల్లి, జిన్నారం తదితర ప్రాంతాల్లోనీ కొన్ని పరిశ్రమలు విచ్చలవిడిగా రాత్రి పొద్దుపోయిన తర్వాత, తెల్లవారి జామున హానికారకమైన విషవాయువులను గాలిలోకి విడుదల చేస్తుండడంతో తమ ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. ఈ విషయమై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు ఎన్ని మార్లు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదన్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న పరిశ్రమలను మూసివేసేదాకా పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పీసీబీ డౌన్.. డౌన్.. పీసీబీ జాగో పొల్యూషన్ బాగో, పీసీబీ అధికారులు
మొద్దు నిద్ర వీడాలి, ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలి, వి వాంట్ జస్టిస్, స్వచ్ఛమైన గాలి మా జన్మ హక్కు, పీసీబీ నిర్లక్ష్య వైఖరి నశించాలి, కాలుష్యం
వెదజల్లుతున్న ఫ్యాక్టరీలను మూసివేయాలి అంటూ నినాదాలు చేశారు. ర్యాలీలో బాచుపల్లి, నిజాంపేట్ ప్రగతి నగర్ కు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్‌ఆర్ కాలేజీ హాస్టల్ వార్డెన్ దాష్టికం

**నిజామాబాద్ (జనంసాక్షి)**

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్మూర్ రోడ్డులో గల ఎస్ఆర్ కాలేజీలో రెసిడెంట్ విద్యార్థిపై వార్డెన్ దాడి చేశాడు. ఈ సంఘటన ఆదివారం జరిగింది. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన వాహజుద్దిన్ (17) ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. పరీక్షల నేపథ్యంలో వాహజుద్దిన్ హాస్టల్ లో ఉండి చదువుతున్నాడు. చదువకుండా నిధ పోతున్నాడని ఆదివారం హాస్టల్ ఫ్లోర్ ఇంచార్జ్ నిఖిల్ అనే వార్డెన్ కొట్టడంతో గాయాలు అయ్యాయి. తాను రంజాన్ మాసం సందర్భంగా ఉపవాసం( రోజా) ఉండి చదువుతుండగా తనను అకారణంగా కొట్టడని వాహజుద్దిన్ తల్లిదండ్రులకు ఫోన్ లో ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులు హాస్టల్ కు వచ్చి ప్రిన్సిపాల్ తో పాటు వార్డెన్ లను నిలదీశారు. అప్పటికే వార్డెన్ ను అక్కడినుంచి పంపించేశారు. అయితే కుటుంబ సభ్యులు నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై స్థానికంగా ఉన్న ప్రిన్సిపాల్ హన్మంత్ రావు ను వివరణ కోరగా హాస్టల్ లో ఎలాంటి ఘటన జరుగలేదని చెప్పడం విశేషం.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
10 మార్చి 2025

# ప్రజలకు సేవలందిస్తూ ప్రభుత్వానికి పేరు తేవాలి

- భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి
- రెవెన్యూ సంఘాల నేతలతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి సమక్షంలో మంత్రిని కలిసిన సంఘాల నేతలు





**హైదరాబాద్, మార్చి 9 (జనంసాక్షి) :** రెవెన్యూ ఉద్యోగులు కష్టపడి పని చేస్తూ ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికే భూ భారతిని త్వరలోనే అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో పని చేసేందుకు కొత్తగా 10,954 జీపీఓ, కొత్త డివిజన్లు, మండలాలకు 361 పోస్టులు, 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులకు క్యాబినెట్ ఆమోదం తెలిపిన సందర్భంగా ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెవెన్యూ ఉద్యోగుల సంఘాలు కలిసారు. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి సమక్షంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, మహిళా అధ్యక్షురాలు రాధ, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(టీజీఆర్ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, సీసీఎల్ఏ యూనిట్ అధ్యక్షుడు రాంబాబు, కృష్ణ చైతన్య, పూర్వ వీఆర్వో, వీఆర్ఏ సంఘాల నాయకులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెవెన్యూ సంఘాల నేతలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నట్టుగా చెప్పారు. ఉద్యోగుల వేతనాలను నెల మొదటి వారంలోనే ఇస్తున్నామన్నారు. ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వ శాఖలను బలోపేతం కృషి చేస్తున్నట్టుగా చెప్పారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కొత్తగా పోస్టుల మంజూరు చేసిందన్నారు. గ్రామ స్థాయిలో 10,954 గ్రామ స్థాయి పరిపాలన అధికారులు (జీపీఓ), కొత్త డివిజన్లకు, మండలాలకు 361 పోస్టుల మంజూరు, 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం కూడా లభించిందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేంద్ర రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి లక్ష్మీ నరసింహులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పీఎస్ రాఘవేందర్, పూర్వ వీఆర్ఏ సంఘం అధ్యక్షుడు ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్ రద్దుకు గ్రీన్‌ట్రిబ్యునల్‌ను ఆశ్రయించండి : హరీశ్‌రావు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** డంపింగ్‌యార్డు రద్దు కోసం అన్ని సాక్ష్యాధారాలతో గ్రీన్‌ట్రిబ్యునల్ కోర్టును ఆశ్రయించాలని డంపింగ్‌యార్డు వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సూచించారు. శనివారం రాత్రి మాజీ మంత్రి, రామచంద్రాపురం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆదర్శ్‌రెడ్డితోపాటు నర్సాపూర్‌లో ఓ కార్యక్రమానికి వెళుతుండగా గుమ్మడిదల జేఏసీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, సూర్యనారాయణ తదితరులు కలిశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డంపింగ్‌యార్డును రద్దు చేయాలంటే కోర్టుల ద్వారా పోతేనే న్యాయం జరుగుతుందని సూచించారు. వీరితో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

## ముగిసిన ప్రణయ్ హత్య కేసు విచారణ

- నేడు తుది తీర్పు

**నల్లగొండ, మార్చి 9 (జనంసాక్షి) :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన ప్రణయ్ హత్య కేసు విచారణ తుది దశకు చేరింది. ఇప్పటికే వాదనలు, విచారణ పూర్తి చేసిన కోర్టు నేడు తుది తీర్పు వెల్లడించనుంది. 2018 సెప్టెంబర్ 14న మిర్యాలగూడలో ప్రణయ్ హత్యకు గురైన సంగతి తెలిసిందే. తన కూతురు అమృతను కులాంతర వివాహం చేసుకున్నాడనే కక్షతో ఆమె తండ్రి మారుతీరావు సుఫారీ గ్యాంగ్ తో ప్రణయ్‌ను హత్య చేయించినట్లు ఆరోపణలు. మారుతిరావుతో పాటు అస్గర్ అలీ, అబ్దుల్ భారీ, ఎంఏ కరీం, శ్రావణ్ కుమార్, ఆటో డ్రైవర్ నిజాం, మారుతీరావు కారు డ్రైవర్ శివ ఇతర నిందితులుగా ఉన్నారు. ప్రణయ్ తండ్రి పెరుమాళ్ల బాలస్వామి ఫిర్యాదు మేరకు, పోలీసులు నిందితులపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం, హత్య ఆరోపణల కింద అరెస్టు చేశారు. 2019లో సుభాష్ శర్మ తప్ప మిగతా వారందరికీ బెయిల్ లభించింది. ప్రధాన నిందితుడు మారుతీరావు మార్చి 7, 2020న ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రణయ్ కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల నేతలు, ప్రజలు కోర్టు తుది తీర్పుపై ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## అశ్రునయనాల మధ్య ప్రవీణ్‌కు అంతిమ వీడ్కోలు





**కేశంపేట, మార్చి 9 (జనంసాక్షి) :** అమెరికాలో దుండగుల కాల్పుల్లో మరణించిన గంప ప్రవీణ్ అంత్యక్రియలు పూర్తయ్యాయి. ప్రవీణ్ కుటుంబసభ్యులు, బంధుమిత్రుల ఆశ్రునయనాల మధ్య అంతిమ వీడ్కోలు పలికారు. అమెరికా నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆదివారం తెల్లవారుజామున వచ్చిన గంప ప్రవీణ్ పార్థివదేహాన్ని భారత రాయబార కార్యాలయ ప్రతినిధులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. శంషాబాద్ నుంచి నేరుగా కేశంపేట మండల కేంద్రానికి తరలించి ప్రవీణ్ నివాసంలో కుటుంబ సభ్యుల సందర్శనార్థం కొద్దిసేపు ఏర్పాటు చేశారు. కేశంపేట మాజీ సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి, పాలమూరు చారిట్రబుల్ ట్రస్ట్ అధినేత విష్ణువర్ధన్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లు ప్రవీణ్‌కు నివాళులర్పించారు. అంతిమయాత్ర దారి పొడవున పూలవర్షం కురిపించడంతోపాటు ప్రవీణ్‌ను కడసారి చూసేందుకు మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు.

**కేశంపేటలో గంప ప్రవీణ్ అంతిమయాత్ర**

రంగారెడ్డి జిల్లా కేశంపేట మండల కేంద్రానికి చెందిన గంప రాఘవులు-రమాదేవి దంపతులకు కొడుకు ప్రవీణ్(27), కుమార్తె ఉన్నారు. కుమారుడు ప్రవీణ్ కొంతకాలం కిందట ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. అక్కడ విస్కాన్సిన్ మిల్వాంకిలో నివాసం ఉంటున్నాడు. అక్కడే యూనివర్సిటీలో ఎంఎస్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఖర్చుల కోసం ఓ స్టార్ హోటల్‌లో పార్ట్‌టైం జాబ్ చేస్తున్నాడు. ఇదిలా ఉంటే ఈ నెల 5వ తేదీన ప్రవీణ్ నివాసం ఉండే ఇంటికి సమీపంలోని బీచ్ దగ్గర తాజాగా ఓ దుండగుడు కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో గాయపడ్డ ప్రవీణ్ అక్కడికక్కడే మరణించారు.

## 136 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత



**పెద్దవంగర, మార్చి 9 (జనంసాక్షి) :** 136 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న సంఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం కోరిపల్లి ఎక్స్ రోడ్ వద్ద మరియు మండలంలోని ఎల్బీ తండ వద్ద చోటుచేసుకుంది. ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా గుండ్లపల్లి మండలం రుద్రాయగూడెం కు చెందిన మేకల నాగయ్య, హైదరాబాద్ శివారు కొత్తపేటకు చెందిన ఐత కృష్ణ మండలంలోని ఆయా గ్రామాలు తిరుగుతూ ప్రభుత్వం పేద ప్రజలకు పంపిణీ చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని సేకరించి హైదరాబాద్ కు తరలించి విక్రయిస్తూ అధిక సొమ్ము చేసుకుంటున్నారు. ఆదివారం ఉదయం నమ్మదగిన సమాచారం మేరకు వాహనాన్ని వెంబడించి మండలంలోని కోరిపల్లి క్రాస్ రోడ్ వద్ద డీసీఎం వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా వాహనంలో 120 క్వింటాల పిడిఎస్ బియ్యం ఉన్నట్లుగా గుర్తించాము. వీటి విలువ సుమారు రూ. 4.68 లక్షలు ఉంటుందని, పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్లో భద్రపరిచామని వాహనాన్ని సీజ్ చేసి మేకల నాగయ్య, ఐత కృష్ణ లపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సిద్దిపేట జిల్లా జైతాపూర్ మండలం వట్టిపల్లి గ్రామానికి చెందిన గుగులోతు రాజు, మహబూబాద్ జిల్లా పెద్దవంగర మండలం బాగోజి తండాకి చెందిన ధరావత్ కోబ్ల ఇరువురు కలిసి మండలంలోని పలు తండాలు తిరుగుతూ ప్రజల వద్ద నుంచి పిడిఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు సేకరించి హైదరాబాదుకు తరలిస్తూ ఎక్కువ ధరకు విక్రయిస్తూ అధిక సొమ్మును చేసుకుంటున్నారు. ఆదివారం ఉదయం నమ్మదగిన సమాచారం మేరకు మండలంలోని ఎల్బీ తండాలో తనిఖీలు నిర్వహించగా ఎల్బీ తండాలో పిడిఎస్ బియ్యాన్ని సేకరించి ఆటోలో తరలిస్తుండగా 16 క్వింటల పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నామని వీటి విలువ రూ. 32 వేలు ఉంటుందని ఆటోను సీట్ చేసి గుగులోతు రాజు, ధరావత్ కొబ్లపై కేసు నమోదు చేసి దర్యాప్ చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా చేసే వ్యాపారాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

## బొగ్గు వేలంలో పాల్గొనండి.. సింగరేణిని రక్షించండి

- కార్మికుల సంక్షేమానికి కృషి చేయండి
- నైనిలో 3 ఇంటూ 800 సూపర్ పవర్ ప్రాజెక్టు నిర్మించండి!
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇందన శాఖ మంత్రి భట్టి విక్రమార్కని కలిసి విజ్ఞప్తి!
- ఐఎన్ టీ యు సి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఏఐటీయూసీ అధ్యక్షులు సీతారామయ్య

(ప్రత్యేక ప్రతినిధి/ జనం సాక్షి)



బొగ్గు వేలంలో పాల్గొనాలని, సింగరేణిని రక్షించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కలిసి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ లోని ప్రజా భవన్లో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయుసి యూనియన్ ప్రతినిధులు కలసి కోరారు. ముఖ్యంగా కేంద్రం నిర్వహించే బొగ్గు బ్లాకుల వేలం లో పాల్గొనాలని లేక పోతే సింగరేణి కి చాలా నష్టం జరుగుతుందని గత ప్రభుత్వాలు బొగ్గు బ్లాక్ ల వేలంలో పాల్గొనకపోవటం వల్ల సంస్థ కి అతి ముఖ్యమైన కోయగూడెం, సత్తుపల్లి ప్రైవేట్ సంస్థలకు పోయాయని , ఒకవేళ వేలంలో పాల్గొని సింగరేణి కి దక్కినట్టయితే ఏడాదికి 6 మిలియన్ టన్నులు ఉత్పత్తి అదనంగా వచ్చేదని దీని వల్ల ఉత్పత్తి పెరిగి కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలకు ఎక్కువ డిఎం ఎఫ్టి, రాయల్టీ, డివిడెంట్లు చెల్లించడమే కాకుండా చాలా మందికి ఉపాధి అవకాశాలు దొరికేవని తెలిపారు అలాగే సింగరేణి కి పుట్టినిల్లు లాంటి ఇల్లందులో గనులు మూతబడి గత వైభవం కోల్పోతుందని ఇలాంటి సమయం లో కోయగూడెం బొగ్గు బ్లాక్ గత ప్రభుత్వం చేతకాని తనం వల్ల ప్రైవేటు కంపెనీ దక్కించుకున్నారని ఒకవేళ సింగరేణి కి కోయగూడెం వచ్చి ఉంటే ఏడాదికి 3 మిలియన్ టన్నులతో 20 ఏళ్లు బొగ్గు ఉత్పత్తి వచ్చేదని అలాగే అపార బొగ్గు నిక్షేపాలు కలిగి ఉన్న సత్తుపల్లి కూడా వేలంలో దక్కించుకునే అవకాశం రెండు సార్లు వచ్చిన గత ప్రభుత్వ నిర్లక్ష్యం వలన కోల్పోయాం అని గత ప్రభుత్వాల తప్పుడు కుట్ర పూరిత నిర్ణయాల వల్ల సింగరేణి కి రావాల్సిన రెండు బొగ్గు బ్లాక్లు నష్ట పోయామని దీని వలన సింగరేణి కి రాష్ట్ర ప్రభుత్వానికి చాలా నష్టం వాటిల్లిందని, అంతే కాకుండా వేలంలో బొగ్గు బ్లాకు లను సింగరేణి దక్కించుకుంటే సంస్థ కి ప్రభుత్వానికే కాకుండా విద్యుత్ వినియోగదారులకు కూడా మేలు జరుగుతుందని బొగ్గు బ్లాక్ వేలం ప్రక్రియ లో దక్కించుకుంటే 18.5 శాతమే పన్ను చెల్లించాల్సి ఉంటుందని అదే కేటాయింపు ద్వారా దక్కితే 28 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుందని. దీని ద్వారా కంపెనీ కి టన్ను మీద 198 ఆదా అవుతుందని. దీని వల్ల తక్కువ ధర కే విద్యుత్ సరఫరా చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. వీటితో పాటు కార్మికుల సొంత ఇంటి కల, పార్క్స్ మీద ఇన్కమ్ ట్యాక్స్ మాఫీ వంటి వివిధ అంశాలపై చర్చించారు. సానుకూలంగా స్పందించిన భట్టి విక్రమార్క గారు సింగరేణి ని అనేక రంగాల్లో అభివృద్ధి చెందే విధంగా కృషి చేస్తామని త్వరలో కార్మిక సంఘాలతో ఒక సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఐఎన్టియుసి నుండి సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు నర్సింహ రెడ్డి , త్యాగరాజన్, సమ్మయ్య, శంకర్ రావు, జనరల్ సెక్రటరీ వికాస్ కుమార్ యాదవ్ పాల్గొనగా ఏఐటీయూసీ నుండి వైవి రావు, మడ్డి ఎల్లయ్య, జిగురు రవీందర్, బాజీ సైదా, తో పాటు పలువురు ప్రముఖ నాయకులు పాల్గొన్నారు .

## ఎస్సీ వర్గీకరణ తర్వాతే గ్రూప్స్ ఫలితాలు విడుదల చేయాలి

**హైదరాబాద్, మార్చి 9 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 ఫలితాలతో పాటు అన్ని రకాల ఉద్యోగ పరీక్ష ఫలితాలను నిలుపుదల చేయాలని సూర్యాపేట జిల్లా ఆత్మకూరు మండల ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మేడి కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక దీక్షలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేయకుండా, రిజర్వేషన్లు కేటాయించకుండా ఉద్యోగ నియామక ఫలితాలను విడుదల చేస్తే మాదిగ నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎస్సీ వర్గీకరణ చేపట్టిన తర్వాతనే ఉద్యోగ నియామక ఫలితాలు విడుదల చేయాలని, అప్పటివరకు ఫలితాల విడుదలను నిలుపుదల చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి తిప్పర్తి గంగరాజు మాదిగ, మండల ఉపాధ్యక్షులు పెదమర్తి ఉమేష్ మాదిగ, మండల అధికారి ప్రతినిధి మిరియాల చిన్ని మాదిగ పాల్గొన్నారు.

## బాలిక కిడ్నాప్ కేసులో ఇద్దరు అరెస్ట్

- ఆరు గంటల్లో చేదించిన పోలీసులు



**కాటారం మార్చి 9 (జనం సాక్షి) :** బాలికను కిడ్నాప్ చేసిన వ్యక్తులను కాటారం పోలీసులు అరెస్టు చేశారు. కాటారం మండల కేంద్రానికి చెందిన మైనర్ బాలికను కారులో ఇద్దరు వ్యక్తులు అపహరించుకొని పోయరని తల్లి కాటారం పోలీసులకు ఫిర్యాదు చేయగా 6 గంటల్లో కేసులు చేదించి నిందుతులను పోలీసులు అరెస్ట్ చేశారు. కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, సీఐ నాగర్జున రావు ల ఆదేశాల మేరకు ఎస్ఐ అభినవ్ అద్వర్యం లో రెండు టీం లను ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు ద్వార కారుని గుర్తించి హైవే మీద వున్న పోలీసు స్టేషన్ లను అప్రమత్తం చేస్తూ టెక్నాలజీ ఉపయోగించి కిడ్నప్ చేసిన వారిని తొర్రూరు పోలీసు ల సహాయం తో కిడ్నాప్ గురైన మైనర్ బాలికతో పాటు ఇద్దరు వ్యక్తులు అదుపులోని తీసుకొన్నారు. ఆదివారం సర్కిల్ పోలీస్ స్టేషన్ లో ఏర్పడిన సమావేశంలో కాటారం సిఐ నాగార్జున రావు వివరాలను వెల్లడించారు. ఇంస్టాగ్రామ్‌లో పరిచయమైన ప్రేమ అపహరించుకొని పోయే వరకు చేరిందని తెలిపారు. సూర్యాపేట జిల్లా కు చింతలపాడెం మండలం మల్కాపురం గ్రామానికి చెందిన పొల్ల వేణు, నూతకల్ మండలం మిరియాల గ్రామానికి చెందిన పొన్న దిశాంత్ లు అరెస్టు చేసి రిమాండ్కు పంపినట్లు తెలిపారు. ఇంస్టాగ్రామ్ ద్వారా పరిచయమైన అమ్మాయి కిడ్నాప్ చేసి పెళ్లి చేసుకుందామని మాయ మాటలు చెప్పి కారులో ఎక్కించుకొని తీసుకుపోతున్నానని తెలిపారు. కారు, ఒక సెల్ ఫోన్ను సీజ్ చేసి రిమాండ్ తరలించారు. కేసును చాకచక్యంగా వ్యవహరించి గంటల వ్యవధిలో చేదించిన సీఐ నాగార్జున రావు, ఎస్ఐ అభినవ్ తో పాటు ఐటీ కోర్ పిసి వేణు, సైబర్ వింగ్ పిసి స్వామిగౌడ్, పోలీస్ సిబ్బంది పిసి జంపన్న,పిసి లక్ష్మిరాజ్, పిసి లవాన్, రజిని లను కాటారం డిఎస్పీ రామ్మోహన్ రెడ్డి అభినందించారు.

## రక్తహీనతతో గిరిజన బాలింత మృతి

- కుటుంబానికి హెచ్ఆర్ఎఫ్ బృందం పరామర్శ
- బాలింత కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి
- పాప సంరక్షణ కోసం ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలి
- మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు.







**నిర్మల్, మార్చి 9 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా కడెం మండలం ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన కొలాం గిరిజన బాలింత మహిళ రక్తహీనత తో శనివారం తెల్లవారుజామున ఉట్నూర్ లో మృతి చెందిన సంఘటన అందరి హృదయాలను కలచివేసిందని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గిరిజన శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు పేర్కొన్నారు. ఆదివారం మానవ హక్కుల వేదిక నిజ నిర్ధారణ కమిటీ బృందం మృతి చెందిన కొలాం గిరిజన మహిళ స్వ గ్రామమైన నిర్మల్ జిల్లాలోని కడెం మండల పరిధిలోని మారుమూల అటవీ ప్రాంతంలో గల లోతట్టు గ్రామమైన ఇస్లాంపూర్ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను కలిసి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మృతి చెందిన బాలింత అయిన శ్రీవిద్య భర్త మాత్రం భగవంతురావు మాట్లాడుతూ తాము ప్రతినెల ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేపిస్తున్నామని, కానీ 7 8 9 నెలలలో ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేపించలేదని, చివరిగా ప్రసూతి కోసం ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేపించగా బాధితురాలికి ఒక రక్తహీనత ఉందని, వెంటనే నాలుగు బాటిల్ల రక్తం ఎక్కించి ప్రసవం చేశారన్నారు. అనంతరం వైద్యులు శ్రీవిద్యకు గుండె సంబంధిత వ్యాధి ఉన్నదని, ఆమెను హైదరాబాదులోని ఆసుపత్రికి తీసుకెళ్లి మెరుగైన వైద్యం చేపించుకోవాలని సూచించగా తమ వద్ద ఆర్థిక స్తోమత లేనందున బాలింత ఆరోగ్యంగా ఉందని ఆలోచించి ఇంటి వద్దనే ఉన్నామని తెలిపారు. శ్రీవిద్య ప్రసవం అయిన 40 రోజుల నుండి ఆరోగ్యం నిలకడగా ఉండి అకస్మాత్తుగా శనివారం తెల్లవారుజామున గుండె సంబంధిత వ్యాధితో మృతి చెందిందని వివరించారు. గిరిజన శాఖ అధికారులు,వైద్యులు తమ ఆర్థిక ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వ వాహనాన్ని చేకూర్చి మెరుగైన వైద్యం కోసంహైదరాబాదులోని ఆసుపత్రులకు తరలించి ఉంటే తన భార్య శ్రీవిద్య, తనకు, తన కుటుంబ సభ్యులకు, జన్మనిచ్చిన పసిపాపకు దూరమయ్యేది కాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

అనంతరం మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు భుజంగరావు మాట్లాడుతూ కొలాం గిరిజనుల కోసం ప్రత్యేకమైన శాఖ ఉందని, కొలాం డెవలప్మెంట్ ఆఫీసర్, ఐటీడీఏ పీవో, పి వి టి జి లు అంతరించిపోతున్న కొలాం గిరిజనుల అభివృద్ధి కోసం పనిచేస్తున్నాయన్నారు. ఐటీడీఏ లో ప్రత్యేక వాహనాలు కేటాయించి గిరిజనుల అభివృద్ధి కోసం పివిటిజీలు మారుమూల గ్రామాలలో నివసిస్తున్న గర్భవతుల,బాలింతల,పసి పిల్లల ఆరోగ్యం కోసం ప్రభుత్వం పథకాలు ప్రవేశపెట్టినప్పటికీ అవి వారి దరి చేరకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా ఉన్నట్లుకళ్ళకు కట్టినట్టుగా కనిపిస్తుందని భుజంగరావు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక ప్రధాన కార్యదర్శి రఘోత్తమ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అమృత రావు, కమిటీ సభ్యులు మేడమురళీధర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370